thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

## సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 343 కరీంనగర్ మంగళవారం, 18 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చెయ్యాల్సిందే!

#### కాంగ్రెస్, టీఎంసీ, ఆర్జేడీ పార్టీల డిమాండ్

న్యూఢిల్లీ : న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) పార్టీలు పేర్కొన్నాయి. తొక్కిసలాట ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. కేంద్ర ప్రభుత్వం, రైల్వేశాఖ నిర్లక్ష్యం వల్లే ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఘటనతో రైల్వేశాఖ వైఫల్యం మరోసారి బయట పడిందన్నారు. అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయకుంటే కేంద్రమే ఆయనపై వేటు వెయ్యాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియ శ్రీనథే డిమాండ్ చేశారు.

# 'చావో... రేవో...'

## భారమంతా ఆ ముగ్గురిపైనే...!




పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి పెరిగింది. పోలింగుకు మరో పది రోజులు గడువు మాత్రమే ఉండటంతో.. నేతలంతా హడావుడి మొదలుపెట్టి, ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ఎమ్మెల్సీ ఎన్నికలపై.. బీజేపీ ఎక్కువగా ఫోకస్ పెడుతోంది. ఈ ఎన్నికలు ముగ్గురు బీజేపీలకు అత్యంత ప్రతిష్టాత్మకంగా తయారయ్యాయి. బండి సంజయ్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావులు ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నిక కావడంతో ఇది ఆ ముగ్గురికీ కీలకంగా మారింది. ఈ ఎన్నికల ఫలితాలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతాయని లెక్కలు వేసుకుంటున్న కాషాయపార్టీ తమ అభ్యర్థుల విజయానికి సర్వశక్తులు ఒడ్డుతోంది.

**గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 27న ఎన్నిక...** కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల స్థానంతో పాటు టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ ఈ నెల 27న జరగనుంది.. ముఖ్యంగా.. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఎన్నికను.. అటు కాంగ్రెస్‌తో పాటు.. ఇటు బిజెపి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. సుమారుగా 3 లక్షల 50 వేలకు పైగా ఉన్న పట్టభద్రుల ఓట్లు ఆకర్షించడానికి రెండు పార్టీలు ముమ్మర ప్రచారం చేస్తున్నాయి. మొత్తం 45 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోఈ ఎన్నికలు జరగనున్నాయి. ఉత్తర తెలంగాణ మొత్తం మీద ఈ ఎన్నికల ప్రభావం కనినిష్తుంది.

**7 అసెంబ్లీ, 4 పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకున్న బీజేపీ...** గత అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో సత్తా చాటుకుంది. గెలిచిన 8 అసెంబ్లీ స్థానాల్లో ఏడు ఈ జిల్లాల్లోనే దక్కించుకుంది. అలాగే 7 అసెంబ్లీ స్థానాలతో పాటు 4 పార్లమెంట్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. అంతేకాకుండా బీజేపీలో ఫైర్ బ్రాండ్లుగా పేరున్న ముగ్గురు నేతలు ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం పరిధిలో ఉన్నారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఈ ఎమ్మెల్సీ స్థానం పరిధిలోనే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురు నేతలు.. అటు కాంగ్రెస్ తో పాటు ఇటు బీఆర్ఎస్‌పైన తీవ్రస్థాయిలో విరుచుకుపడుతుంటారు. ప్రతి అంశంపై స్పందిస్తారు.

**ఎమ్మెల్సీ ఎన్నికపై ప్రత్యేక దృష్టి పెడుతున్న ఎంపీలు...** ఆ క్రమంలో ఈ ఎన్నికలు ఆ ముగ్గురికి ఎంతో కీలకంగా మారాయి. ఆ ముగ్గురు ఎంపీలు.. ఈ ఎన్నికపై ఫోకస్ పెట్టారు. ఇక్కడ బిజెపి నుంచీ అంజిరెడ్డి బరిలో ఉన్నారు. మొన్నట వరకు పార్లమెంట్ సమావేశాలు ఉన్న నేపథ్యంలో ఎంపీలు ఈ ఎన్నికలకు సరిగ్గా టైం కేటాయించలేకపోయారు. ఇప్పుడు వారు ప్రచారంపై ఫోకస్ పెడుతున్నారు. రాష్ట్రంలో తామే బిఆర్ఎస్‌కి ప్రత్యామ్నాయమని చెప్పుకుంటున్న బీజేపీ నేతలు.. ఈ ఎన్నికల ఫలితాలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతాయన్న భావనతో.. ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నారు. అలాగే ఈ ఎన్నికలు.. ఎంపిల పని తీరును కూడా ప్రతిబింబిచనున్నాయి.

**ఉమ్మడి జిల్లాలోనే లక్ష 70 వేల మంది ఓటర్లు...** ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అధికంగా ఎమ్మెల్సీ ఓట్లు ఉన్నాయి.. ఆ ఒక్క ఉమ్మడి జిల్లాలోనే సుమారు లక్ష 70 వేల మంది ఓటర్లు ఉన్నారు.. ఇక్కడ ఏ పార్టీకి అధికంగా ఓట్లు వేస్తే.. ఆ.. పార్టీ గెలిచే అవకాశం ఉంది. దీంతో బండి సంజయ్.. ఇక్కడ మరింత దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయి ..

ఇప్పటికే పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఓటరు పోలింగు బూత్ వచ్చే విధంగా దృష్టి పెడుతున్నారు. అదే వి ధంగా.. ధర్మపురి అరవింద్‌కు కూడా ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. నిజామాబాద్ జిల్లాలో కూడా.. పట్ట భద్రుల ఓట్లు గణనీయంగా ఉండటంతో ఆయన ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్నారు.

**ప్రతి ఓటర్ని కలిసేలా బీజేపీ ప్రణాళికలు...** బీజేపీ అభ్యర్ధి అంజిరెడ్డి.. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వ్యక్తి.. ఈ నేపథ్యంలో మెదక్ ఎంపి రఘునందన్ రావు ఇక్కడ అధిక ఓట్లు సాధించే విషయంలో దృష్టి పెడుతున్నారు.. రఘునందన్ రావు ఉమ్మడి మెదక్ జిల్లాలో.. పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మొత్తానికి ఈ ముగ్గురు నేతలకు.. ఈ ఎన్నికలు అత్యంత కీలకంగా తయారయ్యాయి. ఇప్పటికే గ్రౌండు లెవల్లో బిజెపి శ్రేణులు ప్రతి ఓటర్ని కలిసే విధంగా ప్రణాళికను రూపొందించుకుంటున్నారు.. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో నియోజకవర్గం ఇన్చార్జ్‌ని నియమించి ప్రతిరోజు రిపోర్ట్ అధిష్టానానికి పంపుతున్నారు. ఈసారి బిజెపి ఈ ఎమ్మెల్సీ ఎన్నికలని చాల సీరియస్‌గా తీసుకొని ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఉంది %ా% ముగ్గురు ఎంపిలు కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ పట్టు జారకుండా శ్రేణులని అలర్ట్ చేస్తూ ఓట్లు రాబట్టుకునే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.




హైదరాబాద్: తెలంగాణ జాతికి మాజీ సీఎం కేసీఆర్ హీరో అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కేసీఆర్ 71వ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ భవన్‌లో వేడుకలు నిర్వహించారు. 71 కిలోల భారీ కేక్‌ను కేటీఆర్, భారాస నేతలు కట్ చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడారు. "కేసీఆర్.. తెలంగాణ కారణజన్ముడు. ఆయన మళ్లీ సీఎం కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు గట్టిగా పనిచేద్దాం.

రానున్న మూడున్నరేళ్లు 60 లక్షల గులాబీ దండు.. ఇదే లక్ష్యంతో ముందుకెళ్లాలి" అని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఇవాళ (సోమవారం) రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. అన్నీ జిల్లాల్లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల వద్ద కేసీఆర్‌కు పాలాభిషేకం చేస్తూ అభిమానాన్ని తెలియజేస్తున్నారు. టపాసులు కాలుస్తూ, స్వీట్లు తినిపించుకుంటూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ అగ్రనేతలు సైతం కేసీఆర్‌కు పుట్టినరోజు విషెస్ చెబుతున్నారు. పుణ్య క్షేత్రాలకు వెళ్లి కేసీఆర్ పేరు మీద పూజలు చేయిస్తున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి టీ20 ఆడేది డబ్బు సంచుల కోసమే: ఎమ్మెల్యే హరీశ్ రావు..

హైదరాబాద్: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఇవాళ (సోమవారం) రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. అన్నీ జిల్లాల్లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల వద్ద కేసీఆర్‌కు పాలాభిషేకం చేస్తూ అభిమానాన్ని తెలియజేస్తున్నారు. టపాసులు కాలుస్తూ, స్వీట్లు తినిపించుకుంటూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ అగ్రనేతలు సైతం కేసీఆర్‌కు పుట్టినరోజు విషెస్ చెబుతున్నారు. పుణ్య క్షేత్రాలకు వెళ్లి కేసీఆర్ పేరు మీద పూజలు చేయిస్తున్నారు. కాగా, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు కూడా కేసీఆర్‌కు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణ భవన్ వద్ద నిర్వహించిన సమావేశంలో మీడియాతో హరీశ్ రావు మట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ.. "బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అంటే ఒక భావోద్వేగం. పదవుల కోసం తెలంగాణ ఉద్యమం చేస్తున్నారని నాటి నాయకులు కేసీఆర్‌ను విమర్శించారు. టీడీపీ నుంచి వచ్చిన మూడు పదవులకూ రాజీనామా చేసి ప్రొఫెసర్ జయశంకర్‌తో కలిసి ఆయన నడిచారు. కేసీఆర్‌ను వ్యక్తిత్వ హననం చేయాలని చూశారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఉక్కు సంకల్పం, మొండి పట్టుదలతో తెలంగాణ కోసం ఆయన పోరాడారు. ఆమరణ దీక్షకు కూర్చొని "కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో" అనే నినాదంతో ముందుకెళ్లారు. కేసీఆర్ దీక్షకు తలొగ్గి అప్పటి కేంద్ర మంత్రి చిదంబరం తెలంగాణ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.




కానీ లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాలని అలా ఇస్తేనే దీక్ష విరమిస్తానని కేసీఆర్ మ్నొండిపట్టుపడ్డారు. ఆ విధంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. తెలంగాణ ఏర్పడిన తర్వాత దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు తెలంగాణను రోల్ మోడల్?గా కేసీఆర్ నిలిపారు. ఆయనిది, తెలంగాణ రాష్ట్రానిది తల్లీబిడ్డ బంధం. కేసీఆర్ పాలనపై కొంత మంది అవాకులు చవాకులు పేలుతున్నారు. టీ20 మ్యాచ్ ఆడుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారు. రేవంత్ టీ20 మ్యాచ్ ఆడేది డబ్బు సంచుల కోసం. కేసీఆర్ డిఫెన్స్ ఆడుతారు.. అవసరమైతే సిక్స్ కొడుతారు. ఇప్పుడు మనం ఓడిపోవచ్చు.. కానీ, వచ్చే ఎన్నికల్లో గెలుపు మనదే. ఈసారి గెలిస్తే మళ్లీ మూడు టర్ములు మనమే ఉంటాం. ఎవరెవరో ఏదేదో మాట్లాడుతున్నారు, అవన్నీ పట్టించుకోవాల్సిన అవసరం లేదని" చెప్పారు.




## ముందే అర్హులనుప్రకటించాలని డిమాండ్

హైదరాబాద్: గ్రేటర్ లో మార్చి మొదటివారంలో వార్డు సభలు నిర్వహించేందుకు బల్దియా కసరత్తు చేస్తోంది.

ఇంతకుముందు ఫిబ్రవరి మొదటి, రెండో వారాల్లో పెట్టాలని అనుకున్నా ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ పూర్తి కాకపోవడంతో నిర్వహించలేదు. ఇప్పుడు ఇండ్ల సర్వే 96 శాతం వరకు పూర్తి కావడంతో మార్చి మొదటివారంలో వార్డు సభలు పెట్టడానికి ప్లాన్ చేస్తున్నారు. ఈ సభల్లోనే రేషన్ కార్డుల అర్హుల జాబితాతో పాటు ఇందిరమ్మ ఇండ్ల అర్హుల లిస్ట్ ప్రకటించనున్నారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 10,70,659 దరఖాస్తులు రాగా, ఇందులో సర్వే ద్వారా అర్హులను గుర్తిస్తున్నారు. శేరిలింగంపల్లిలో ఇందిరమ్మ

## కొత్తగా 75 వేల రేషన్ కార్డులు ఇచ్చేందుకు

# ప్రభుత్వ నిర్ణయం

### మార్చి ఫస్ట్ వీక్‌లో వార్డు సభలు - ఇందిరమ్మ ఇండ్లసర్వే దాదాపు పూర్తి

ఇండ్ల సర్వే వంద శాతం పూర్తి కాగా, కంటోన్మెంట్ లో 85శాతం సర్వే మాత్రమే జరిగింది. మొత్తం పూర్తవడానికి మరో 10 నుంచి 12 రోజులు పట్టే అవకాశం ఉండడంతో వచ్చే నెల మొదటి వారంలో వార్డు సభలు నిర్వహించాలని అనుకుంటున్నారు.

**రేషన్ అర్హుల జాబితా ముందే ప్రకటించాలి...** గ్రేటర్‌లో రేషన్ కార్డుల కోసం 83,285 మంది అప్లై చేసుకోగా, దాదాపు 75వేల మంది అర్హులను ఎంపిక చేశారు. అయితే, వార్డు సభలు పెట్టకపోవడంతో అర్హులను ప్రకటించలేదు. వారం కింద మళ్లీ మీసేవలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పడంతో ఇంతకుముందు అప్లై చేసుకున్నవారు కూడా మళ్లీ దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. రాష్ట్రంలోని మిగతా చోట్ల గ్రామ సభలు పెట్టడంతో అర్హులెవరో, అనర్హులెవరో తేలింది. సిటీలో వార్డు సభలు పెట్టకపోవడంతో సమస్య ఏర్పడింది. ఎట్లాగూ రేషన్‌కార్డుల లబ్ధిదారులను ఫైనల్ చేశారు కాబట్టి వార్డుసభల కంటే ముందే అర్హుల జాబితా ప్రకటించాలని కోరుతున్నారు.



## ఆ జిల్లాల్లో కొత్త రేషన్‌కార్డులు జారీ చేయండి

### 'కోడ్' అమలులో లేని జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులివ్వండి.. సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్: కొత్త రేషన్ కార్డుల జారీకి వెంటనే చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ అధికారులతో జరిపిన సమీక్షలో కీలక ఆదేశాలు జారీ చేశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున.. ఈ కోడ్ అమలులో లేని జిల్లాల్లో వెంటనే రేషన్ కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కొత్త కార్డులకు సంబంధించి పలు డిజైన్లను సీఎం పరిశీలించారు.

ఇప్పటికే లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కొత్త వారితో పాటు కార్డులు ఉన్నవారు సైతం కొత్తగా సభ్యులను చేర్చేందుకు దరఖాస్తులు చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు.



## ఆ బిల్లుపై మోదీని ఒప్పించే దమ్ముందా?

### ఆ బిల్లుపై మోదీని ఒప్పించే దమ్ముందా.. సంజయ్?: మహేశ్ కుమార్ గౌడ్ సవాల్

హైదరాబాద్: భాజపా నేత, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లు తెస్తామని.. ఈ బిల్లును 9వ షెడ్యూల్‌లో పెట్టించే దమ్ముందా? అని సంజయ్‌ను ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో జరిగిన ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. "బీసీ రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని మోదీని ఒప్పించే దమ్ముందా.. బండి సంజయ్? దేశవ్యాప్త కులగణనకు మోదీని అడిగే సత్తా ఉందా? దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా భవిష్యత్తు బీసీలదే. భాజపా, భారాసలు బీసీ నేతను సీఎంని చేయగలవా? బీసీ నేతను సీఎం చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉంది"అని అన్నారు.

## భక్త జనసంద్రంగా మారిన పెద్దగట్టు




సూర్యాపేట: శ్రీ లింగమంతులస్వామి పెద్దగట్టు జాతర ప్రారంభమైంది. ఆదివారం అర్ధరాత్రి దేవరపెట్టె చేరుకోవడంతో దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర ప్రారంభమైంది.

'ఓ లింగ... ఓ లింగా' నామస్మరణతో పెద్దగట్టు మారుమ్రోగుతోంది. గుట్ట చుట్టూ వాహనాలు చేరి.. జాతర భక్త జనసంద్రంగా మారింది. సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి లింగమంతుల స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతర సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ సెలవులు ప్రకటించారు.

**జాతరలో కీలకమైన దేవరపెట్టె...** కాగా తెలంగాణలో సమ్మక్క సారలమ్మ జాతర తరువాత రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన సూర్యాపేట శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర ఆదివారం రాత్రి ప్రారంభమైంది. జాతరలో కీలకమైన దేవరపెట్టె (అందెనపు చౌడమ్మ, లింగమంతుల స్వామి ఉత్సవ మూర్తులు)కు ఆనవాయితీ ప్రకారం కేసారం గ్రామంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవరపెట్టెను ఊరేగింపుగా ఆదివారం అర్ధరాత్రికి దురాజ్‌పల్లిలోని పెద్దగట్టుకు చేర్చారు. దీంతో జాతర ప్రారంభమైనట్లు నిర్వాహకులు ప్రకటించారు. కేసారంలోని మెంతబోయిన వంశస్తులకు చెందిన దేవరగుడిలో దేవరపెట్టెకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మున్నా, గొర్ల, కులస్తులతోపాటు సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీషరెడ్డి, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేషరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్ కు సీఎం రేవంత్ బర్త్ డే విషెస్.. ఏం అన్నారంటే!

బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్‌కు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బర్త్ డే విషెస్ చెప్పారు. " గజ్వేల్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారి జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారు వారికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు"అంటూ ట్వీట్ చేశారు. అయితే ఈ ట్వీట్ సీఎం రేవంత్ స్వయంగా చేయలేదు కానీ తెలంగాణ సీఎంవో నుంచి ఈ ట్వీట్ వెలువడింది.

**మంత్రి పొన్నం ప్రభాకర్...** మరోవైపు మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం కేసీఆర్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. " గజ్వేల్ శాసనసభ్యులు గౌరవనీయులైన శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఆరోగ్యంగా, సుఖశాంతులతో దీర్ఘాయుష్షుతో ఉండాలని కోరుకుంటున్నాను!" అంటూ ట్వీట్ చేశారు.

**హరీష్ రావు ఎమోషనల్ ట్వీట్...** కేసీఆర్ పై ఎమోషనల్ ట్వీట్ చేశారు హరీష్. " మీరు నా తలనిమిరే తల్లిప్రేమ, నాకు ఎనలేని మమకారం పంచిన మేనమామ.. నాకు రాజకీయ చైతన్యాన్ని నేర్పించి, నాలో ప్రజా సేవా సంస్కారాన్ని రంగరించి, నన్ను ఉద్యమ కార్యాచరణలో నడిపించి, నాలోని నాయకత్వ గుణాన్ని ప్రేరేపించి, నాకు పరిపాలనా సామర్థ్యాన్ని కల్పించి, నన్ను చరితార్థుణ్ణి చేసిన మీరు శత వసంతాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను అంటూ హరీష్ ట్వీట్ చేశారు.

## రాహుల్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలు.. సీతక్క ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 17: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యల పట్ల మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన సంక్షేమ ఫలాలు, రిజర్వేషన్లు కల్పించాలన్నదే రాహుల్ గాంధీ అభిమతమని స్పష్టం చేశారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయాలని రాహుల్ గాంధీ కులగణన కోసం డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా బీసీ కులగణన కోసం పట్టుబడుతున్నారన్నారు. కులగణన అంశాన్ని పక్కదారి పట్టించేందుకు రాహుల్ గాంధీని బీజేపీ నేతలు టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ విజన్ ఉన్న నాయకుడని తెలిపారు. 30 సంవత్సరాలుగా ఎలాంటి మంత్రి పదవుల్లో లేకుండా దేశం కోసం పనిచేస్తున్నారని చెప్పుకొచ్చారు. అందుకే గ్రామ స్థాయి నుంచి ప్రధాని వరకు రాహుల్ గాంధీని టార్గెట్ చేస్తూ కించపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. విద్వేష, విధ్వంసమే బీజేపీ విధానమని వ్యాఖ్యలు చేశారు.

ప్రేమ, శాంతి, సమానత్వం కోసం రాహుల్ గాంధీ పనిచేస్తున్నారని చెప్పారు. బీజేపీ విద్వేష విధ్వంసాలు కావాలో.. కాంగ్రెస్ శాంతి, సమానత్వం, అభివృద్ధి కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. కుల గణన అంశాన్ని డైవర్ట్ చేయడం కోసమే రాహుల్ మతంపై చర్చ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా దేశం కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం బీజేపీ చేసింది ఏమీ లేదన్నారు. విభజన రాజకీయాలతో పదవులు పొందటం బీజేపీ నేతల నైజమని వ్యాఖ్యలు చేశారు. రాహుల్ పదవుల కోసం పాకులాడే మనిషి కాదన్నారు. త్యాగాల వారసత్వంతో సమాజ అభివృద్ధి కోసం, సమసమాజ లక్ష్యం కోసం రాహుల్ పోరాటం చేస్తున్నారని వెల్లడించారు.

## కేసీఆర్ పుట్టినరోజు.. కేటీఆర్ ఎమోషనల్ కామెంట్స్





హైదరాబాద్: నేడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ప్రముఖులు, పార్టీ నేతలు, రాజకీయ నాయకుడు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తాజాగా కేసీఆర్ తనయుడు కేటీఆర్.. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ట్విట్టర్ వేదికగా ఎమోషనల్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ట్విట్టర్ వేదికగా..'ప్రతీ తండ్రీ తమ పిల్లల హీరో అని అంటారు. నా తండ్రి నా ఒక్కడికే కాదు.. తెలంగాణ హీరో కావడం నా అదృష్టం. కల కనడం.. దాని కోసం హద్దులేని నిబద్ధతతో బయలుదేరారు. విమర్శకులను ఎదుర్కోవడం, అది ఎలా నెరవేరుతుందో వారికి గర్వంగా చూపించారు. తెలంగాణ అనే కలను ప్రేమించారు. వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించకుండా తెలంగాణ సాధించారు. మీరు గర్వంగా మీ కొడుకని పిలుచుకునే వ్యక్తి కావడమే నా లక్ష్యం. మీ వారసత్వానికి అర్హులుగా ఉండటానికి ప్రతీక్షణం కృషి చేస్తా' అంటూ ఎమోషనల్ కామెంట్స్ చేశారు.



## దిల్లీ భూకంపం.. బూమ్ శబ్దం ఎందుకొచ్చింది..?

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ పరిసర ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజామున భూకంపం సంభవించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దిల్లీ, నోయిడా, గురుగ్రామ్ ప్రాంతాల్లో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 4.0గా నమోదైంది. ధౌలా కాన్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలేజీ సమీపంలో 5 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రకంపనలు సంభవించిన సమయంలో కొన్ని సెకన్ల పాటు పెద్ద శబ్దం వినిపించింది. అసలు ఆ శబ్దానికి గల కారణాలను నిపుణులు వెల్లడించారు. తక్కువ లోతున ఉండే భూకంప కేంద్రం ఏర్పడినప్పుడు ప్రకంపన సమయంలో ఈ బూమింగ్ శబ్దాలు వినిపిస్తుంటాయి. ఆ సమయంలో భూమిపై ప్రకంపనలు రావడంతో పాటు, స్వల్పకాలం వచ్చిన భూతరంగాలు గాలిలో కలిసి ధ్వని తరంగాలుగా ఏర్పడతాయని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. అధిక ఫ్రీక్వెన్సీ కంపనాల కారణంగా 'బూమ్' శబ్దం వస్తుందని పేర్కొంది. కొన్నిసార్లు కంపనాలు జరగకపోయినప్పటికీ.. ఈ భారీ శబ్దాలు వెలువడేందుకు అవకాశం ఉంది. భూమి ఉపరితలం నుంచి 70 కి.మీ. లోతులో ఉంటే షాలో ఫోకస్ ఎర్త్‌క్వేక్స్‌గా పరిగణిస్తారు. కేంద్రం లోతు ఎంత తక్కువగా ఉంటే.. అంత ఎక్కువగా శబ్దాలు వినిపిస్తాయి. ఈరోజు దిల్లీ, బిహార్‌లో వచ్చిన ప్రకంపనల్లో భూకంప కేంద్రాలు 5 కి.మీ నుంచి 10 కి.మీ లోతులోనే ఉన్నాయి. దిల్లీ సీస్మిక్ జోన్ 4లో ఉంది. దేశాన్ని నాలుగు భూకంప మండలాలుగా విభజించారు. మండలం-2 అనేది 4.9 కన్నా తక్కువ తీవ్రత ఉండే ప్రాంతం. దేశ భూభాగంలో ఇది 40.93 శాతం. కర్ణాటక పీఠభూమి, ద్వీపకల్ప ప్రాంతాలు ఇందులో ఉన్నాయి. మూడో మండలం 5-5.9 తీవ్రతను కలిగిఉంటుంది. ఇది దేశ విస్తీర్ణంలో 30.79 శాతం. పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బిహార్, ఝార?ండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలతో పాటు కేరళ, గోవా, లక్షద్వీప్ దీవులు ఇందులో ఉన్నాయి.

**దిల్లీలో ప్రకంపనలు.. గంటల వ్యవధిలోనే బిహార్‌లో మరో భూకంపం...** భూకంప మండలం-4లో అధికస్థాయి భూకంపాలు (6- 6.9) వస్తాయి. దేశంలో 17.49శాతం భూభాగం ఇటువంటిదే. ఇందులో జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, దిల్లీ, సిక్కిం, ఉత్తరప్రదేశ్‌లోని ఉత్తర ప్రాంతాలు, బిహార్, పశ్చిమ్ బెంగాల్, మహారాష్ట్ర పశ్చిమ తీరం, రాజస్థాన్‌లు ఉన్నాయి. మండలం-5లో 7కన్నా ఎక్కువ తీవ్రమైన భూకంపాలు సంభవిస్తాయి. 10.79శాతం భూభాగంలో ఇలాంటివి చోటుచేసుకునే ప్రమాదముంది. దీని పరిధిలో ఉత్తర బిహార్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్‌లోని రాన్-ఆఫ్-కచ్, అండమాన్-నికోబార్ దీవులున్నాయి.

**అందుకే హిమాలయాల్లో భూకంపాలు ఎక్కువ..** సహజంగా శక్తి విడుదలైనప్పుడు భూమి కంపిస్తుంది. ఆ సమయంలో భూకంప కేంద్రం నుంచి అన్ని దిశల్లోనూ తరంగాలు ప్రయాణిస్తాయి. భూఫలకలు మానవ స్పర్శకు తెలియని స్థాయిలో నిరంతరం కదులుతూనే ఉంటాయి. అయితే, ఆ సమయంలో భూపొరలు బలహీనంగా ఉన్నచోట్ల ఒక్కోసారి కంపనాలు సంభవిస్తాయి. భూఫలకల అంచుల చుట్టూ తరచూ భూకంపాలు చోటుచేసుకుంటాయి. ఉదాహరణకు, భారతదేశ భూఫలక ఉత్తర దిశగా, ఈశాన్యం వైపు కదులుతూ ఉంటుంది. ఈ ఫలక సంవత్సరానికి 5సెం.మీ. చొప్పున కదులుతుంది. భారతదేశానికి పైభాగంలో ఉన్న యురేషియన్ భూఫలక ఉత్తర దిశగా ఏడాదికి 2 సెం.మీ. చొప్పున కదులుతోంది. ఈ రెండు ఫలకల కదలికల్లో తేడాలు ఉండటం వల్ల భారత భూఫలక యురేషియన్ ఫలకను ఢీకొడుతోంది. అందుకే హిమాలయాల ప్రాంతాల్లో తీవ్ర భూకంపాలు వస్తున్నాయి. దిల్లీలో మళ్లీ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచించిన సంగతి తెలిసిందే. భద్రతా చర్యలు పాటించాలని కోరారు. భూవిజ్ఞాన శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా ప్రజలను అప్రమత్తం చేశారు. జాగ్రత్తలు పాటిస్తూ సంసిద్ధంగా ఉండాలని కోరారు. ఎప్పటికప్పుడు వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

## ప్రయాణికులకు మరో గుడ్ న్యూస్: ఆర్టీసీ ఎండీ



తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ).. ప్రయాణికులకు గుడ్ న్యూస్ చెప్పింది. తమ చెందిన బస్సులో ప్రయాణించే ప్రయాణికులకు టికెట్ ఛార్జీలో రాయితీ ఇస్తామని ప్రకటించింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మహిళల కోసం మహాలక్ష్మీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. దీని వల్ల ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి మహిళలు మక్కువ చూపుతున్నారు. అదీకాక.. మహిళ ఉచిత ప్రయాణ పథకం వల్ల ప్రభుత్వానికి భారీగా నగదు వస్తుందంటూ సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. అదే విధంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించే వారికి 10 శాతం రాయితీ ఇస్తామని టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. అయితే ఇది అన్ని రూట్లలో కాదని.. బెంగళూరు- హైదరాబాద్ మార్గంలో మాత్రమేనని క్లియర్ కట్‌గా స్పష్టం చేసింది. బెంగళూరు మార్గంలో నడిచే అన్ని సర్వీసుల్లోనూ.. ఈ రాయితీని అమలు చేస్తున్నామని స్పష్టం చేసింది. ఈ రాయితీ వల్ల ఒక్కొక్క టికెట్‌పై రూ. 100 నుంచి రూ.160 వరకు ఆదా చేసుకోవచ్చని ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. ఈ మార్గంలో టికెట్లు ముందస్తు రిజర్వేషన్ కోసం https://tgsrtcbus.in వెబ్ సైట్‌ని సందర్శించాలని సూచించారు. దేశంలో అది పెద్ద నగరాల్లో బెంగళూరు ఒకటి. అక్కడ సైతం తెలంగాణ ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ లక్షల సంఖ్యలో ఉన్నారు. అలాగే పలువురు వ్యాపార నిమిత్తం తరచూ కర్ణాటక రాజధాని బెంగుళూరు వెళ్లి వస్తూ ఉంటారు. అంతేకాదు.. ప్రభుత్వ కొలువులు నిర్వహించే ఉన్నతాధికారులు సైతం అక్కడ ఉన్నారు. వారందరిని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు ఈ రాయితీని తీసుకు వచ్చారని సమాచారం. మరోవైపు శని, ఆదివారాలు సెలవులు. ఈ నేపథ్యంలో బెంగుళూరు నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళ్లి వచ్చారు అత్యధికంగా ఉంటారు. అలాంటి వారు.. ఈ రాయితీ పథకాన్ని వినియోగించుకొంటే వారికి నగదు ఆదా అవుతోందని ఆర్టీసీ అధికారులు వివరిస్తున్నారు. ఇంకోవైపు.. హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గాల్లో సైతం ఈ తరహా ప్రవేశపెట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. అదీకాక ఇప్పటికే ఆర్టీసీ ఎండీ, వైస్ చైర్మన్ వి.సి. సజ్జనార్.. హైదరాబాద్ – బెంగళూరు మార్గంలో ప్రయాణికులకు రాయితీ కల్పిస్తున్నట్లు.. ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. అందుకు సంబంధించిన వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## మేడ్చల్ హత్య కేసు.. ఐదుగురు నిందితుల అరెస్ట్



హైదరాబాద్: మేడ్చల్ లో ఆదివారం పట్టపగలు జరిగిన ఉమేశ్ హత్య కేసు వివరాలను డీసీపీ కోటిరెడ్డి వివరించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశామని చెప్పారు. నిందితుల నుంచి 2 కత్తులు, 4 ఫోన్లు, 2 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. "హతుడు ఉమేశ్‌పై కామారెడ్డి పీఎస్‌లో 14 కేసులు ఉన్నాయి. మద్యానికి బానిసై కుటుంబసభ్యులను వేధించేవాడు. అతడి తీరుతో విసిగిపోయి సోదరుడు రమేశ్ హత్య చేశాడు. నలుగురితో కలిసి ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం" అని డీసీపీ తెలిపారు. మేడ్చల్‌లో జాతీయ రహదారి-44పై పట్టపగలు అందరూ చూస్తుండగానే ఉమేశ్‌ను అతని సొంత తమ్ముడు, చిన్నాన్న కుమారుడు వెంటాడి, వేటాడి కత్తులతో పొడిచి చంపిన ఘటన కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే.

# తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన తీరు తెన్నులు

## - ఫిబ్రవరి 18... తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన దినం



2014 ఫిబ్రవరి 18వ తేదీ. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన రోజు. హెూం మంత్రి సుశీల్ కుమార్ షిండే ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్ట బోతున్నారని ఉదయాన్నే ఎంపీలకు, మీడియాకు స్పష్టమైన అవగాహన ఉంది. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచే పార్లమెంటు ఆవరణ ఉత్కంఠ భరితంగా మారింది. తెలంగాణ ఏర్పాటు అంశం క్షణ క్షణానికి టెన్షన్ పెంచుతోంది. నిముష నిమిషానికీ ఆందోళన అధికం అవుతోంది. ఊహించని ఒక మలుపు తిరుగుతోంది. తెలంగాణ ప్రాంత ఎంపీలు ఆ రోజు తాడో పేడో తేల్చుకోవాలని, ఎలాగైనా తెలంగాణను సాధించుకోవాలన్న పట్టుదలతో ఉన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందకుండా ఎలాగైనా అడ్డుకుంటామని ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఎంపీలంతా అప్పటికే పలు వేదికల ద్వారా ప్రకటించు కున్నారు. ఉత్కంఠ వాతావరణంలో ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైంది. కేంద్ర మంత్రులుగా ఉన్న చిరంజీవి, పురంధేశ్వరి, కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డిలతో పాటు ఎంపీలు కనుమూరి బాపిరాజు, హర్షకుమార్ తదితరులు స్పీకర్ పోడియం వద్దకు వెళ్ళి తమ నిరసన తెలిపారు. తప్పని స్థితిలో స్పీకర్ మీరాకుమార్ సభను 12 గంటలకు వాయిదా వేశారు. ఈలోగా ప్రతిపక్ష నేత సుష్మా స్వరాజ్‌తో కేంద్ర మంత్రి కావూరు సాంబశివరావు చర్చలు జరిపారు. అప్పటికే తెలంగాణ బిల్లుకు బీజేపీ పలు సవరణలను ప్రతిపాదించింది. అయితే, అవి రాజకీయ లబ్ధి కోసం చేసిన సవరణలని, వాటిని పరిగణనలోకి తీసుకోవాల్సిన పనిలేదని హెూం శాఖ సహాయ మంత్రి ఆర్పీ సింగ్ విలేకరులతో అన్నారు. తెలంగాణ బిల్లు నిలిచి పోతుందనే భావన అప్పటికి ప్రబలమవుతోంది. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యుపీఏ 2 ప్రభుత్వానికి అవే ఆఖరి పార్లమెంటు సమావేశాలు. ఆ సమావేశాలు మరో మూడు రోజుల్లో ముగిసి పోనున్నాయి. లోక్‌సభ లోను, ఆ తర్వాత రాజ్యసభ లోనూ తెలంగాణ బిల్లు ఆమోదం పొందాల్సి ఉంది. తెలంగాణ బిల్లును సభలో ప్రవేశపెట్టాలంటే.. నిబంధనల ప్రకారం దాని కంటే ముందు ఆంధ్రా ఎంపీలు ప్రభుత్వంపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని స్పీకర్ పరిష్కరించాల్సి ఉంటుంది. తెలంగాణ విషయంలో అప్పటి వరకూ ప్రభుత్వం వ్యవహరించిన తీరు, ఆ రోజు సభలో జరుగుతున్న పరిణామాలను గమనించిన లాల్ కృష్ణ అద్వానీ బీజేపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయం లోనే ఉండి పోయారు. ఆరోజు సభ వాతావరణాన్ని బట్టి తెలంగాణ బిల్లు ఆమోదం పొందదని అద్వానీ భావించారని అందరూ అనుకున్నారు. 15వ లోక్‌సభకు అవే చివరి సమావేశాలు, అవీ మూడు రోజుల్లో ముగిసి పోనున్న సమయంలో రాష్ట్ర విభజన వంటి బిల్లుని లోక్‌సభ ఆమోదించదని అద్వానీ అభిప్రాయ పడడం అత్యంత సహజం. అయితే తనను కలిసిన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సుష్మా స్వరాజ్ 'ఎవరేమనుకున్నా సరే.. నేను తెలంగాణకు మద్దతు ఇస్తాను' అని ఆమె హామీ ఇచ్చారు. అయితే, 'మీ కమల్‌నాథ్ (పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి) అటూ.. ఇటూగా ఉన్నారు. చూసుకోండి' అని ఆమె ఎంపీ లకు తెలిపిన సందర్భంలో... జైపాల్ రెడ్డిని వెంటబెట్టుకుని వారు స్పీకర్ కార్యాలయానికి వెళ్లగా, అక్కడికి సుష్మా స్వరాజ్‌ను కూడా పిలిపించారు. తెలంగాణ ఏర్పాటుపై మీకు చిత్తశుద్ధి లేదంటే మీకు చిత్తశుద్ధి లేదంటూ ఇరువర్గాలు పరస్పరం ఆరోపించు కున్నాయి. సుష్మా స్వరాజ్ మాత్రం . 'మీరు బిల్లు పెట్టండి. మేం సహకరిస్తాం' అని స్పష్టంగా చెప్పారు. దీంతో జైపాల్ రెడ్డి స్పందిస్తూ.. స్పీకర్ స్థానానికి ముందు భాగంలో ఎంపీలు నిలబడి ఆందోళనలు చేస్తుంటే తెలంగాణ బిల్లును ఎలా ఆమోదిస్తారు? (నిబంధనలు అంగీకరిస్తాయా?) అని అడిగారు. ఎందుకంటే.. తెలంగాణ బిల్లు ఆమోదానికి సభలో మూడింట రెండు వంతుల మెజార్టీ అవసరం. దీనికి ఓటింగ్ కూడా జరపాల్సి ఉంటుంది. సెక్రటరీ జనరల్ నిబంధనలను వివరిస్తూ.. 367 %-%3 నిబంధన ప్రకారం డివిజన్ లేకుండా "హెడ్ కౌంట్"తో బిల్లును ఆమోదించ వచ్చని చెప్పగా స్పీకర్ పాత రికార్డులను పరిశీలించారు. సభకు నిరాటంకంగా అంతరాయాలు కలుగుతున్నప్పుడు, అధికార, ప్రతిపక్ష పార్టీలు అంగీకరిస్తే హెడ్ కౌంట్ (ఎంపీలను నిలబెట్టి, లెక్కించడం) సరిపోతుందని తేల్చి చెప్పారు. దీంతో సుష్మా స్వరాజ్ నిర్ణయం కీలకమైంది. ఆమె అంగీకరిస్తేనే స్పీకర్ మీరాకుమార్ హెడ్ కౌంట్ పద్ధతికి ఒప్పుకునే అవకాశం ఉంది. సుష్మా స్వరాజ్ దానికి అంగీకరించారు. 'మీరు బిల్లు పెట్టండి. నేను లేచి నిలబడి మాట్లాడతాను. తర్వాత హెూం మంత్రి ఒక్కొక్క క్లాజు చదువుకుంటూ వెళ్లమనండి. అలాగే ఓటింగ్ కూడా పెట్టండి' అని సూచించారు. దీనికి అంతా అంగీకరించారు". నిజానికి అప్పటికి బీజేపీలో తెలంగాణ ఏర్పాటును అంతర్గతంగా వ్యతిరేకిస్తున్న వర్గం కూడా ఉంది. అయితే, నిజానికి బిల్లును పెట్టడానికంటే ముందే సోనియాగాంధీ... ప్రధాని మన్మోహన్ నివాసంలో అద్వానీ, సుష్మా స్వరాజ్‌లను లంచ్‌కు పిలిచి, తెలంగాణకు సహకరించాలని కోరారు. సుష్మా స్వరాజ్ పలుమార్లు పార్లమెంటు లోపల, బయట తెలంగాణకు మద్దతు ఇస్తామని హామీలు ఇచ్చారు. ఆ హామీలకు కట్టుబడి ఉండాలని, మాట తప్పకూడదన్న ఒకే ఒక విచక్షణతో తెలంగాణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడంలో ఆమె కీలకపాత్ర పోషించారు. లోక్‌సభలో తెలంగాణ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నాయకురాలి హెూదాలో సుష్మా స్వరాజ్ ప్రసంగించగా, కాంగ్రెస్ పార్టీ తరపున జైపాల్ రెడ్డి ప్రసంగించారు. బిల్లును ప్రవేశపెట్టిన హెూం మంత్రి సుశీల్ కుమార్ షిండేతో కలిపి చర్చలో ప్రసంగించింది మొత్తం ముగ్గురు మాత్రమే కావడం గమనార్హం. బిల్లుపై ఓటింగ్ జరిగేప్పుడు హెడ్ కౌంట్ పద్ధతిని పాటించాలని స్పీకరే నిర్ణయం తీసుకున్నారని, దాన్ని తాము అంగీకరించామని బిల్లు ఆమోదం పొందిన తర్వాత పార్లమెంటు భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో సుష్మా స్వరాజ్ వివరించారు. అలా ఈ క్రమంలో 2014, ఫిబ్రవరి 18న తెలంగాణ ఏర్పాటు బిల్లుకు భారతీయ జనతా పార్టీ మద్దతుతో లోక్‌సభలో, ఫిబ్రవరి 20న రాజ్యసభ ఆమోదం పొందింది. తెలంగాణ బిల్లు ఆమోదం కోసం సంపూర్ణ మద్దతును ఇస్తామని హామీ ఇచ్చి, ఆచరించి ఆమోదం పొందింప చేసినందుకే సుష్మా స్వరాజ్ ను తెలంగాణ చిన్నమ్మగా తెలంగాణ ప్రజలు చిరకాలం గుర్తుంచు కుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# శ్రీ చైతన్య మహాప్రభువు... భక్తి ఉద్యమానికి మేలుకొలుపు

## ఫిబ్రవరి 18...చైతన్య మహాప్రభువు జయంతి



చైతన్య మహాప్రభువు ( ఫిబ్రవరి 18, 1486 - జూన్ 14, 1534) భారతీయ భక్తి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఒక మహా యోగి, భక్తుడు. ఆయనను శ్రీకృష్ణుని అవతారంగా భావిస్తారు. ముఖ్యంగా హరీనామ సంకీర్తన ద్వారా కృష్ణభక్తిని ప్రచారం చేసి, భక్తి మార్గాన్ని సమస్త జనులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆయన జీవితం, బోధనలు, భక్తి మార్గంపై ప్రభావం భారతీయ సంస్కృతికి అపారమైన మార్గదర్శనం కల్పించాయి. శ్రీ చైతన్య మహాప్రభువు 1486లో పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాలో, మాయాపూర్ గ్రామంలో జన్మించారు. ఆయన అసలు పేరు విశ్వంభర మిశ్రా. చిన్నతనం నుంచే అపారమైన మేధస్సుతో, సంస్కృత శాస్త్రాలలో ప్రావీణ్యం సాధించి, యువకాలంలోనే గొప్ప తత్వవేత్తగా పేరుగాంచారు. ఆయనను అభిమానంతో నిమాయి పండిట్ అని పిలిచేవారు. విద్యాభ్యాసం పూర్తయిన తరువాత, కృష్ణ భక్తి మార్గంలో నిమగ్నమై హరి నామ సంకీర్తన చేయడం ప్రారంభించారు. ప్రజలందరికీ కృష్ణభక్తిని చేరువ చేయడం తన జీవిత ధ్యేయంగా మలుచు కున్నారు. ఆయన భార్య లక్ష్మీదేవిని కోల్పోయిన తరువాత మరింత భక్తి మార్గంలో శ్రద్ధ పెట్టి, ఆధ్యాత్మికతను స్వీకరించారు. 1510లో, కేశవ భారతీ స్వామి వద్ద సన్యాసం స్వీకరించి "శ్రీ కృష్ణ చైతన్య" అనే పేరు పొందారు. అనంతరం జగన్నాథ పురీలో స్థిరపడి, అక్కడ కీర్తన, భక్తి ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఆయన అనుచరులతో కలిసి పలు ప్రాంతాలు సందర్శించి, కీర్తనల ద్వారా భక్తి మార్గాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. భగవంతుని నామస్మరణే మోక్షానికి మార్గమని ప్రకటించి, హరే కృష్ణ మహామంత్రాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. కేవలం బ్రాహ్మణులకే భక్తి సాధ్యమనే తప్పుడు భావనను ఖండించి, అన్ని వర్గాల వారికీ భక్తి మార్గం తెరిచారు. జీవాత్మ, పరమాత్మ ఒకటే అయినప్పటికీ, ఒక ప్రత్యేక స్వరూపాన్ని కలిగి ఉంటాయని ఉపదేశించారు. భగవంతుడి పట్ల అపారమైన ప్రేమ, విరహ తపన ద్వారా పరమ ఆనందాన్ని పొందవచ్చని చెప్పారు. రాజులు, మునులు, ప్రజలు, దళితులు, విదేశీయులందరికీ కృష్ణ భక్తిని తెలియజేశారు. చైతన్య మహాప్రభువు జాగృతావస్థలోనూ, సమాధి స్థితిలోనూ అత్యున్నత భక్తి స్థాయిని అనుభవించేవారు. జాగృతావస్థలో కృష్ణ వియోగ వేదనలోని సుఖాన్ని, సమాధిలో కృష్ణ సంయోగ సుఖాన్ని అనుభవించేవారని ఆయన అనుచరులు చెబుతారు. ఆయన సిద్ధాంతాలను అనుసరించి ఆయన శిష్యులు అనేక గ్రంథాలు రచించారు. ప్రసిద్ధ రచనలలో రూప గోస్వామి %-% భక్తి రసామృత సింధువు, ఉజ్జ్వల నీలమణి, సనాతన గోస్వామి %-% వైష్ణవతోషిణి జీవ గోస్వామి %-% సత్సందర్భం, భాగవత టీక, భక్తి సిద్ధాంతం, ఉపదేశామృతం. ఈ గ్రంథాలు గౌడియ వైష్ణవ సంప్రదాయానికి మూలస్తంభాలుగా నిలిచాయి. చైతన్య మహాప్రభువు 1534 జూన్ 14న తన 48వ ఏట జగన్నాథ ఆలయంలో పూజా నిమిత్తం ప్రవేశించి, తిరిగి వెలుపల రాలేదని ఒక కథనం ఉంది. మరికొన్ని కథనాల ప్రకారం, ఆయన భగవత్తత్వంలో మునిగిపోయి నదిలో అంతరించి పోయారని చెబుతారు. చైతన్య మహాప్రభువు భక్తి ఉద్యమానికి ఊపిరిపోసిన మహానుభావుడు. ఆయన జీవితం, బోధనలు కేవలం భారత దేశానికే కాదు, ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులకు మార్గదర్శనం చేస్తున్నారు. ఆయన ప్రవేశపెట్టిన హరి నామ సంకీర్తన సంప్రదాయం నేటికీ కొనసాగుతూనే ఉంది.

**"హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే ఎ**
**హరే రామ హరే రామ రామ రామ హరే హరే"**

ఈ మహామంత్రం ద్వారా భక్తి మార్గంలో అంతులేని ఆనందాన్ని అనుభవించవచ్చు అని శ్రీ చైతన్య మహాప్రభువు చూపిన మార్గం యుగయుగాల పాటు వెలుగొందుతూనే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# భారత్ ఎన్నికల్లో అమెరికా నిధులు.. మస్క్ షాకింగ్ నిర్ణయాలు!




ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ అయిన భారతదేశంలో జరిగిన ఎన్నికల్లో అగ్రరాజ్యం అమెరికా నిధుల పాత్ర ఇప్పుడు సంచలనంగా మారింది. డోజ్ సారథి ఎలాన్ మస్క్ చేసిన ఓ ప్రకటన ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భారత్ లో జరిగే ఎన్నికల్లో ఓటరు సంఖ్యను పెంచేందుకు అందించే సాయాన్ని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అవును... అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృతంలోని అమెరికాలో కొత్త ప్రభుత్వం బడ్జెట్ కోతలకు తెరలేపిన సంగతి తెలిసిందే. దీనికోసం ప్రత్యేకంగా మస్క్ నేతృత్వంలో డోజ్ ను ఏర్పాటుచేశారు. ఈ సమయంలో భారతదేశం సహా పలు దేశాలకు అందించే మిలియన్ డాలర్ల నిధులను రద్దు చేసింది. అయితే.. ఆ నిధులు భారత్ లో ఎన్నికలకు సంబంధం ఉండటం తీవ్ర చరనీయాంశంగా మారింది. ఇందులో భాగంగా... భారత్ లో జరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అందించే 21 మిలియన్ డాలర్లను రద్దు చేసినట్లు డోజ్ పేర్కొంది. డిపార్ట్ మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించింది. దీంతో.. భారత్ లో రాజకీయ దుమారం రేగే అవకాశం ఉందా అనే చర్చ తెరపైకి వచ్చిందని అంటున్నారు. ఇటీవల డొనాల్డ్ ట్రంప్ - నరేంద్ర మోడీ భేటీ అయిన సంగతి తెలిసిందే. వారు కలిసిన కొద్ది రోజులకే "భారతదేశానికి ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యానికి కేటాయించిన 21 మిలియన్ డాలర్ల ప్రత్యేక సాయాన్ని రద్దు చేస్తున్నాం" అని డోజ్ ప్రకటించడం మరింత కీలకంగా మారిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ స్పందించింది. ఇందులో భాగంగా.. బీజేపీ నేత అమిత్ మాలవీయ స్పందిస్తూ... ఓటర్ల సంఖ్య పెంచేందుకు 21 మిలియన్ డాలర్లా..? ఇది భారత్ లోని ఎన్నికల ప్రక్రియలో ప్రత్యక్ష భాగం కాదు.. దీని నుంచి ఎవరు లాభపడుతున్నారు? కచ్చితంగా అధికార పార్టీ మాత్రం కాదు అని ఎక్స్ లో రాసుకురావడం గమనార్హం.


మరోపక్క.. బంగ్లాదేశ్ లో రాజకీయ స్థిరత్వాన్ని మెరుగుపరిచేందుకు అందిస్తున్నట్లు చెబుతున్న 29 మిలియన్ డాలర్ల నిధులను కూడా కోత విధించింది డోజ్. ఇదే సమయంలో... కంబోడియా, సెర్బియా, మోల్టోవా, నేపాల్, లైబీరియా, బాలి, దక్షిణాఫ్రికా మొదలైన దేశాలకు అందించే నిధులకు కోత విధించింది. ఏది ఏమైనా... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ అయిన భారతదేశంలో జరిగిన ఎన్నికల్లో విదేశీ జోక్యం బయట పడటం ఇప్పుడు వైరల్ గా మారిందని అంటున్నారు. పైగా ంతో అధికార పార్టీకి ఏమీ సంబంధం లేదని బీజేపీ నేత చెప్పడంతో.. ఈ వ్యవహారంపై మోడీ సర్కార్ విచారణ జరిపించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి.

# తి.తి.దేవస్థానం ఆధ్వర్యంలో కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

## 18వ తేదీన అంకురార్పణతో తొమ్మిది రోజుల ఉత్సవాలు



తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తిరుపతి కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 18వ తేదీన సాయంత్రం అంకురార్పణతో ఈ తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. కామాక్షి దేవితో కలిసి ఉన్న స్వామి కపిలేశ్వరుడి దివ్య నివాసం కొండల దిగువన ఉన్న కపిల తీర్థ సరస్సు ద్వారా ప్రాతినిధ్యం వహిస్తుంది. కొండ పట్టణానికి ప్రయాణించేటప్పుడు, యాత్రికులు తమ ప్రయాణాన్ని కొనసాగించే ముందు ప్రార్థన చేయడానికి మొదటగా కపిల తీర్థం ఉంటుంది. స్వామి శ్రీ వేంకటేశ్వర (విష్ణువు) ని స్తుతించే సహస్ర నామావళిలో ఈ పేరు కూడా ఉంది. వేంకటాచల మహాత్మ్యంలో స్వామి కపిలేశ్వరుడు ప్రస్తావించ బడ్డాడనేది వాస్తవం. శ్రీనివాసుడు, ఆకాశరాజు వద్దకు వెళ్లి తన వివాహానికి మధ్యవర్తి పాత్రను నెరవేర్చమని వకుళ మాతను అభ్యర్థిస్తున్నట్లు వ్రాయబడింది. వెంకటాచల మహాత్మ్యములో... శ్రీనివాసుడు, వకుళ మాతను కామాక్షి దేవితో ఉన్న కపిలేశ్వరునికి, యువ శ్రీనివాసుడు కామాక్షివరద ఆశీస్సులు కోరుతున్నాడని తెలియజేయమని కోరినట్లు కూడా ప్రస్తావించ బడింది. శ్రీనివాసుని కోరిక మేరకు, వకుళ మాత ఆకాశరాజు రాజ్యంలో ఉన్న నారాయణ వనానికి ప్రయాణమై, వివాహం కోసం వేడుకుంటుంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుపతి కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు , ఈ నెల 18వ తేదీన సాయంత్రం అంకురార్పణతో తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. కపిల తీర్థంలో ఈ నెల ఫిబ్రవరి 18 నుండి 28వ తేదీ వరకు వైభవంగా నిర్వహించ డానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 18న శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం జరుగనుంది. 19న ఉదయం- ధ్వజారోహణం, రాత్రి హంస వాహనంపై స్వామివారు ఊరేగుతారు. 20న ఉదయం- సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై దర్శనం ఇస్తారు. 21న ఉదయం- భూత వాహనం, రాత్రి సింహ వాహనంపై కపిలేశ్వర స్వామివారు భక్తులను కటాక్షిస్తారు. 22న ఉదయం- మకర వాహనం, రాత్రి శేష వాహనం, 23న ఉదయం- తిరుచ్చి ఉత్సవం, రాత్రి- నంది వాహన సేవను నిర్వహిస్తారు. 24న ఉదయం- వ్యాఘ్ర వాహనం, రాత్రి గజ వాహనంపై కపిలేశ్వర స్వామివారిని ఊరేగిస్తారు. 25న ఉదయం- కల్పవృక్ష వాహనం, రాత్రి అశ్వ వాహన సేవలు ఉంటాయి. 26న ఉదయం రథోత్సవం కన్నుల పండువగా సాగుతుంది. రాత్రి నందివాహనంపై స్వామివారు ఊరేగుతారు. 27న ఉదయం పురుషా మృగవాహనం, సాయంత్రం కల్యాణోత్సవం ఉంటుంది. రాత్రి తిరుచ్చి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. 28న ఉదయం త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, రాత్రి రావణాసుర వాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అభిషేకం చేశారు. అనంతరం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఈ సందర్భంగా గర్భాలయం, ధ్వజస్తంభం, ఉప ఆలయాలు, ఆలయ పరిసరాలను శుద్ధి చేశారు. అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతి ఇచ్చారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై టీటీడీ ఉన్నతాధికారులు ఇదివరకే సమీక్షలను సైతం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యక్షంగా పనులను పర్యవేక్షించారు. ఆలయ పుష్కరిణిని పరిశుభ్రంగా ఉంచాలని, ఆకర్షణీయంగా పెయింటింగ్, రంగోళీలు, స్వామివారి వాహనాల మరమ్మత్తులు, పెయింటింగ్, విద్యుత్ కాంతులు, ఫ్లెక్సీలు, పటిష్టంగా క్యూలైన్లు, తిరుపతి నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆర్చ్ లు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు వేసవి నేపథ్యంలో చలువ పందిళ్లు, తాగునీరు, అన్న ప్రసాదాలు అందించేందుకు వీలుగా సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**



# తితిదే అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.11కోట్ల విరాళం

**తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు సోమవారం భారీ విరాళం అందింది. ముంబయిలోని ప్రసిద్ యునో ఫ్యామిలీ ట్రస్టుకు చెందిన తుషార్ కుమార్ అనే భక్తుడు రూ.11 కోట్ల విరాళం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన డీడీని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు. అన్నప్రసాదం ట్రస్టుకు భారీ విరాళం అందజేసిన భక్తుడు తుషార్ కుమార్‌ను ఆయన అభినందించారు.**

చురకలు


## సంపాదకీయం

# ఎర్ర బుక్కు ని తట్టుకోవడం కష్టమేనా ?

రెడ్ బుక్ తెలుగులో ఎర్ర బుక్. ఇది మొదట్లో నారా లోకేష్ యువ గళం సందర్భంగా పరిచయం చేసిన మాట. అప్పట్లో ఎర్ర బుక్ ఏంటో అని అంతా అనుకున్నారు. కానీ ఇపుడు ఏపీలో ఎర్ర బుక్ గురించే అతి పెద్ద చర్చగా ఉంది. ఎర్ర బుక్ రాజ్యాంగం అని వైసీపీ నిత్యం స్మరిస్తోంది. పొరుగు రాష్ట్రంలో దీనిని స్ఫూర్తిగా తీసుకుని అక్కడ నేతలు పింక్ బుక్ అని అంటున్నారు. ఏపీలోనే వైసీపీ నేతలు కూడా తామూ ఒక బుక్ రాస్తామని చెబుతునారు. ప్రజలు కూడా కూటమి అరాచకాల మీద బుక్ రాయాలని కోరుతున్నారు. ఇలా ఇంతలా ఇన్నేసి బుక్స్ రాయించేలా చేసింది రెడ్ బుక్. ఇది ఇంతలా పాపులర్ అవుతుందని తాను కూడా అనుకోలేదని ఆ మధ్యన దావోస్ టూర్ లో మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు కూడా. ఇదిలా ఉంటే రెడ్ బుక్ అన్నది ప్రజలకు చెప్పే అమలు చేస్తున్నామని లోకేష్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను 90 దాకా బహిరంగ సభలలో రెడ్ బుక్ ని చూపించి ప్రజల మధ్యనే ఈ విషయాలు చెప్పాను అన్నారు. తమను అప్పటి వైసీపీ ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులు వారి చేసిన అరాచకాల మీద తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చట్ట ప్రకారం న్యాయబద్ధంగా చర్యలు తీసుకుంటామని చెప్పామని అన్నారు. ఇపుడు వల్లభనేని వంశీ ఒక దళితుడిని కిడ్నాప్ చేసిన ఘటనలో అరెస్ట్ అయ్యారని తొందరలో అనేక వాస్తవాలు బయటకు వస్తాయని ఆయన చెప్పారు. ఇదిలా ఉంటే రెడ్ బుక్ లో రాసుకున్న అక్రమాలు చేసిన అధికారులు నేతల విషయంలో చట్టపరమైన చర్యలు తప్పవని లోకేష్ స్పష్టమైన వైఖరితో ఉన్నారు. ఈ విషయంలో ప్రజల మధ్యనే అన్నీ చెప్పామని అంటున్నారు. చూడబోతే వంశీ అరెస్ట్ అయ్యారు ఆయన తరువాత ఎవరు అన్న చర్చ కూడా వస్తోంది. అయితే రెడ్ బుక్ లో రాసిన పేర్ల ప్రకారం అందరి మీద సరైన ఆధారాలతో చట్టబద్ధంగానే అరెస్టులు కేసులు ఉంటాయని అంటున్నారు. ప్రజలలో రెడ్ బుక్ ని చూపించే ఇవన్నీ చేస్తున్నామని చెబుతున్నారు. కాబట్టి నాటి అరాచక పాలన చేసిన వారికి శిక్షలు పడితే ఎవరూ ఈ విషయంలో సానుభూతి చూపించే అవకాశమే లేదని టీడీపీ నేతలు అంటున్నారు. మరో వైపు చూస్తే వైసీపీ అధికారంలో ఉంటే టీడీపీ కేంద్ర కార్యాలయం మీద దాడులు చేశారని అలాతే తమ ఇళ్ళ వద్దకు వచ్చి తాళ్ళతో కట్టారని లోకేష్ చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తే ఏ ఒక్కరినీ వదిలేది లేదనే స్పష్టం అవుతోంది. దాంతో ఎర్ర బుక్కుని తట్టుకోవడం కష్టమే అన్న భావన వైసీపీలో ఏర్పడుతోంది. ఎంత సైలెంట్ గా ఉన్నా ఎక్కడో ఉన్నా సరే సరైన టైం లో వారిని తెచ్చి కేసులు కట్టి ఆధారసహితంగా నిరూపిస్తామని కూటమి పెద్దలు చెబుతున్న దానిని బట్టి చూస్తే రెడ్ బుక్ టఫ్ టాస్క్ అని అర్ధమవుతోంది. వైసీపీ అధినాయకత్వం చెప్పినంత సులువుగా కేసులదేముందబ్బా అన్నదైతే ఎవరికీ ఉండదని అంటున్నారు. మొత్తానికి వైసీపీ శిబిరంలో రెడ్ బుక్ అలజడి రేపుతోందా అన్నది మాత్రం చర్చగానే ఉంది.

# దళిత జన బాంధవుడు భాగ్యరెడ్డి వర్మ - ఫిబ్రవరి 18... భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి

అంటరాని తనంపై ఆయన అలు పెరుగని పోరాటం చేశాడు. బాబా సాహెబ్ అంబేద్కర్ తో కలసి ఉద్యమాల్లో పాల్గొన్నాడు. జాతిపిత మహాత్మునిచే గౌరవింప బడినాడు. తాను నమ్మిన సత్యాలను అందరికీ తెలిపి సమాజంలో చైతన్యం తేవడానికి నిస్వార్ధసేవ చేశాడు. దళిత స్త్రీల స్థాయిని దిగజార్చి, దేవాలయాల్లో దేవతలకు అంకితమైన అవివాహిత మహిళలు దేవదాసీలుగా, జోగినులుగా, పార్వతు లుగా, జీవితాలను అంకితం చేసే జోగినీ వ్యవస్థ రద్దు, బాల్య వివాహాల వ్యతిరేకత, దళితులలో విద్యా వ్యాప్తి, అసమానత లేని సమాజం కోసం అవిశ్రాంత కృషి చేశాడు. మేము పంచములం కాదు.. ఈ దేశ మూల వాసులం.. ఆది హిందు వులం..' అని గర్వంగా చాటాడు. అంటరాని వారుగా దూరంగా ఉంచ బడిన వారిని "ఆది హిందువులు"గా భారత దేశంలో తొట్టతొలుత నివసించిన సంతతిగా ఆయన నొక్కి చెప్పాడు. నిజాం పాలిత హైదరాబాద్ రాజ్యంలో దళితోద్యమానికి బాటలు వేసిన ఆ మహానేతనే భాగ్యరెడ్డి వర్మ. హరిజన పదం తెలంగాణ ప్రాంతంలో వ్యాప్తిలో లేని కాలంలో ఆది హిందువులుగా, ఆది ఆంధ్రులుగా, ఆది భారతీయులుగా నిమ్నవర్గ ప్రజలు తమను తాము ప్రకటించు కోవాలని కాశీనాథుని నాగేశ్వర రావు పంతులు, మాడపాటి హనుమంతరావుల సహకారంతో భాగ్యరెడ్డి వర్మ ప్రచారం చేశాడు. భాగ్యరెడ్డి వర్మ సేవలు హైదరాబాద్ సంస్థానానికే పరిమితం కాక, తెలుగు నేలపై పలు ప్రాంతాలకూ విస్తరించాడు. లక్నో, అలహాబాద్, కలకత్తా తదితర ప్రాంతాల్లో జరిగిన దళిత చైతన్య మహాసభలకు ముఖ్య అతిధిగా హాజరయ్యాడు. దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ (మే 22, 1888 - ఫిబ్రవరి 18, 1939) సంఘ సంస్కర్త, ఆది ఆంధ్ర సభ స్థాపకుడు. హైదరాబాదు సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడు. జగన్మిత్ర మండలి, మన్య సంఘం, సంఘ సంస్కార నాటక మండలి, అహింసా సమాజంలను స్థాపించి హైదరా బాదు ప్రాంతంలో సంఘ సంస్కరణలకై కృషి చేశాడు. మాదరి వెంకయ్య, రంగమాంబ దంపతులకు 1888 సంవత్సరం, మే 22వ తేదీన జన్మించిన భాగ య్యకు,1888 నవంబరులో వారి కుటుంబ గురువు భాగయ్యకు బదులు భాగ్యరెడ్డి అని నామ కరణం చేశాడు. ఆయన కుల శైవమత గురువు బోధనలు చేసేవారు. ఆర్యులు హిందూ దేశానికి వలస రాకముందు, అస్పృశ్యులుగా సమాజంచే ముద్ర వేయబడిన ఆది హిందువులే పాలకులని గురువు వాదం. "రెడ్డి" అన్నది పాలకుడనే అర్థం గల "రేడు" అనే పదం నుంచి ఉద్భవించిందని, అందుచేతనే మాదిరి వెంకయ్యగారి భాగ్యయ్యకు రెడ్డిని జత చేశానని ఆయన చెప్పారు. ఆ తర్వాత 1913లో మాదిరి భాగ్యరెడ్డి హిందూ సమాజానికి చేసిన అపూర్వ సేవలకు గుర్తింపుగా ఆర్య సమాజ్ "వర్మ" అనే బిరుదు ప్రదానం చేశారు. ఆనాటి నుండి బాగయ్య భాగ్యరెడ్డిగా మారి, మాదిరి భాగ్యరెడ్డి




వర్మగా, ఎం.వి. భాగ్యరెడ్డి వర్మగా ప్రసిద్ధికెక్కాడు. 1913లో 'ఆర్య సమాజ్' ఆయన సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా 'వర్మ' అన్న బిరుదును ప్రధానం చేశారు. దాంతో ఆయన భాగ్యరెడ్డి వర్మగా గుర్తింపు పొందాడు. భాగ్యరెడ్డి 1906లో షెడ్యూల్డు కులాల బాల బాలికల విద్య కోసం హైదరాబాదు లోని ఈసామియా బజారులో జగన్మిత్ర మండలిని స్థాపించాడు. హరిజనులలో విద్యావశ్యకతను గుర్తించి 1910లో జగన్మిత్ర మండలి ఆధ్వర్యంలో మొదటి ప్రాథమిక పాఠశాలను ప్రారంభించాడు. భాగ్యరెడ్డి వర్మ అంటరాని కులాల ఉద్ధరణకై 1911లో మన్య సంఘాన్ని ఏర్పాటు చేసి, జగన్మిత్ర మండలి కార్యకలాపాలు మన్య సంఘం ద్వారా కొన సాగించాడు. మన్య సంఘం అంటరాని కులాల ప్రజల్లో చైతన్యం తీసుకు రావటానికి ప్రయత్నించింది. కొంతమంది ఉన్నత కులాల హిందువులు కూడా ఈ భజన మండళ్లను ప్రోత్సహించారు. మన్య సంఘం ఆధ్వర్యంలో ఈ భజన మండళ్లు రీడింగ్ రూములు ఏర్పరచి అందులో ఆంధ్రప్రత్రిక, దీనబంధు మొదలైన పత్రికలను అందుబాటులో ఉంచాయి. ప్రదానంగా దళిత మహిళను, ఆ తర్వాత వెనకబడిన తరగతులకు చెందిన యువతులను ప్రత్యేకంగా దేవునికి అంకితమిచ్చే కార్యక్రమాలు నైజాం రాజ్యం లోని తెలంగాణ, మరట్వాడా, కన్నడ ప్రాంతాల్లో పురోహితులనబడే జంగాలు నిర్వహించేవారు. ఈ దురాచారాన్ని రూపుమాపడానికి భాగ్యరెడ్డి వర్మ దూరదృష్టితో కార్యాచరణ చేపట్టాడు. ఆయన కృషివల్ల నిజాం దేవదాసి వ్యవస్థను నిర్మూలించాడు. 1917లో బెజవాడలో జరిగిన తొలి పంచమ మహా సభకు భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షత వహించాడు. ఈ మహాసభలో ఆయన ప్రసంగానికి ప్రభావితుల్కైన నిర్వాహకులు "ఆంధ్రదేశ తొలి ఆది ఆంధ్ర మహాసభ"గా పేరు మార్చారు. తర్వాత 1919లో బందరులో, 1921లో ఏలూరు, భీమవరం, 1925లో అనంతపూర్, 1933లో నాగపూర్, 1938లో కాకినాడ తదితర చోట్ల జరిగిన ఆది ఆంధ్ర మహాసభలకు అధ్యక్షత వహించాడు. 1917లో విజయవాడలో ఆంధ్ర పంచమ మహాజన సభలో, భాగ్యరెడ్డి వర్మ, ఏ హిందూ పురాణేతిహాసాల్లోనూ పంచములనే పదం లేదని, ఈ ప్రాంతానికి మొట్ట మొదటి నుండి స్థానికులైన ప్రజలు పంచములే కాబట్టి, ఆది ఆంధ్రులనే వ్యవహారం సరైనదని తీర్మానించాడు. 1917 నుండి 1938 వరకు ఆది ఆంధ్ర మహా సభలు దాదాపు ప్రతి ఏటా జరిగాయి. అంటరాని వారిని ఆది హిందువులుగా పిలవాలని డిమాండు చేశారు. ఈ ఆది ఆంధ్ర మహాజన సభల ప్రభావంతో 1931 జనాభా లెక్కలలో మాల, మాదిగ, ధేర్, చమర్ లాంటి వారికి నిజాం ప్రభుత్వం ఆది హిందువులుగా పేర్కొన్నది. 1933 కల్లా ఆది - హిందూ సోషల్ సర్వీసు లీగు ఆధ్వర్యంలో 26 పాఠశాలలు ప్రారంభ మయ్యాయి. వీటిలో దాదాపు 2600 మంది విద్యార్థులకు చదువు చెప్పేవారు. భాగ్యరెడ్డి వర్మకు హిందూమతంపై విశ్వాసం లేక మొదట్లో అర్య సమాజం, బ్రహ్మసమాజం బోధనలను పాటించేవాడు. తర్వాత బౌద్ధం పట్ల ఆకర్షితు డయ్యాడు. గౌతమ బుద్ధుడు ప్రవచించిన సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ మొదలైన అంశాల పట్ల ఆకర్షితుడయ్యాడు. 1913 నుండి ప్రతి వైశాఖ పూర్ణిమ రోజున బుద్ధ జయంతిని జరుపుకొనే వాడు. తన ఏకైక కుమారునికి గౌతమ్ అని పేరు పెట్టుకున్నాడు. 1917 డిసెంబర్ 15వ తేదీన కలకత్తాలో మహాత్మా గాంధీ పాల్గొన్న "అఖిల భారత హిందూ సంస్కరణ మహాసభ"లో భాగ్యరెడ్డి వర్మ కూడా పాల్గొని, అనర్గళంగా, అర్థవంతంగా, ఆలోచనాత్మకంగా చేసిన ప్రసంగం గాంధీజీని సైతం ఆకర్షించింది. మరునాట కలకత్తాలో మహాత్మా గాంధీ అధ్యక్షతన మరో సమావేశంలో పాల్గొనడానికి భాగ్యరెడ్డిని ఆహ్వానించి, వేదిక మీదకు తీసుకు రావడానికి తన ప్రైవేట్ కార్యదర్శిని పంపి, భాగ్యరెడ్డిని, గాంధీజీ తన ప్రక్కన కూర్చో బెట్టుకోవడాన్ని బట్టి ఆయన పట్ల గాంధీకి ఎంత గౌరవమో స్పష్టమౌతున్నది. భాగ్యరెడ్డి వర్మ దళితుల నుద్దేశించి...'దళితులే ఈ దేశపు మూల వాసులు. అవిద్య, అజ్ఞానం వల్ల మాత్రమే దళితులు వెనకబడి ఉన్నారు" అని ఆయన బోధించే వారట. దక్కన్‌లో భాగ్యరెడ్డి వర్మ నిర్మించిన ఆదిజన ఉద్యమం దేశవ్యాపితంగా నడిచిన ఆదిజన మూలవాసీ ఉద్యమానికి అనుసంధాన కర్తగా పనిచేసింది. భాగ్యరెడ్డి వర్మ స్థాపించిన భాగ్య నగర్ అనే పత్రికలో సాహిత్యంలో తొలిసారిగా తాను రాసిన నవల వెట్టి మాదిగ సాహిత్యాన్ని తానే తొలిసారి ప్రచురించాడు. అస్పృశ్యతా నివారణకు భాగ్యరెడ్డి వర్మ చేసిన కృషికి, గుర్తింపుగా హైదరాబాద్‌లోని ఇసామియా బజార్ ప్రధాన రోడ్‌కు 'భాగ్యరెడ్డి వర్మ మార్గ్' అని నగర పాలక సంస్థ దేశ స్వాతంత్ర్యాని కంటే ముందే నామకరణం చేయడం విశేషం. భాగ్య రెడ్డి వర్మ 1939 ఫిబ్రవరి 18న క్షయ వ్యాధితో హైదరా బాదులో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సిద్ధి పొందిన తాపసి రామకృష్ణుడు - ఫిబ్రవరి 18...రామకృష్ణ పరమహంస జయంతి

స్వామి వివేకానంద గురువు అయిన స్వామి రామకృష్ణ పరమహంస,(గదాధర్ ఛటోపాధ్యాయ) (ఫిబ్రవరి 18, 1836 - ఆగష్టు 16, 1886) విభిన్న మతాలు భగవంతుడిని చేరడానికి విభిన్న మార్గాలు అని అనుభవపూర్వకంగా మొట్టమొదటి సారిగా ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయులు. భారతీయ జాతీయతపై రామకృష్ణ పరమహంస ప్రభావం అలేఖ్యం. హిందూ మతం లోని మూఢ నమ్మకాలు అధిక సంప్రాదాయాలను కొంతవరకు తొలగించి, హిందూ మతాన్ని ఇస్లాం, క్రైస్తవ మతాల సవాళ్లకు ధీటుగా నిలబెట్టిన మహనీయుడు రామకృష్ణుడు. అన్ని మతాల సారాన్ని ఆమూలాగ్రంగా ఆస్వాదించడం లక్ష్యంగా అవిరళ కృషి చేసి, సిద్ధి పొందిన తాపసి ఆయన. అన్ని మతాలు భగవం తుని చేరడానికి విభిన్న మార్గాలని అనుభవ రీత్యా మొదటి సారి ప్రపంచానికి చాటి చెప్పిన ఆధ్యాత్మిక గురువు. 1836 ఫిబ్రవరి 18న పశ్చిమ బెంగాల్ లోని హుగ్లీ జిల్లాలో కామార్పుకూర్ గ్రామంలో ధార్మిక పేద బ్రాహ్మణులైన క్షుదీరాం, చంద్రమణీ దేవికి జన్మించారు. బాల్యం నుండీ ప్రకృతి ఆరాధకునిగా, సాధు సజ్జన ప్రసంగాలలో ఆసక్తి కనబరుస్తూ, వారికి సేవలందించే వారు. బయట ప్రపంచంతో సంబంధాలను పక్కనపెట్టి ప్రకృతిని ఆస్వాదిస్తూ గడిపేవారు. ఉపనయనం కాగానే మొదటి భిక్ష ఒక శూద్ర యువతి వద్ద పొందుతానని మాటిచ్చి, పట్టుబట్టి, ఎందరు చెప్పినా వినక, యువతికి ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, సాంప్రదాయ మార్పుకు శ్రీకారం చుట్టారు. 5 ఏళ్ళ శారదా దేవితో ఆయన పెళ్ళి కాగా, శారద... రామకృష్ణుని మొదటి శిష్యురాలుగా మారింది. తాను గురువుల వద్ద నేర్చుకున్న విద్యలన్నీ ఆమెకు నేర్పారు. ఆమె గ్రహణ శక్తికి మెచ్చి ఆమెను త్రిపుర సుందరి శక్తిగా పూజించడము మొదలు పెట్టారు. ఆమెను సాక్షాత్ కాళికాదేవిలా భావించి పూజించారు. ఆమెను కూడా తనంతటి వారిగా తీర్చిదిద్దారు. శారదా రామకృష్ణుల సంబంధము సామాన్య మానవులు అర్ధము చేసుకోలేరని భావించేవారు. చాలా కాలము అమెతో గడిపిన తరువాత రామకృష్ణుడు వారి బంధము ఆధ్యాత్మికమైనదని నిర్ణయించారు. తండ్రి మరణానంతరం పెద్దన్న రాంకుమార్ కలకత్తాలో సంస్కృత పాఠశాల నడుపుతూ, పౌరోహిత్యం చేస్తున్న క్రమంలో, రాణి రాషమొణి అనే యువతి దక్షిణేశ్వర్ కాళీమాత గుడి కట్టించగా, రాంకుమార్ పూజారిగా, రామకృష్ణుడు దేవతను అలంకరించే వారు. రాంకుమార్ మరణించాక, ఆయనే పూజారిగా మారారు. గుడిలో ఉన్నది. రాతి విగ్రహమా? లేక సజీవమా తెలుసుకునేందుకు రేయిం బవళ్ళు చేసిన కఠోర ప్రార్ధన ద్వారా అమ్మవారి దర్శన భాగ్యం ఆయనకు కలిగింది. మనిషికి చేసేలాగే విగ్రహానికి సేవలు చేసేవారు. స్వామి రామకృష్ణ పరమహంస తన తంత్ర సాధనలో భాగంగా వివిధ గురువుల మార్గదర్శకత్వం క్రింద వైష్ణవ భక్తి గురించి, అద్వైత వేదాంతం గురించి తెలుసుకున్నారు. అన్ని మతాల పరమ సత్యాన్ని గ్రహించారనే ప్రచారంతో అన్ని మతాల వారూ ఆయన దర్శనానికి వచ్చేవారు. అనేకమంది విదేశీయులు ఆధ్యాత్మికతకు ప్రభావితమై, రామకృష్ణుని అనుసరించారు కూడా. తోతాపురి అనే సాధువు అద్వైతాన్ని బోధించారు. భైరవీ బ్రాహ్మణి అనే ఆమె ఆయనకు భక్తిభావంలో భగవత్ సాక్షాత్కారమును ఉపదేశించారు. తద్వారా మూడు రోజులలోనే నిర్వికల్ప సమాధిని పొందిన మహనీయుడు. జ్ఞానాన్ని సంపాదించడానికి, మానవ ఉనికికి సంబంధించిన అంశాల గురించి తెలుసు కోవాలని పరితపించారు. క్రమంగా ఆయన తన జీవితానికి గల పరమార్ధాన్ని అర్ధం చేసుకున్నారు. తాను ఏమి కోరుకుంటున్నాడో ఆ దిశగా అడుగులు వేసి చివరికి ఫలితం సాధించారు. బెంగాలీ గ్రామీణ కుటుంబంలో జన్మించిన రామకృష్ణ , తర్వాతి కాలంలో భగవత్, ఆత్మసాక్షాత్కారం పొంది, తర్వాత ఇస్లాం క్రైస్తవ మార్గాల సాధన ద్వారా ఫలితం పొందారు. స్వామి వివేకానంద నిజంగా భగవదనుభవం పొందిన వారిని అన్వేషిస్తూ... ఎందరినో కలిసి నిరాశకు లోనై, చివరికి రామకృష్ణులను కలిశారు. "మహాత్మా మీరు భగవంతున్ని చూసారా?" అని ప్రశ్నించి సానుకూల సమాధానం



పొందారు. రామకృష్ణులు కేవలం స్పర్శతో ఆధ్యాత్మిక అనుభవాలను ప్రసాదించారు. అలా వివేకానంద ఆయన శిష్యులుగా మారారు. రామకృష్ణుడు తన ప్రత్యక్ష శిష్యులకు సన్యాసము ఇవ్వడము ద్వారా రామకృష్ణ మిషన్ ను స్వయముగా ప్రారంభించగా, స్వామీ వివేకానంద రామకృష్ణుని సందేశాలను పాశ్చాత్య దేశాలకు వ్యాపింప చేశారు. తాము చని పోయే ముందు తమ ఆధ్యాత్మిక శక్తులన్నీ వివేకానందునికి ధారవోసి, 1886 ఆగస్టు 16న మహా సమాధిని పొందారు. స్వార్ధం నుండి విడివడితే భగవంతుడిని పొంద వచ్చునని నిరూపించి చూపారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సాంప్రదాయ రీతిలో శ్రీనివాస మంగాపురం వెంకన్న బ్రహ్మోత్సవాలు .



శ్రీనివాస మంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 17వ తేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై, ఫిబ్రవరి 18 నుండి 26వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు.ఆలయ స్థలపురాణం ప్రకారం శ్రీనివాసుడు పద్మావతిని నారాయణవనంలో పరిణయం చేసుకున్న తర్వాత వెంకటేశ్వర స్వామి పద్మావతి సమేతుడై తిరుమల కొండకు బయలుదేరగా.. శాస్త్ర ప్రకారం పెళ్లయిన దంపతులు ఆరు నెలల వరకు కొండ ఎక్క కూడదని పుణ్యక్షేత్రాలకు కూడా వెళ్ళకూడదని అగస్త్య మహర్షి చెప్పారట. దీంతో స్వామివారు దేవేరితో కలిసి అగస్త్య ఆశ్రమంలోనే 6నెలలపాటు విడిది చేశారట. ఆరునెలల తర్వాత తిరుమల కొండకు పయనమైన స్వామివారు భక్తులకు రెండు వరాలను ప్రసరించారని పురాణాల కథనం. ఇక్కడ వేంకటేశ్వరుని ఆలయం చాల పెద్దది. విశాలమైనది. శ్రీ వారి ప్రధాన మూర్తి తిరుమలలో ఉన్న దాని కంటే పెద్దది. తిరుమలలో జరిగే అన్ని పూజాదికాలు ఇక్కడ కూడా జరుగుతాయి. ఇక్కడ భక్తుల తాకిడి అంతగా లేనందున ప్రశాంతంగా దర్శనం చేసు కోవచ్చు. శ్రీ వారి మెట్టు ఇక్కడికి దగ్గరే. అక్కడి నుండే తిరుమల కొండ పైకి మెట్లదారి ఉంది. ఇది చాలా దగ్గర దారి. తిరుపతి అలిపిరి నుండే ఉండే మెట్ల దారి కంటే ఇది చాలా దగ్గర. సుమారు గంట లోపలే తిరుమల కొండ పైకి వెళ్లవచ్చు. ఫిబ్రవరి 17వ తేదీ సోమ వారం సాయంత్రం సేనాపతి ఉత్సవం అంకురార్పణ జరిగి, ఫిబ్రవరి 18వ తేదీ ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి 18న ధ్వజారో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు ఫిబ్రవరి 18న ఉదయం 8.15 నుండి 8.40 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణం జరుగనుంది. అంతకుముందు తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు పెద్దశేష వాహనసేవ జరుగనుంది. 19న ఉదయం చిన శేష వాహనం, సాయంత్రం హంస వాహనంబీ 20న సింహ వాహనం, ముత్యపు పందిరి వాహనంబీ 21న కల్ప వృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, 22న పల్లకీలో మోహినీ అవతారోత్సవం, సాయంత్రం గరుడ వాహనంబీ 23న హనుమద్ వాహనం, సాలకట్ల వసంతోత్సవం, సాయంత్రం గజ వాహనంబీ 24న ఉదయం సూర్య ప్రభ వాహనం, సాయంత్రం చంద్ర ప్రభ వాహనంబీ 25న ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వ వాహనంబీ 26న ఉదయం పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం, అవభృతం, చక్ర స్నానం, సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం నిర్వహించ నున్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# బుగ్గి కాకముందే.. ఆర్పాలి అగ్గి!

కొత్తగూడెం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఏటా వేసవిలోనే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఆయా ఘటనలు అపార నష్టాలను మిగుల్చుతున్నాయి. అసలు ప్రమాదాలకే ఆస్కారం లేకుండా అప్రమత్తమైతే నష్ట తీవ్రతను తగ్గించవచ్చు. ఈ విషయమై సంబంధిత అగ్నిమాపక, ఇతర శాఖలు ముందే అప్రమత్తం కావాలి. ప్రజల్ని చైతన్యపరచాలి.

**ప్రమాదాలకు ముఖ్య కారణాలు**

సాగు పనులు పూర్తయ్యాక పంట వ్యర్థాలకు రైతులు నిప్పంటించడం.

నాణ్యత లేని విద్యుత్తు ఉపకరణాలు, పరికరాలతో షార్ట్‌సర్క్యూట్‌లు సంభవించడం.


విద్యుత్తు తీగలకు సమీపంలో గడ్డివాములు ఏర్పాటు చేయడం.

వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల షార్ట్‌సర్క్యూట్ తలెత్తి మంటలు చెలరేగడం. సిగరెట్, చుట్ట, బీడీల పీకలను నిర్లక్ష్యంగా పడేయడం.

ప్లాస్టిక్ ఉత్పత్తుల పరిశ్రమలు, దుకాణాల్లో అగ్నిమాపక వ్యవస్థల్లేకపోవడం. వంట గదుల్లో సిలిండర్ రెగ్యులేటర్లను బంద్ చేయకపోవడం.

**కొత్త కేంద్రాల ఊసేదీ...**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, కూసుమంచి, వైరా, మధిర, సత్తుపల్లి, నేలకొండపల్లి, భద్రాచలం, పినపాక, మణుగూరు, కొత్తగూడెం, అశ్వారావుపేట, ఇల్లెందులో ప్రస్తుతం అగ్నిమాపక కేంద్రాలున్నాయి. ప్రస్తుత జనాభా అవసరాలకనుగుణంగా కొత్తగా గుండాల, కల్లూరు, జూలూరుపాడు(ఏన్కూరు), పాల్వంచ, చర్ల, పెనుబల్లి, బోనకల్లు ప్రాంతాల్లో కొత్త కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. అవి కార్యరూపం దాల్చలేదు.




ఒక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక అధికారి, ఇద్దరు లీడింగ్ ఫైర్‌మెన్లు, ముగ్గురు డ్రైవర్లు/ఆపరేటర్లు, పది మంది ఫైర్‌మెన్లు, ఇతర కార్యాలయ సిబ్బంది ఉండాలి. కానీ, ఉభయ జిల్లాల్లో ఎక్కడా పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. భద్రాద్రి జిల్లాలో 50కి గాను 29 మంది ఫైర్‌మెన్లు మాత్రమే ఉన్నారు. ఖమ్మం జిల్లాదీ ఇదే పరిస్థితి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పాఠశాలలు, షాపింగ్‌మాల్స్, ఆసుపత్రుల్లో ఫైర్ అలారం, స్మోక్ డిటెక్టర్లను ఏర్పాటు చేసుకోవాలి.

సెల్లార్లలో ఆటోమెటిక్ స్ప్రింక్లర్లను అందుబాటులో ఉంచుకోవాలి.

విద్యుత్తు ప్రమాదాల నియంత్రణకు సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి.

బీ వంట పూర్తికాగానే సిలిండర్ రెగ్యులేటర్లను ఆపివేయాలి.

ఎక్కువ రోజులు ఊరికి వెళ్లాల్సి వస్తే ఇంట్లోని విద్యుత్తు మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి.

గ్రామీణ ప్రాంతాల్లో నిర్లక్ష్యంగా నిప్పంటించకుండా, సిగరెట్ పీకలు పడేయకుండా ప్రజల్ని అప్రమత్తం చేయాలి. బీ ప్రమాదం సంభవిస్తే ఆలస్యం చేయకుండా '101, 100' టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారమివ్వాలి. 'వేసవిలో అగ్ని ప్రమాదాల నియంత్రణకు సన్నద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం ఇటీవల కొత్తగూడెం, భద్రాచలం కేంద్రాలకు ఒక్కొక్కటి చొప్పున అదనపు ఫైర్ ఇంజిన్‌ను మంజూరు చేసింది. ఫైర్‌మెన్లు సహా మిగతావారు తగిన స్థాయిలో ఉన్నారు. గుండాల, చర్లలో వెంటనే కొత్త కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. ప్రజల్ని అప్రమత్తం చేస్తాం'. – క్రాంతికుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి, భద్రాద్రి

# పదండి సత్తా చాటుదాం..

ఖమ్మం : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ పదో తరగతి చదివే విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా ఆ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇటీవల వారిలో పరీక్షల భయం తొలగిపోయేలా విషయ నిపుణులతో ప్రేరణ తరగతులు నిర్వహించారు. విషయ నిపుణులతో ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలను నెలరోజుల కిందట అందజేశారు. ప్రత్యేక ఆహారం అందిస్తున్నారు. ప్రైవేటు ట్యూటర్లను నియమించారు. రోజు ఉదయం 5 గంటలకు నిద్ర లేపి చదివిస్తారు. సాయంత్రం పాఠశాల నుంచి వచ్చిన తర్వాత రాత్రి 11 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. రాత్రి 9.30 గంటలకు టీ తోపాటు రోజుకు ఒక రకం అల్పాహారం అందిస్తున్నారు. నిరంతరం వారి వెంట ఉండి మంచి మార్కులు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఉండి పదో తరగతి పరీక్షలు



రాసే విద్యార్థులకు వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేకంగా రాత్రి స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. రాత్రి 9 గంటలకు టీ తోపాటు అల్పాహారం అందిస్తున్నారు. హాస్టల్ వార్డెన్లు వారితో పాటు ఉండి చదివిస్తున్నారు.

వసతి గృహ విద్యార్థులు పదిలో రాణించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిభనుబట్టి ఏబీసీడీ కేటగిరీలుగా విభజించాం. వారి సామర్థ్యం ఆధారంగా ప్రైవేటు వసతిట్యూటర్లను ఏర్పాటు చేశాం. ఎవరూ ఫెయిల్ కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులతో పాటు డివిజన్ అధికారులు, నేను వసతి గృహాల్లో నిద్రిస్తున్నాం.

కస్తాల సత్యనారాయణ, ఎస్సీ సంక్షేమశాఖ డీడీ

గృహాల్లో ఉండి చదువుకునే పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. జనవరిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం. ప్రతిభ ఆధారంగా నాలుగు గ్రూపులుగా విభజించి రోజు రాత్రి 11 గంటల వరకు చదివిస్తున్నాం.

జి.జ్యోతి, బీసీ సంక్షేమశాఖ అధికారి

పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు..

ఎస్సీ వసతి గృహాలు: 521

బీసీ..: 297

# మహిళా శక్తి.. అతివల ఆసక్తి



గోదావరిఖని : మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహిళా శక్తి' పథకం సత్ఫలితాలిస్తోంది. మహిళల స్వయం సమృద్ధే లక్ష్యంగా స్వశక్తి సంఘం సభ్యులకు గ్రూపులుగా, వ్యక్తిగతంగా వ్యాపారాలు చేసుకునేందుకు ఈ పథకం ద్వారా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రుణాలు ఇప్పిస్తోంది. పట్టణాల్లో చిరువ్యాపారాలు నిర్వహిస్తున్నవారు.. పెట్టుబడి లేక వ్యాపారాల నిర్వహణకు వెనకడుగు వేసేవారు ఈ పథకాన్ని సద్వినియోగించుకుంటున్నారు. రామగుండం, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పురపాలికల్లోని స్వశక్తి మహిళలకు మెప్మా అధికారులు అవగాహన కల్పించడంతో పాటు వారి ఆసక్తి, ఆర్థిక పరిస్థితులు అనుసరించి వ్యాపారాలకు రుణాలు ఇప్పిస్తున్నారు.

**వ్యక్తిగత యూనిట్ల ఏర్పాటులో ముందంజ:** రామగుండం నగరపాలిక, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పురపాలికల్లో రూ.9.48 కోట్ల రుణాలతో 271 వ్యక్తిగత యూనిట్లు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 248 యూనిట్లు నెలకొల్పగా.. దశలవారీగా రుణాలు రూ.5.8 కోట్లు ఇప్పించారు. యూనిట్ల ఏర్పాటులో 91.51 శాతం, రుణాలు ఇప్పించడంలో 61.15 శాతం లక్ష్యాన్ని సాధించారు. బృంద యూనిట్లు జిల్లాకు 47 మంజూరు కాగా రూ.9.4 కోట్లు రుణం అందించాలి. కానీ 22 యూనిట్లు ఏర్పాటు కాగా రూ.1.73 కోట్ల రుణం మంజూరు చేశారు. యూనిట్ల ఏర్పాటులో 46.81 శాతం, రుణాలలో 18.41 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. మంథనిలో వ్యక్తిగత యూనిట్లు 20 మంజూరు అయ్యాయి. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పరిశీలనలో 48 మంది స్వశక్తి మహిళలు యూనిట్లు పెట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నారని గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు.

**దశలవారీగా రుణాలు విడుదల**

వ్యక్తిగత, బృంద యూనిట్లతో మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు. చాలా మంది టెంట్‌హౌస్‌లు, కంగన్‌హాళ్లు, సంచార పలహారశాలలు, బిర్యానీ సెంటర్లు, మట్టితో చేసిన కుండల విక్రయం, చపాతి, కర్రీ పాయింట్లు నిర్వహిస్తున్నారు. మహిళా శక్తి పథకంలో భాగంగా వ్యక్తిగత యూనిట్లకు ఒక్కొక్క దానికి రూ.3.5 లక్షలు, బృంద యూనిట్లకు రూ.20 లక్షలు బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి ఔత్సాహిక మహిళల వివరాలు నమోదు చేసుకోవడంతో మంథని పురపాలికలో లక్ష్యానికి మించి యూనిట్ల ఏర్పాటుకు మహిళలు ముందుకు వచ్చారు. ఆయా యూనిట్ల పురోగతిని పరిశీలిస్తూ దశలవారీగా రుణాలు విడుదల చేస్తున్నారు.

# అత్యధికులు చిన్న రైతులే



జగిత్యాల : రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం ద్వారా ఒక పంటకు ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తోంది. ఇటీవల సాగుయోగ్యంకాని భూములను అధికారులు క్షేత్రసర్వే ద్వారా గుర్తించి పథకం నుంచి తొలగించారు. పథకంలో ఇదివరకు నమోదై ఉన్న అర్హులైన రైతులతో పాటు ప్రస్తుతం నూతన రైతుల పేర్లను కూడా అధికారులు చేర్చారు. నూతన జాబితా ప్రకారం జిల్లాలో పథకంలో నమోదై ఉన్న మొత్తం 2,39,929 మంది రైతుల్లో దాదాపు సగం మంది వరకు రెండెకరాల్లోపు భూమిగలవారే కావటం గమనార్హం. రాష్ట్రప్రభుత్వం గణతంత్ర దినోత్సవం రోజున మండలానికొక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో మొత్తం మంది రైతులకు రైతుభరోసా నిధులు విడుదల చేసింది. ఈ క్రమంలో జిల్లాలోని 20 మండలాల్లోని 20 గ్రామాలకు చెందిన 15,636 మందికి రూ.15.45 కోట్లు విడుదలయ్యాయి. ఇటీవల ఎకరంలోపు రైతులకు నిధులను విడుదల చేయగా జిల్లాలోని 84,122 మందికి రూ.35.48 కోట్లు అందాయి. ఎకరం విస్తీర్ణం చొప్పున పెంచుతూ నిధులను విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించగా పథకంలో నమోదై ఉన్నా తమకు నిధులు రాలేదని చాలామంది రైతులు పేర్కొన్నారు. నిధులు రానివారు ఏఈవోలను సంప్రదించాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి స్మీహెచ్.రాంచందర్ సూచించారు.

వ్యవసాయ గణన ప్రకారం జిల్లాలోని రైతుల ఆధీనంలో 1,73,933 హెక్టార్ల సాగుభూమి ఉంది. అన్ని మండలాల్లో కలిపి 33,723 మంది ఎస్సీ రైతులుండగా వీరి ఆధీనంలో 17,920 ఎకసాల సాగుభూమి ఉంది. 6,051 మంది ఎస్టీ రైతుల వద్ద 4,717 హెక్టార్ల సాగుభూమి ఉండగా 1,85,749 మంది బీసీ, ఇతర రైతుల ఆధీనంలో 1,51,296 హెక్టార్ల సాగుభూమి ఉంది. 1,64,208 మంది పురుష రైతుల పేరిట, 75,721 మంది మహిళల పేరిట సాగుభూమి నమోదైఉంది.

భూమి విస్తీర్ణం బట్టి రైతుభరోసా పథకంలో నమోదైన రైతుల సంఖ్య

1 ఎకరం లోపు: 1,08,669

1–2 ఎకరాలున్నవారు: 55,800

2–3 ఎకరాలున్నవారు: 31,341

3–4 ఎకరాలున్నవారు: 18,767

4–5 ఎకరాలున్నవారు: 12,347

5–10 ఎకరాలున్నవారు: 11,555

10 ఎకరాల పైబడినవారు: 1,450

# వృథా నీటితో వందల ఎకరాలు సస్యశ్యామలం



సింగరేణి : పరీవాహక ప్రాంతాల్లోని బీడు భూములు సస్యశ్యామలం అవుతున్నాయి. గనుల్లో బొగ్గు తోడే క్రమంలో ఉబికి వచ్చే నీరు, సహజ సిద్ధమైన వాగులతో ఈ భూముల్లో అన్నదాతలు ఏటా రెండు పంటలు పండిస్తున్నారు. రామగుండం రీజియన్‌లోని ఆర్జీ–1, 2, 3 డివిజన్లలో ఓసీపీ–1, 2, 3, 5 ప్రాజెక్టుల పరిధిలో 8 భూగర్భ గనుల నుంచి రోజుకు దాదాపు 10 లక్షల గ్యాలన్ల పైచిలుకు నీరు ఉబికి వస్తోంది. ఈ నీటిని యాజమాన్యం మోటార్ల ద్వారా బయటకు తోడి.. గనుల, ఉపరితల ప్రాజెక్టుల్లో దుమ్ము లేవకుండా చల్లడం, మొక్కలకు పోయడానికి వాడుతోంది. మిగులు నీటిని నాలాలు, కాలువల ద్వారా రామగుండం, మంథని నియోజకవర్గాల్లోని జల్లారం, బొక్కలవాగులు, చందనాపూర్, జనగామ, సుందిళ్ల చెరువులు, ముస్త్యాల కుంట, సింగిరెడ్డిపల్లె నల్లకుంటలకు తరలిస్తున్నారు. మిగులు జలాలు గోదావరిలో కలుస్తున్నాయి. ఈ వాగులు, చెరువుల ఆయకట్టు పరిధిలోని జనగామ, సుందిళ్ల, ముస్త్యాల ప్రాంతాల్లో దాదాపు 184 ఎకరాలు, యైటింక్లయిన్‌కాలనీ సమీపంలోని అల్లూరు, న్యూమారేడుపాక ప్రాంతాల్లోని 146 ఎకరాలు, కన్నాల, అక్కపెల్లి, ఎంపాడు, మల్లెపల్లి, మంథని, కూచిరాజ్‌పల్లి, ఎగ్లాస్‌పూర్, ఖానాపూర్ ప్రాంతాల్లో 568 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు.

**వేసవిలో ఇబ్బంది లేకుండా..**

భూగర్భగనులు 400–600 మీటర్ల లోతులో ఉంటాయి. ఈ గనుల్లో ఉబికి వచ్చే నీటిని తోడటానికి ఉపరితలంలో సింగరేణి యాజమాన్యం 60 హెచ్‌పీ సామర్థ్యం గల పంపులను ఏర్పాటు చేసింది. పంపులతో పాటు బోర్లు వేసి నీటిని బయటకు తరలిస్తున్నారు. ఇలాంటి బోర్లు జనగామ, సుందిళ్ల, ముస్త్యాల, సింగిరెడ్డిపల్లె, చిల్లపల్లె, అక్కపెల్లి ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. ఈ నీటితో స్థానిక రైతులు ఎండాకాలంలో ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేసుకుంటున్నారు.

**తటాకాలకు జలకళ**

సింగరేణి వృథాజలం వల్ల రామగుండం, మంథని నియోజకవర్గాల్లోని తటాకాలకు జలకళ వచ్చింది. 7 చెరువుల్లో ఏటా నీరు నిల్వ ఉంటుంది. ఎండాకాలంలో కూడా ఉండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటిలో మత్స్యకారులు చేపలు పెంచుతూ ఉపాధి పొందుతున్నారు.

# బర్డ్‌ఫ్లూ.. వైరస్ వ్యాప్తికి చెక్!

కొత్తగూడెం: బర్డ్‌ఫ్లూ వైరస్ (ఏవీయన్ ఇన్‌ఫ్లుయెంజా) వ్యాప్తి నేపథ్యంలో ఉమ్మడి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఏపీలోని సరిహద్దు జిల్లాలైన ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరిలో వైరస్ నిర్ధారణ అయింది. ఆయా జిల్లాల నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోకి వైరస్ వ్యాపించకుండా అధికార యంత్రాంగం జాగ్రత్తపడుతోంది. ఏపీతో పాటు ఛత్తీస్‌గఢ్ నుంచి కోళ్లు, గుడ్ల ఉత్పత్తులను దిగుమతి చేసుకోకుండా అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఉభయ జిల్లాల కలెక్టర్లు జితేశ్ వి పాటిల్, ముజమ్మిల్‌ఖాన్ వెల్లడించారు. పశు సంవర్ధక, రెవెన్యూ శాఖల అధికారులు తనిఖీలను సంయుక్తంగా పర్యవేక్షిస్తున్నారు. పక్క రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను పరిశీలిస్తున్నారు. వాటిల్లో కోళ్లు, గుడ్లతో వచ్చేవి ఉంటే వెనక్కి పంపిచేస్తున్నట్లు చెక్‌పోస్టుల అధికారులు చెబుతున్నారు.




**ఉమ్మడి జిల్లాలో చెక్‌పోస్టులు**

భద్రాద్రి కొత్తగూడెం: అశ్వారావుపేట, దమ్మపేట మండలం అల్లిపల్లి, చెర్ల మండలం తేగడపెనుబల్లి మండలం ముత్తగూడెం, వేంసూరు, బోనకల్లు, సూర్యాపేట సరిహద్దు.

బృందాల ఏర్పాటు పశు సంవర్ధక, రెవెన్యూ అధికారులు ఉమ్మడి జిల్లాల్లోని అన్ని పౌల్ట్రీల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వీరితో ఆర్‌ఆర్‌టీ (ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు)లు ఏర్పాటు చేశారు. ఇవి గత రెండ్రోజులుగా తమ పరిధిలోని కోళ్ల ఫారాలకు వెళ్తున్నాయి. మరో రెణ్నెల్ల వరకు కొత్తగా కోడి పిల్లలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావొద్దని నిర్వాహకులకు సూచించారు. ఫారాల్లో యాంటీ వైరస్ మందును పిచికారి చేయిస్తున్నారు.

# పొదల ఇల్లు.. పొదరిల్లు

ఏన్కూరు : మార్కెట్‌లో రసాయనాలు కలిపిన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు కొనలేక తామే పెరటిసాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు బురద రాఘవాపురం గ్రామానికి చెందిన పొదిల అచ్చయ్య, రాణి దంపతులు.. ఇంటి పక్కన ఉన్న కుంట స్థలంలో ఏకంగా 45 రకాల పండ్ల చెట్లు, కూరగాయలు, ఆకుకూరలు, ఔషధ మొక్కలు పెంచుతున్నారు.

**తీరొక్క మొక్కలు.. ఫలాలనిచ్చే చెట్లు**

పొదిల అచ్చయ్య ఇల్లు ఆరుబయట నుంచి చూస్తే హరితవనాన్ని తలపిస్తుంది. ఆకులురాలే ప్రస్తుత కాలంలోనూ పచ్చదనం ఉట్టిపడుతోంది. ఇంటి ఎదుట వేప, అరటి, నిమ్మ, పూల మొక్కలు ఆహ్లాదంతోపాటు ఫలాలను ఇస్తున్నాయి. పక్కనే పెరటిలోకి వెళ్తే బొప్పాయి, అరటి, సపోట, మామిడి, జామ, రేగు, దానిమ్మ, యాపిల్ బేర్,



సీతాఫలం, బత్తాయి, ఉసిరి, కొబ్బరి మొక్కలు వనంలా కనిపిస్తున్నాయి. తోటకూర, పాలకూర, చుక్కకూర, కొత్తిమీర, పుదీనా, పొన్నగంటి, కరివేపాకు లాంటి ఆకుకూరలతోపాటు టమాటా, చిక్కుళ్లు, సోయాబీన్, దోస, బెండ, కాకర, మునగ, చిలగడదుంప తదితర కూరగాయలను పండిస్తున్నారు. అందాలను పంచుతూ, పరిమళాలు వెదజల్లే గులాబీలు, కనకాంబరాలు, మల్లె, చామంతి, బంతి, సీతారామ, సత్యనారాయణ, విరజాజి పూలు విరగపూస్తున్నాయి. ప్రభుత్వ అధికారులు తమ ప్రయత్నాలను గుర్తించి సౌర విద్యుత్తు తీగల నిర్మాణానికి సహకరించాలని కోరుతున్నారు.

# తడి..పొడి.. తడబడి

ఆలేరు : గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్టు ఎరువులు తయారీ అటకెక్కింది. మూడున్నరేళ్ల కిందట గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించగా.. మొదట్లో కొన్నింటిలో సేంద్రియ ఎరువుల తయారీ చేపట్టారు. తర్వాత వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో షెడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వం పది నెలల క్రితం సెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్ట్ ఎరువులు తయారు చేయాలని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. నెల, రెండు నెలలు హడావుడి చేసిన అధికార యంత్రాంగం ఎప్పటి లాగే మిన్నకుండిపోయింది.

**నిర్మాణాలు..**

నల్గొండ ఉమ్మడి జిల్లాలో 1,740 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు 16 వందల పంచాయతీల్లో కంపోస్ట్ షెడ్లను నిర్మించారు. ఒక్కోదానికి రూ.2.5 లక్షలు చొప్పున రూ.40 కోట్లు వెచ్చించారు. చెత్త సేకరణకు ట్రాక్టర్లు, కొన్ని పంచాయతీలకు రిక్షాలు కొనుగోలు చేశారు. తడి, పొడి చెత్త సేకరణకు ఇంటింటికి ప్రత్యేక బుట్టలు అందించారు. కొన్నింటిలో మొదట్లో ఎరువులు తయారు చేశారు. కొద్ది కాలానికే నిర్వహణ భారంతో చేతులెత్తేశారు. ప్రస్తుతం చెత్తను డంపింగ్ యార్డుల్లోనే పారబోస్తున్నారు.

**లక్ష్యం నీరుగారింది**

వానపాముల సాయం తీసుకుంటే 40–60 రోజుల్లోనే సేంద్రియ ఎరువు తయారవుతుంది. ప్రభుత్వ సూచనల మేరకు చాలా పంచాయతీలు వానపాములు కొనుగోలు చేసి కంపోస్టు షెడ్లలో వేశారు. ఇలా చేసిన తర్వాత సేకరించిన చెత్తను కంపోస్టు షెడ్‌లో వేయాల్సి ఉంటుంది. దానిపై రోజూ నీరు పట్టడంతో వానపాముల పునరుత్పత్తి పెరుగుతుంది. వాటి విసర్జితాలతో సేంద్రియ ఎరువు తయారవుతుంది. వానపాముల కోసం పంచాయతీలు రూ.4 వేలు ఖర్చుచేశాయి. షెడ్లకు సరిగా నీరు పట్టకపోవడంతో వానపాములు చనిపోయాయి.

**వేరుచేయడం లేదు...** ప్రజల్లో అవగాహన లేక తడి, పొడి చెత్తను వేరుచేయడం లేదు. సేకరించిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులే తడి, పొడి చెత్తను వేరుచేయాల్సి వచ్చింది. ప్లాస్టిక్, గాజు, ఇనుము, రబ్బరు వంటి వాటిని వేరుచేసి అక్కడే సెగ్రిగేషన్ షెడ్‌లోని అరలలో నిల్వచేయాలి. ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్‌కు పంపించాలి. ఈ ప్రక్రియ ఉమ్మడి జిల్లాలో దాదాపు ఎక్కడా అమలు కావడం లేదు. నిత్యం ట్రాక్టరులో చెత్త తరలించడానికి ఇంధనం ఖర్చులు తప్పడం లేదు. కంపోస్ట్ ఎరువుల తయారీపై పంచాయతీలు దృష్టిని సారిస్తే అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

చురకలు



# సాయంత్రం సీజ్.. ఉదయం కాంక్రీట్ తయారీ

హైదరాబాద్ : జంట జలాశయాలకు సమీపంలో సిమెంట్ కాంక్రీట్‌ను తయారు చేస్తున్న రెడీమిక్స్ ప్లాంట్ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి రెడీమిక్స్ ప్లాంట్లను నిర్వహించకూడదని హిమాయత్ సాగర్ పరిసర ప్రాంతాల్లోని 21 రెడీమిక్స్ ప్లాంట్లను బుధవారం సాయంత్రం సీజ్ చేస్తే గురువారం ఉదయం నుంచి కాంక్రీట్ తయారీ జరుగుతూనే ఉంది. లారీల్లో లోడ్ అవుతూనే ఉంది.

**ముక్కుపుటాల్లోకి ధూళి**

రెడీమిక్స్ ప్లాంట్ల కారణంగా హిమాయత్‌సాగర్ పరిసర ప్రాంతాలు, కొత్వాల్‌గూడ, సీఆర్ నగర్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు, రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇళ్లల్లోంచి బయటకు వస్తే చాలు ముక్కు పుటాల్లోకి సిమెంట్ ధూళి వెళ్తోందంటున్నారు. సాయంత్రం వేళల్లో



తలపై తెల్లగా పొరలు కనిపిస్తున్నాయి. ప్లాంట్లకు ముడిసరకులు తెచ్చే భారీ వాహనాలు తాండూరు నుంచి, కంకర వాహనాలు హయత్‌నగర్ నుంచి వస్తున్నాయి. రెడీ మిక్స్ తయారయ్యాక ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ నుంచి గచ్చిబౌలి, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు వెళ్తున్నాయి. భారీ వాహనాల టైర్లతో కొత్వాల్‌గూడ - ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ పూర్తిగా ధ్వంసమైంది.

**అధికారుల సాకులు..**

హిమాయత్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో రెడీమిక్స్ తయారీ ప్లాంట్లకు అనుమతులుండవు. పదేళ్లలో గండిపేట, మెయినాబాద్, శంషాబాద్ మున్సిపాలిటీల్లో 50 ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. వీటికి పరిశ్రమల శాఖ అధికారులు అనుమతులిచ్చారని రెవెన్యూ అధికారులంటున్నారు. కంకర కోసం పక్కనే గుట్టలను తవ్వుతున్నారని గనుల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తే పీసీబీ అనుమతుల ఆధారంగా ఇచ్చామంటున్నారు.

# తుంపర్లతో దోమలపై యుద్ధం

హైదరాబాద్ : నీటి తుంపర్లతో దోమలను అంతం చేసేందుకు జీహెచ్ఎంసీ నడుం బిగించింది. నీటిలో కొద్దిపాటి రసాయనాన్ని కలిపి.. అతి సూక్ష్మ నీటి బిందువులను గాల్లోకి విరజిమ్మే పద్ధతిలో ఈ విధానం పనిచేస్తుంది. తుంపర్లు గాలిలో పొరలా ఏర్పడతాయి. అందులో చిక్కుకున్న దోమలు మృతి చెందుతాయని జీహెచ్ఎంసీ చెబుతోంది. శంషాబాద్‌లో 400ఎకరాల్లో విస్తరించిన కన్హా శాంతి వనంలోనూ కోల్డ్ ఫాగింగ్‌నే ఉపయోగిస్తున్నారని బల్దియా దోమల నియంత్రణ విభాగం చెబుతోంది. ఇప్పుడా ప్రక్రియను కూకట్‌పల్లి జోన్‌లో అమలుకు జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది.

**22 డివిజన్ల పరిధిలో..**

కోల్డ్ ఫాగింగ్ విధానాన్ని జీహెచ్ఎంసీ అధికారులు గతేడాది ప్రశాసన్‌నగర్‌లో పరీక్షించారు. అక్కడ దోమల కట్టడి మెరుగ్గా జరిగినట్టు అప్పటి కమిషనర్ ప్రకటించారు. రెండో విడతలో కూకట్‌పల్లి జోన్‌లోని ఆల్విన్‌కాలనీలో పరీక్షించేందుకు ఈ నెల 15న బల్దియా ముహూర్తాన్ని నిర్ణయించింది. కోల్డ్ ఫాగింగ్ ముందు, తర్వాతి పరిస్థితులు, కోల్డ్ ఫాగింగ్‌తో దోమలు చనిపోతాయా, సొమ్మసిల్లి పడిపోతున్నాయా, ఎన్ని దోమలు నేల రాలుతున్నాయి అనే వివరాలు తెలుసుకుంటామని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ప్రస్తుతం చేస్తున్న హాట్ ఫాగింగ్‌తో దోమలు కొంత సమయం సొమ్మసిల్లి పడిపోతాయి. మైకం వదలగానే మళ్లీ విజృంభిస్తాయి.

**ఎలా పనిచేస్తుందంటే..?**

నీటి పరిమాణంలో రెండు శాతం డెల్టామెత్రిన్ రసాయనాన్ని కలుపుతారు. ఫిల్మ్ ఫామింగ్ అక్వియస్ స్ప్రే టెక్నాలజీ(ఎఫ్ఎఫ్ఏఎస్‌టీ)తో పనిచేసే యంత్రాల్లో ఆ మిశ్రమాన్ని వేసి గాల్లోకి పిచికారి చేసినప్పుడు.. అతిసూక్ష్మ నీటి బిందువులు పొరలా ఏర్పడి దోమలను అంతం చేస్తాయని తెలిపారు.

# కోమటికుంటలో ఆక్రమణల నేలమట్టం

హైదరాబాద్: చెరువును ఆక్రమించి కట్టిన ప్రకృతి రిసార్ట్స్, కన్వెన్షన్‌హాల్‌ను హైడ్రా నేలమట్టం చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తూంకుంట మున్సిపాలిటీలోని దేవరయాంజల్ గ్రామం కోమటి కుంటలో ఈ కూల్చివేతలు చేపట్టింది. ప్రధాన రహదారి పక్కనున్న చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భారీ భవనాలు, ఫంక్షన్ హాల్, విడిది కేంద్రాలు, ఇతర కట్టడాలను పూర్తిగా తొలగించింది. ఆ నిర్మాణాలన్నీ చెరువులో ఉన్నట్లు నీటిపారుదలశాఖ, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సర్వే లో స్పష్టమైనట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. భవనాలకు అనుమతి కూడా లేదన్నారు. 'సర్వే అనంతరం యజమానులకు నోటీసులిచ్చాం. వారు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ఇరువైపులా వాదనలు విన్నాక.. అక్రమ కట్టడాలను కూల్చేయాలని తీర్పు చెప్పింది. తామే తొలగించుకుంటామని యజమానులు నెల సమయం అడిగారు. నెల దాటినా అలాగే ఉన్నాయి. అందువల్ల మేమే కూల్చివేశాం'అని రంగనాథ్ వివరించారు.

**రంగనాథ్‌తో ఏజెన్సీ ప్రతినిధుల భేటీ..**

శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల పరిధిలో అనుమతి లేని ప్రకటనల హోర్డింగులపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలో పలు ఏజెన్సీల ప్రతినిధులు బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్‌ను కలిశారు. 10రోజుల సమయం ఇస్తే స్వయంగా తొలగించుకుంటామని కోరారు. ఇప్పటికే మీకు సమయం ఇచ్చామని, మీరు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కూల్చుతున్నామని ఆయన వారికి వివరించారు. శంషాబాద్, కొత్వాల్‌గూడ, నార్సింగి, తొండుపల్లి, గొల్లపల్లి రోడ్డు, తెల్లాపూర్ ప్రాంతాల్లో గత వారం రోజులుగా 53 ప్రకటనల బోర్డులను తొలగించామని తెలిపారు.

**కొల్లూరులోనూ..**

కొల్లూరు ఎగ్జిట్ పాయింట్ సమీపంలో మైహోమ్ సంస్థకు చెందిన హోర్డింగ్‌ను హైడ్రా అధికారులు కూల్చివేశారు. పురపాలిక సంఘం నుంచి అనుమతి పున రుద్ధరించుకోని కారణంగా తొలగించి నట్లు హైడ్రా అధికారి సతీష్ తెలిపారు.

# భూములు రైతులవే.. హక్కులు లేవాయె



హైదరాబాద్ : హైదరాబాద్ సమీపంలో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గత ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ ప్రక్రియ యాచారం మండలంలోని నాలుగు గ్రామాల రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెడుతోంది. ఏడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 600 మంది రైతుల నుంచి 2200 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ జారీచేసింది. అంగీకరించని కొందరు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తీర్పు ప్రకటించేలోపు 2021లో ఆ భూములకు సంబంధించి రైతుల పేర్లను తొలగించి, తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీజీఐఐసీ) పేరును ధరణి పోర్టల్‌లో రెవెన్యూ అధికారులు నమోదు చేశారు. హైకోర్టు తీర్పు ప్రకారం ధరణిలో తమ పేర్లపైకి మార్చాలంటూ రైతులు నాలుగేళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నా స్పందన కొరవడింది.

నోటిఫికేషన్‌తో భూమిపై హక్కు.. ఈ నాలుగు గ్రామాల రైతులు తమకు వ్యవసాయమే ఆధారమంటూ భూము లు ఇవ్వకపోయినా... ప్రభుత్వం మాత్రం నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా.. ధరణి పోర్టల్ ద్వారా వారి భూములపై హక్కు తీసుకుంది. పరిహారం వద్దని, మా భూములు మాకు కావాలంటూ ఆందోళన చేయడంతో... మీరు పంటలు పండించుకోమంటూ అధికారులు సూచించారు.

**రైతు భరోసా రాలేదు...**

బ్యాంకులు రుణాలివ్వడం లేదు..

ధరణి పోర్టల్‌లో రైతులు పేర్లు లేకపోవడంతో నాలుగేళ్ల నుంచి రైతుబంధు రాలేదు. తాజాగా రైతు భరోసా ఇవ్వలేదు. 12 మంది రైతులు చనిపోగా వారి కుటుంబాలకు అందాల్సిన రూ.5 లక్షల చొప్పున రైతు బీమా సాయం అందలేదు. రూ.2 లక్షల రుణమాఫీపై స్పష్టత కరవై 200 మంది రైతులు గందరగోళంలో ఉన్నారు. ఒక్కో రైతు రూ.30వేల దాకా పంట రుణం బ్యాంకు ద్వారా పొందేవారు. ఇప్పుడా రుణ పరిమితిని రూ.50 వేలకు పెంచారు. నాలుగేళ్లుగా బ్యాంకులు వీరికి పంట రుణం ఇవ్వడం మానేశాయి. భూములపై హక్కులు లేకపోవడంతో..పిల్లలకు పెళ్లిళ్లు చేసేందుకు విక్రయిద్దామనుకుంటే ఎవరూ కొనడం లేదు.

# పనులు అర్ధాంతరం.. ప్రయాణం నరకం



సిరిసిల్ల :నగరంలోని కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్ అనుసంధాన రహదారిపై ప్రయాణం వాహనదారులకు సర్కస్ ఫీట్లను తలపిస్తోంది. ఏడాదిన్నర కిందట రోడ్డు నిర్మాణానికి తవ్వగా ఇప్పటివరకు పనులు పూర్తి చేయలేదు. అరకొర పనులు, అడుగడుగునా గుంతలతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాకేంద్రంలోని 60 డివిజన్‌లలో ముఖ్యమంత్రి హామీ (సీఎంఏ) నిధులతో రహదారులు, మురుగుకాలువలు, తాగునీటి పైపులైన్ల నిర్మాణాలకు భారాస ప్రభుత్వ హయాంలో రూ.132.94 కోట్లు కేటాయించారు. అన్ని డివిజన్‌లలో సగం మేర పనులు పూర్తి చేయగా, చాలా చోట్ల అసంపూర్తిగా వదిలేశారు. కోతిరాంపూర్-కట్టరాంపూర్ మార్గం ఎప్పుడూ రద్దీగా ఉండగా పనులు అర్ధంతరంగా వదిలేయడంతో ఈ మార్గంలో ప్రయాణించే వారితో పాటు స్థానికులకు నరక యాతన తప్పడం లేదు.

**లీకేజీలతో తాగునీరు కలుషితం**

కట్టరాంపూర్ నుంచి కోతిరాంపూర్‌కు దూరం రెండు కిలోమీటర్లు ఉండగా అందులో కిలోమీటర్ మేర సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించారు. అక్కడి వరకే తాగునీటి పైపులైను పనులు చేశారు. మిగతా కిలోమీటరు దూరం ఏ పనులూ చేయలేదు. ఈ ప్రాంతంలో గతంలో వేసిన తాగునీటి పైపులు శిథిలమయ్యాయి. రోడ్డుపై గుంతలతో ఎక్కడ పడితే అక్కడ లీకేజీలవుతున్నాయి. శుద్ధ జలం పైపుల్లో మురుగు కలిసి నీరంతా కలుషితమై వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అవస్థలు పట్టించుకోండి సారూ!**

అసంపూర్తిగా ఉన్న రోడ్లపై వాహనాల రాకపోకలతో దారి పొడవునా అధ్వానంగా మారుతోంది. తరచూ ద్విచక్రవాహనదారులు అదుపు తప్పుతున్నాయి. మరమ్మతు పనులకు అదిగో, ఇదిగో అంటూ నెలల తరబడి సాగదీస్తున్నారు. తమ అవస్థలను పట్టించుకొనే లేరని స్థానికులు వాపోతున్నారు. గుత్తేదారుకు నిధులు మంజూరు చేయకుంటే పనులు అలాగే వదిలేస్తారా! అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.


రహదారి : కట్టరాంపూర్- కోతిరాంపూర్

దూరం : కిలోమీటర్

కేటాయించిన వ్యయం : రూ.1.33 కోట్లు

చేయాల్సిన పనులు : రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్

# మట్టి తవ్వకం.. ఇష్టారాజ్యం



సిరిసిల్ల : జిల్లాలో ప్రభుత్వ పరంగా చేపడుతున్న మట్టి పనులు లేవు. మట్టి తవ్వకాలకు గనులశాఖ అనుమతులూ లేవు. అయినా అక్రమార్కులు తవ్వకాలు ఆపడంలేదు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల రాయల్టీకి గండి పడుతోంది. అక్రమంగా తవ్విన మట్టిని రియల్ వెంచర్లకు, ఇళ్లకు ఇతరత్రా అవసరాలకు తరలిస్తున్నారు. జిల్లాలో ఇటీవల కొత్తగా ఇసుక క్వారీలను గుర్తించారు. మట్టి తవ్వకాలకు అనువైన ప్రాంతాలను గుర్తిస్తే ప్రభుత్వానికి ఆదాయం కలిసి వస్తుంది. అక్రమార్కులకు అడ్డుకట్ట పడనుంది. జిల్లాలో వేములవాడ గ్రామీణ మండలం అగ్రహారం, కోనరావుపేట మండలం కొలనూరు, చందుర్తి మండలం మల్యాల, రామన్నపేట. రుద్రంగి, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్. వీర్నపల్లి మండలం గర్జనపల్లి, వన్‌పల్లి గ్రామాల్లో ఎక్కువగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రభుత్వ, అటవీ భూములు కలిసి ఉండటంతో రెండు శాఖల అధికారులు ఎవరికివారు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇక సెలవు రోజుల్లో అక్రమార్కులు పెద్దఎత్తున తవ్వకాలు చేపడుతున్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వ, ప్రైవేటు భూములు పక్కపక్కనే ఉండటంతో వ్యవసాయ సీజన్‌కు ముందు అదను చూసి తవ్వకాలు జరుపుతున్నారు. రెవెన్యూ శాఖలో గ్రామస్థాయిలో సిబ్బంది లేరు. ఒక వేళ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదులు చేసినా.. ఆర్ఐ ఇతర సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లే సరికి అక్రమార్కులు తప్పించుకుంటున్నారు. చందుర్తి మండలం మల్యాల శివారులో మల్లెగుట్ట ప్రాంతంలో అనుమతుల్లేకుండా మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి రెవెన్యూ అధికారులు, పోలీసులతో వెళ్లే సరికి తవ్వకాలు జరుపుతున్నవారు రెండు ట్రాక్టర్లను అక్కడే వదిలేసి వెళ్లారు. గనులశాఖలో ఇద్దరు అధికారులు మాత్రమే ఉన్నారు. రెవెన్యూ, గనులశాఖలో సిబ్బందిలేమి అక్రమార్కులకు వరంగా మారింది.

ప్రభుత్వ, ప్రైవేటు భూమిలో మట్టి తవ్వకాలకు ఆన్‌లైన్‌లో అనుమతులకు గనులశాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రణాళికలు చేసింది. దీనికోసం విధివిధానాలను కూడా సిద్ధం చేసింది. దీనిలో టన్నుకు రూ.20లుగా ధరను నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ప్రధానమైన రెవెన్యూ, గనులశాఖలో సిబ్బందిలేక ప్రతిపాదనల స్థాయిలోనే నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి వెళుతోంది. చందుర్తి మండలం తిమ్మాపూర్‌లో మట్టిని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది 30 క్యూబిక్ మీటర్లకు రూ.10,926లు జరిమానా విధించారు.

**జరిమానాలు విధిస్తున్నాం**

జిల్లాలో అక్రమంగా మట్టితవ్వకాలు జరుపుతున్న ప్రాంతాలపై నిఘా ఉంచాం. ఇటీవల పలు మండలాల్లో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న వారిని పట్టుకుని జరిమానా విధించాం. మట్టి తవ్వకాలను జరిపిన ప్రాంతాల్లో రెవెన్యూ, గనులశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా పర్యవేక్షిస్తున్నాం. క్రాంతి, గనులశాఖ సహాయ సంచాలకులు

# ప్రతికూల వాతావరణంతో తీవ్ర నష్టం

జగిత్యాల : వానాకాలంతో పోలిస్తే యాసంగి వరిసాగులో అనుకూల వాతావరణంతో పాటు చీడపీడల తీవ్రత, సాగులో సమస్యలు తక్కువగా ఉండి ధాన్యం దిగుబడులు అధికంగా వస్తాయి. కానీ ఈ యాసంగిలో మాత్రం ప్రతికూల వాతావరణం నెలకొనటంతో దిగుబడులమాట అటుంచి పైరు ఎదగటంలేదని రైతులు వాపోతున్నారు. నాటిన పైరు ఎరుపురంగు నుంచి ఆకుపచ్చగా మారి ఎదగడానికి యూరియాను అధికంగా వేసినచోట చీడపీడల తీవ్రత మరింతగా పెరిగింది. మరోవైపు దెబ్బతిన్న పంట కర్రలను తీసుకెళ్లి దుకాణాదారునికి చూపిస్తే పురుగు, తెగుళ్ల మందుతో పాటు పోషకాన్ని కూడా కలిపి పిచికారీ చేయాలని రైతులకు అంటగడుతున్నారు. ఈ మూడింటితోనూ వరిపైరు పచ్చబడకుంటే మందులను మార్చి ఇచ్చి మరోసారి పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. ఇదే తరుణంలో పలుచోట గ్రామాల్లో గంట గుళికలు, బయో ఉత్పత్తుల పేరిట అమ్మకాలు కూడా జోరుగా సాగి రైతులను పూర్తిగా ఆయోమయానికి,



ఆర్థిక నష్టానికి గురిచేస్తున్నాయి. నాటినపైరు కుదురుకొని పిలకలు వేయాల్సిన సమయమంతా కర్రలు నిలదొక్కుకునేందుకునే గడిచిపోయి పిలకలు రాక దిగుబడులు తగ్గనుండగా సస్యరక్షణ ఖర్చు నాలుగింతలు పెరిగిందని రైతులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో పల్లెల్లో జీరో ఉత్పాదకాల విక్రయాలను అరికట్టి వాడాల్సిన మందులను రైతులకు తెలిపేలా అధికారులు, శాస్త్రవేత్తలు రైతుల క్షేత్రాలను సందర్శించాల్సి ఉంది. కరీంనగర్ జిల్లాలో 2.33 లక్షల ఎకరాల్లో, పెద్దపల్లి 1.96, జగిత్యాల 2.53, సిరిసిల్ల జిల్లాలో 1.70 లక్షల ఎకరాల్లో వరిపంటను సాగుచేశారు. నవంబరు నుంచే వరినార్లు పోసి నాట్లువేయటం ప్రారంభించగా ఈ నెల మొదటివారం వరకు కూడా వరినాట్లు కొనసాగాయి. ఈ సీజన్‌లో చలి, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమశాతంలో హెచ్చుతగ్గులు, పొడివాతావరణం నెలకొనటం తదితర ప్రతికూల వాతావరణం నెలకొంది. దీంతో వరిపైరుపై జింకు తదితర పోషక లోపాలు తలెత్తగా ఉల్లికోడు, మొగిపురుగు అత్యంత తీవ్రంగా ఆశించాయి. అగ్గితెగులు, బ్యాక్టీరియా ఎండాకు తెగుళ్లవంటివి పైరును నష్టపరుస్తుండగా నీరు నిలిచినచోట సల్ఫైడ్ ఇంజూరీ సమస్య కూడా తలెత్తింది.

# కొలతలు తీసేదెలా.. రికార్డు చేసేదెట్లా?

జగిత్యాల : కూలీల వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో సిబ్బంది నియామకం లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకంలో పలు అభివృద్ధి పనులు చేపడుతుండడంతో ఇబ్బందిగా మారింది. ఉమ్మడి జిల్లాలో 5.08 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులు ఉండగా 9.48 కూలీలు ఉన్నారు. ఇందులో 3.27 లక్షల కుటుంబాలు యాక్టివ్ ఉండగా ఆయా కుటుంబాల్లో 4.94 లక్షల మంది పనులకు వెళుతున్నారు. వీరందరికీ పనులు కల్పించడం, పర్యవేక్షించేందుకు సిబ్బంది ఖాళీలతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22 మంది అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి(ఏపీవో), 45 మంది సాంకేతిక సలహాదారుల(ఈసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీల భర్తీ లేకపోవడంతో ఉన్న సిబ్బందికే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. సాంకేతిక సహాయకులకు అయిదారు గ్రామాలకు పైగా క్షేత్ర స్థాయిలో పనుల పర్యవేక్షణ ఉండగా అదనంగా ఏపీవో, ఈసీల పనులు చూసుకోవాల్సిన పరిస్థితి ఉంది. సాంకేతిక సహాయకులు కూడా పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఉన్న వారికే గ్రామాల అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు.

**కొత్త పంచాయతీలకు క్షేత్ర సహాయకులేరి?**

పనుల పర్యవేక్షణకు ప్రతి ఆరు గ్రామాలకు ఒక సాంకేతిక సహాయకులను నియమించాల్సి ఉండగా ప్రస్తుతం 12 నుంచి 16 పంచాయతీలను చూసుకోవాల్సి వస్తోంది. జగిత్యాల జిల్లాలో 68 మంది ఉండాల్సి ఉండగా కేవలం 38 పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే



పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చడంతో నూతనంగా ఏర్పాటైన గ్రామాలకు క్షేత్ర సహాయకుల నియామకాలు చేపట్టకపోవడమే కాకుండా పాత పంచాయతీల్లోనే పూర్తి స్థాయిలో లేరు. జగిత్యాల జిల్లాలో 380 పంచాయతీలకు ప్రస్తుతం 215 మంది మాత్రమే క్షేత్ర సహాయకులు కొనసాగుతున్నారు.

**పని ఒత్తిడి పెరిగింది : మహేష్, సాంకేతిక సహాయకుల సంఘం జిల్లా నాయకులు**

ఒక్కో గ్రామంలో వంద మంది పనులకు వెళుతుండగా పర్యవేక్షణతో పాటు కొలతల బాధ్యతలు అప్పగించడంతో పని ఒత్తిడి పెరిగి ఇబ్బందిగా మారింది. 2013 నుంచి పోస్టుల భర్తీ లేకపోవడం, ఈసీల బాధ్యతలు అప్పగించడంతో ఎంబీ రికార్డులు చేయాల్సి వస్తోంది. దీనివల్ల సామాజిక తనిఖీల్లో నిధుల అవకతవకలు జరిగినట్లు చూపుతున్నారు. ప్రస్తుతం చేస్తున్న పనితోపాటు అదనపు బాధ్యతలు అప్పగించడంతో సమస్య ఏర్పడుతోంది.

# సైకిల్ ట్రాక్ అంతర్జాతీయం.. నిర్మాణం నాసిరకం

హైదరాబాద్: భారీ ఎత్తున ప్రజాధనం ఖర్చు పెట్టి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించామని చెప్పుకున్న అవుటర్ రింగ్‌రోడ్డు సైకిల్‌ట్రాక్.. నాణ్యత డొల్లతనం బయట పడుతోంది. వట్టినాగులపల్లివద్ద తాజాగా మరోసారి సైకిల్‌ట్రాక్‌కు పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రంగంలోకి దిగిన హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) అధికారులు వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో పగుళ్లు రావడంతో పూడ్చివేశారు. గత అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా పనులు చేపట్టడంతో ఆ ప్రభావం నాణ్యతపై పడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వట్టినాగులపల్లి నుంచి దాదాపు 3 కిలోమీటర్ల మేరకు గతంలో జలమండలికి చెందిన 3500 ఎంఎండయా నీటి పైపులైన్ ఏర్పాటుచేశారు. దాని పైనుంచే సైకిల్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. ఓవైపు పైపులైన్ పనులు జరుగుతుండగానే.. హడావుడిగా ట్రాక్ నిర్మించారు. పైపులైన్‌కు తవ్విన భారీ ట్రెంచ్ పూడ్చివేతలో శాస్త్రీయత లేకుండా పనులు చేయడంతోనే ట్రాక్‌కు ముప్పు ఏర్పడిందని హెచ్‌ఎండీఏ అధికారి ఒకరు వ్యాఖ్యానించడాన్ని బట్టి.. పనుల్లో నాణ్యత తీరు స్పష్టమవుతోంది. పైపులైన్ పొడవునా నిత్యం ఎక్కడో ఒకచోట



పగుళ్లు ఏర్పడుతున్నాయి. అవి పెద్దవైతే కింద ఉన్న పైపులైన్ మనుగడ కష్టమని చెబుతున్నారు. భారీ పైపులైన్ కావడంతో జాయింట్లవద్ద ఎక్కడైనా లీకేజీ ఏర్పడి నీళ్లు పైకి ఉబికి వస్తే.. ఆ పరిధిలో సైకిల్‌ట్రాక్ కొట్టుకుపోయే ప్రమాదముందని అంటున్నారు.

**కిలోమీటర్‌కు రూ.3.91 కోట్ల వరకు...**

అవుటర్ చుట్టూ 23 కిలోమీటర్ల పరిధిలో సైకిల్ ట్రాక్ నిర్మించారు. నానక్‌రాంగూడ నుంచి పోలీస్ అకాడమీ వరకు 8.5, నార్సింగి నుంచి కొల్లూరు 14.5 కి.మీ.మేర ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.90 కోట్లు వెచ్చించారు. అంటే ప్రతి కిలోమీటర్‌కు దాదాపు రూ.3.91 కోట్లు చొప్పున వెచ్చించారు. ట్రాక్ మొత్తం సోలార్ రూఫ్‌టాప్ నిర్మించి 16 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయనున్నట్లు చెప్పారు. రాత్రి కూడా సైక్లింగ్ చేసేలా లైటింగ్ ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించారు. సోలార్ విద్యుదుత్పత్తి 10–13 మెగావాట్లకు దాటడం లేదని తెలుస్తోంది. ట్రాక్ నాణ్యతపై హెచ్‌ఎండీఏ అధికారులను వివరణ కోరగా.. పైపులైన్ పనుల తర్వాత ట్రెంచ్ పూడ్చటంలో జలమండలి సరైన ప్రమాణాలు పాటించకపోవడంతోనే పగుళ్లు వస్తున్నాయన్నారు. పగుళ్లు వచ్చిన చోట సిమెంటుతో పూడ్చుతున్నామన్నారు.

# మరమత్తుకు ఆసరా

ముస్తాబాద్ : ఈ చిత్రంలోని రామగిరి మండలం కల్వచెర్ల పీహెచ్‌సీ నిర్మాణాన్ని 2008లో రూ.6.50 లక్షలతో మొదలుపెట్టారు. అనంతరం నిధులు సరిపోక కొన్నేళ్లు అసంపూర్తిగానే వదిలేశారు. గతేడాది మరో రూ.5.50 లక్షలతో పల్లె దవాఖానా పేరిట మిగిలిన పనులు పూర్తిచేసి ఆస్పత్రిని ప్రారంభించారు. కిటికీలకు, వైద్య సామగ్రికి ప్రస్తుతం రూ.7.50 లక్షలు కేటాయించగా.. రోగులకు సేవలు మెరుగుపడనున్నాయి.

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్: పగుళ్లుబారిన గోడలు.. పెచ్చులూడుతున్న పైకప్పులు.. అస్తవ్యస్తమైన విద్యుత్తు వ్యవస్థ.. నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు.. ఇది జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, వసతి గృహాల పరిస్థితి. ఈ సమస్యల పరిష్కారంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటివరకు పలు కారణాలతో అరకొర వసతులతో ఉన్న వాటికి మరమ్మతులకు తన కోటా కింద రూ.11.14 కోట్లు ఇటీవల కేటాయించారు. ఈ పనులను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు పర్యవేక్షించనున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

**బడుల ప్రగతికి ప్రాధాన్యం**

ప్రభుత్వ బడుల్లో భవనాలు సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల మరమ్మతుల్లో ఏళ్ల తరబడి జాప్యం జరుగుతోంది. పైకప్పులు ప్రమాదకరంగా మారి పెచ్చులూడుతున్నాయి. వర్షాలకు బడులకు సెలవు ఇవ్వాల్సి పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల



అసంపూర్తి ప్రహరీ నిర్మాణంతో పశువులు, పందుల, ఆకతాయిల సంచారంతో అసౌకర్యం కలుగుతోంది. జిల్లాలో ఏయే పాఠశాలల్లో ఈ సమస్య నెలకొందో అక్కడ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

**కలెక్టర్ సందర్శన.. సమస్యలు గుర్తింపు**జిల్లాలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో విరిగిన కిటికీలు, తలుపులతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. మూత్రశాలలకు తలుపులు లేక ఇబ్బంది పడుతు న్నారు. పగుళ్లు బారిన నేలతో ప్రమాదం పొంచి ఉంది. కలెక్టర్ వసతి గృహాల సందర్శనలో భాగంగా సమస్యలు గుర్తించి.. వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేశారు. దీంతో ఎట్టకేలకు విద్యార్థుల సమస్యలు దూరం కానున్నాయి.

**పల్లె వైద్యానికి భరోసా**

ప్రాథమిక, ఉపవైద్య కేంద్రాల్లో అరకొర వసతులతో రోగులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సరిపడా పరికరాలు లేక వైద్యులు పట్టణ ప్రాంతాలకు సిఫార్సు చేస్తున్నారు. కొన్నిచోట్ల కొత్త భవనాలు ఉన్నప్పటికి చిన్న చిన్న సమస్యలతో సేవలు అందడం లేదు. ప్రస్తుతం కలెక్టర్ కోటా నిధులతో మరమ్మతులు చేయాల్సిన ఆరోగ్య కేంద్రాలను బాగు చేయనున్నారు. ఆధునిక పరికరాలు తెప్పించనున్నారు.

# నీటిబొట్టు.. అందితే ఒట్టు!



కరీంనగర్ : కరీంనగర్ గ్రామీణ మండలంలోని ఎస్సారెస్పీ డి–94 కాలువ గుండా నీరందక యాసంగి పంటలు సాగు చేసిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డి–94 మల్కాపూర్ వద్ద ప్రారంభమయ్యే కాలువకు ఆరు వందల క్యూసెక్కుల నీరు రావాల్సి ఉంది కానీ.. ప్రస్తుత యాసంగిలో మూడు వందల నుంచి నాలుగు వందల క్యూసెక్కుల నీరే వస్తోంది. దీంతో చివరి ఆయకట్టు గ్రామాలైన చేగుర్తి, దుర్శేడు, గోపాల్‌పూర్ తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల పంటలకు నీరందటం లేదని రైతులు చెబుతున్నారు.

**రైతుల్లో ఆందోళన**

వచ్చిన నీటిని ఎగువ రైతులే మరల్చుకుంటుండంతో తమ ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. కాలువ నీటి ఆధారంగా పంటలు సాగు చేసిన రైతులు ఇతర రైతుల బావుల నుంచి పైపులైన్ల ద్వారా పంటలకు నీరందజేస్తున్నారు. 30 శాతం మంది రైతులు కాల్వ నీటి ఆధారంగా మొక్కజొన్న, కూరగాయలు, వరి తదితర పంటలు సాగు చేస్తుంటారు. మొదట్లోనే కాల్వ నీరు సక్రమంగా అందటం లేదంటే ఏప్రిల్ 2 వరకు సక్రమంగా అందుతుందా అనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులు, నీటిపారుదలశాఖ అధికారులు పట్టించుకొని తమ పంటలకు సక్రమంగా నీరందేలా చూడాలని కోరుతున్నారు. సాగునీటి సమస్యపై నీటిపారుదల శాఖ డీఈఈ సంతోశ్‌కుమార్‌ను సంప్రదించగా.. ఎగువ రైతులు దిగువకు నీరు వదలాలని చెబుతున్నామని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

**కాలువ నీరే ఆధారం**

కాలువ నీరు వస్తుంది కదా అని దుర్శేడు గ్రామ శివారులో నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. బావి నీటితో మొత్తం పొలం పారటం లేదు. చాలా మంది రైతులం కాలువ నీటి ఆధారంగా పంటలు సాగు చేసి నీటి కోసం ఎదురుచూస్తున్నాం. కలెక్టర్ చొరవ చూపాలి.

– అనుముల మహేందర్, రైతు, గోపాల్‌పూర్, కరీంనగర్ గ్రామీణ మండలం

**కాలువలపై పట్టింపేదీ?**

ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా నారాయణపూర్ జలాశయాన్ని నింపి చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాలకు సాగునీటిని అందించేందుకు కాలువలు నిర్మించారు. ఏళ్లుగా నిర్వహణ కొరవడి, మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలువల్లో పిచ్చిచెట్లు ఏపుగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుగా మారాయి. యాసంగి పంటలకు నీటిని అందించేందుకు బుధవారం ఎల్లంపల్లి నుంచి నీటిని పైపులైన్ల ద్వారా విడుదల చేశారు. రెండేళ్ల కిందట నారాయణపూర్ చెరువులోని మట్టిని ఇటుక బట్టీలకు అక్రమ రవాణా చేసిన సమయంలో లారీలు వెళ్లేందుకు దారిని విస్తరించారు. బండరాళ్లు కాలువలో పడేసి ధ్వంసం చేశారు. దీంతో కాలువ కుచించుకుపోయి నీటి ప్రవాహం ఇబ్బందిగా మారింది. ఎడమ కాలువ ద్వారా మండలంలోని చర్లపల్లి ఎన్, లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, కొండాయపల్లి, కుర్మపల్లి, ర్యాలపల్లి, చర్లపల్లి ఆర్ గ్రామాలతోపాటు మల్యాల, కొడిమ్యాల, రామడుగు మండలాల్లోని ఆయా గ్రామాలకు సాగునీటిని అందిస్తారు. ప్రధాన, ఉప కాలువల్లో ఏపుగా పెరిగిన చెట్లతో నీటి విడుదలలో ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇటీవల ఇదే సమస్యపై ఆయా గ్రామాల రైతులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సాగునీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాస్‌గుప్తాకు వివరించారు. సమస్య పరిష్కారానికి సత్వర కృషి చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

# నాలుగో నగరం ప్రణాళికలు వేగిరం.. ఐటీ సంస్థలు, పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు



హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఐటీ సంస్థలు, పరిశ్రమలను స్థాపించేందుకు ప్రభుత్వం శరవేగంగా ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. నాలుగో నగరం చుట్టూ వీటిని ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రభుత్వ, పట్టా భూముల వివరాలను సేకరించేందుకు రెవెన్యూ అధికారుల కసరత్తు చేస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఔటర్‌కు సమీపంలోని కొన్ని, విమానాశ్రయానికి దగ్గరగా మరికొన్ని ప్రాంతాలను ఇప్పటికే అధికారులు పరిశీలించారు. రెండు జిల్లాల్లో ఆరు మండలాల్లో కొన్ని గ్రామాలను సూత్రప్రాయంగా ఎంపిక చేశారు. గతంలో పరిశ్రమలకు స్థలాలిచ్చి కార్యకలాపాలు కొనసాగించకపోతే వాటిని వెనక్కితీసుకునేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని నిర్ణయించారు.

**పరిశ్రమలు... టెక్స్‌టైల్స్**

నాలుగో నగరానికి పదిహేను కిలోమీటర్ల విస్తీర్ణంలో పరిశ్రమలు, టెక్స్‌టైల్ హబ్‌లను ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో ఫాక్స్‌కాన్ సంస్థ ఆపిల్ ఫోన్ విడిభాగాల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. షాబాద్ మండలంలో విద్యుత్ బస్సుల తయారీ, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఇప్పటికే తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కొత్తగా ఐటీ, పరిశ్రమల హబ్‌లతో పాటు విద్యా సంస్థలు, వినోద కార్యకలాపాలు, రెస్టారెంట్లను ప్రారంభిస్తే నాలుగైదేళ్లలో అక్కడ కూడా అభివృద్ధి వేగవంతమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఐటీ, పరిశ్రమల స్థాపనకు ముందే రహదారులు నిర్మించడం, మొక్కలు నాటడం వంటివి చేపట్టనున్నామని అధికారులు వివరించారు.

**అన్ని అవసరాలకు అనుకూలంగా..**

ఐటీ సంస్థలు, పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం కేటాయించే భూములన్నీ అన్ని అవసరాలకు అనుకూలంగా ఉండేలా అధికారులు చూస్తున్నారు. శేరిలింగంపల్లి, మహేశ్వరం, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, ఘట్‌కేసర్ మండలాల పరిధుల్లో ప్రభుత్వ స్థలాల వివరాలను సేకరించారు. ఒక్కో ప్రాంతంలో కనీసం వెయ్యి ఎకరాలు సేకరించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. సెజ్ తరహాలో ఒకేచోట 200, 300 ఎకరాలు సేకరించాలని, పరిశ్రమలు, ఐటీ సంస్థలకు సమీపంలో ప్రభుత్వ స్థలాలను అభివృద్ధి చేస్తే అక్కడ నివాసముండేందుకు వీలుంటుందని భావిస్తున్నారు.


# అంకురాలకు విదేశీ సంస్థల ప్రోత్సాహం

హైదరాబాద్ : ఐటీ హైదరాబాద్‌లలో పరిశోధనలు చేస్తున్న అంకుర సంస్థలపై విదేశీ సంస్థల ప్రతినిధులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ప్రాణాధార మందుల తయారీ, ఇంజినీరింగ్ బయాలజీ, సెమీకండక్టర్ల రూపకల్పన రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రెండేళ్లలో రూ.250 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని ఆస్పైర్– బయోనెస్ట్‌లో పరిశోధనలు చేస్తున్న అంకుర సంస్థలతో అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న సంస్థలు దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని ప్రత్యేక పరిశోధన కేంద్రంలోని అంకురాలతో అమెరికా, ఐరోపా దేశాల కంపెనీలు చర్చిస్తున్నాయి.

**రూపకల్పన... మార్కెటింగ్ వ్యూహాలు**

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న అంకుర సంస్థల్లో పెట్టుబడి పెడుతున్న విదేశీ సంస్థలు ఆయా సంస్థలు రూపొందిస్తున్న ఆవిష్కరణలు, వస్తువుల తయారీ, సాఫ్ట్‌వేర్ రూపకల్పన వంటి అంశాల్లో సలహాలు ఇవ్వడంతో పాటు మార్కెటింగ్ వ్యూహాల్లోనూ చేదోడుగా ఉంటున్నాయి. పేటెంట్ దరఖాస్తులు, వస్తువుల తయారీకి పరిశ్రమలను గుర్తిస్తున్నాయి. ప్రధానంగా క్యాన్సర్ చికిత్సల్లో రోగులకు ఇస్తున్న మందుల తయారీలో కొత్త ప్రమాణాలు, తక్కువ ధరలో బయోగ్యాస్ ప్లాంట్ల నిర్మాణం, కాలుష్యం తగ్గించే భవన నిర్మాణాల వంటి వాటికి విదేశీ ప్రతినిధులు ప్రాధాన్యమిస్తున్నారు. విదేశాల్లో పరిశోధనలతో పోల్చితే ఇక్కడ ఉత్పత్తి ఖర్చు తక్కువగా ఉండటం, వినియోగదారులు ఎక్కువగా ఉండడంతో ఇక్కడి అంకుర సంస్థలకు ప్రాధాన్యమిస్తున్నారు.

**ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు..**



అంకుర సంస్థల ఏర్పాటు ద్వారా విద్యార్థులు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో లీడర్స్ ఇన్ ఇన్నోవేషన్ ఫెలోషిప్స్ కార్యక్రమం కొనసాగుతోంది. ఇంజినీరింగ్ విద్యార్థులు, ఎంటెక్, పీహెచ్‌డీ పరిశోధకుల్లో సృజనను వెలికితీయడం దీని ప్రత్యేకత. ఇందులో చురుగ్గా పాల్గొంటున్న వారికి ట్రిపుల్‌ఐటీ ఆచార్యులు శిక్షణ ఇస్తున్నారు. కృత్రిమమేధ, ఇంజినీరింగ్ బయాలజీ, సెమీకండక్టర్స్, భవిష్యత్ టెలికాం రంగం, క్వాంటమ్ పరిజ్ఞానం వంటివి ఇందులో ఉన్నాయి. విద్యార్థులు, పరిశోధకులు వీటిపై పరిశోధనలు నిర్వహించి ఫలితాలు వచ్చాయని నివేదిస్తే.. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఆచార్యులు అంకుర సంస్థలు స్థాపించేందుకు ప్రోత్సహిస్తున్నారు.

# కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

రామగుండం : రామగుండం నగరపాలక ప్రాంతంలోని వీర్లపల్లి గ్రామం కాలుష్యకోరల్లో చిక్కుకొని సతమతమవుతోంది. వాయు కాలుష్యంతో పాటు ఎరువుల కర్మాగారం నుంచి వెలువడే భారీ శబ్దాలను భరించలేక ఊరిని వదిలిపెట్టి వెళ్తున్న పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వీర్లపల్లి గ్రామాన్ని అక్కడి నుంచి తరలించి పునరావాసం కల్పించాలంటూ కర్మాగారం యాజమాన్యంపై స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఇటీవల ఎరువుల కర్మాగారం నిర్వహణ తీరును సమీక్షించేందుకు రామగుండం వచ్చిన ఆర్.ఎఫ్.సి.ఎల్. చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి అశోక్ సింఘాల్‌ను కలిసి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు

**డిశ్చార్జి ప్లాంటు నిర్మాణమే శరణ్యం**

రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి వెలువడే రసాయన వ్యర్థాలతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల రసాయన వ్యర్థాలను నేరుగా ప్రధాన మురుగు కాలువలోకి




వదలడంతో గోదావరిఖని విఠల్‌నగర్ ప్రాంత ప్రజలు వాసన భరించలేక ఇళ్లల్లోంచి పరుగెత్తాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికులు తీవ్రస్థాయిలో ఆందోళనలు వ్యక్తం చేయడంతో స్పందించిన ఎమ్మెల్యే, మేయర్ మున్ముందు ఇలాంటి సమస్యలు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని కర్మాగారం ఉన్నతాధికారులను కోరారు. ఇదే స్థాయిలో వాయు కాలుష్యం తప్పడం లేదు. ప్రత్యేక పైపులైను ద్వారా ఎరువుల కర్మాగారం రసాయన వ్యర్థాలను గోదావరినదిలోకి వదులుతున్నారు. దీనిపై అప్పటి ప్రజాప్రతినిధులు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేయడంతో కాలుష్య నివారణ చర్యలు తీసుకునేంత వరకు కర్మాగారంలో ఉత్పత్తి నిలిపివేయాల్సిందిగా ఆదేశించారు. కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులు కర్మాగారాన్ని పరిశీలించి మార్గదర్శకాలను జారీ చేశారు. గడువులోగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన యాజమాన్యం ఆచరణను విస్మరించింది. ఎట్టకేలకు సుదీర్ఘకాలం తర్వాత సుమారు రూ.210 కోట్ల అంచనా వ్యయంతో కర్మాగారంలో జీరో లిక్విడ్ డిశ్చార్జి ప్లాంటు నిర్మాణం చేపట్టేందుకు కర్మాగారం చర్యలు తీసుకోగా ఇటీవలే టెండర్లు పిలిచారు.

**పునరావాసమే పరిష్కారం..**

గతంలో ఎఫ్.సి.ఐ. ఎరువుల కర్మాగారం గోదావరిఖని వైపునకు ఉండడంతో వీర్లపల్లి వాసులు అంతగా ఇబ్బంది పడేవారు కారు. తాజాగా ఆర్.ఎఫ్.సి,ఎల్. ఎరువుల కర్మాగారం పూర్తిగా వీర్లపల్లి పక్కనే ప్రహరీని ఆనుకొని నిర్మించడంతో వీర్లపల్లి వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కర్మాగారం నుంచి వెలువడే శబ్దాలతో పక్కపక్కనే ఉన్నా ఒకరికొకరు మాట్లాడుకుంటే వినిపించని పరిస్థితులు నెలకొన్నాయి. అమ్మోనియా లీకేజీ జరిగిందంటే ముక్కు పుటాలు అదిరిపోవాల్సిందే.

# ఆశ.. నిరాశ!

ముస్తాబాద్ : కళ్ల ముందే రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ఏళ్లు గడుస్తుంది. అయినా వారి సొంతింటి కల మాత్రం నెరవేరిన దాఖలాలు లేవు. గుత్తేదారు చివరి దశలో చిన్న చిన్న పనులు చేపట్టకుండా వదిలేయడం, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. నిర్మించినవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముస్తాబాద్ మండలంలోని ముస్తాబాద్, మోహినికుంట, మద్దికుంట, పోత్గల్, చిప్పలపల్లి గ్రామాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించారు. కొండాపూర్, గూడెం గ్రామాల్లో ఇళ్లు నిర్మించారు. ఈ రెండు గ్రామాల్లో ముందుగానే గ్రామ పంచాయతీ పాలకవర్గం సమక్షంలో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు.కొండాపూర్‌లో 40 ఇళ్లు నిర్మించారు. తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంకులు, పెయింటింగ్ పనులు పూర్తి కాలేదు. దీంతో లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. గూడెంలో 48 ఇళ్లు కట్టారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంకు వంటి చిన్న చిన్న పనులు చేయాల్సి ఉంది. సదరు గుత్తేదారు పనులు చేయకపోవడంతో పంపిణీ చేయలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.నాటి నుంచి నేటి వరకు



లబ్ధిదారులు రెండు పడక గదుల ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం మారిపోవడంతో తరవాత వీటిని పట్టించుకున్న నాథుడు లేడు. నిరుపయోగంగా మారాయి.ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని ఆయా గ్రామాల వాసులు పేర్కొంటున్నారు. మరోవైపు లబ్ధిదారుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. సొంతింటి కల నెరవేరే పరిస్థితి కనిపించడం లేదని ఆందోళన చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించి అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసి పంపిణీ చేయాలని లబ్ధిదారులు వేడుకొంటున్నారు.

పనులు పూర్తి చేయాలి గూడెంలో రెండు పడక గదుల ఇళ్లు 48 నిర్మించారు. తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంకులు, పెయింటింగ్ పనులు మిగిలి ఉన్నాయి. గుత్తేదారు పనులను మధ్యలో వదిలేశారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సదరు గుత్తేదారు ద్వారా పనులు పూర్తి చేయించి లబ్ధిదారులకు అందించాలి. ఈ ఇళ్లు లబ్ధిదారులకు అందిస్తే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సులభమవుతుంది. ఇరువురికి న్యాయం చేసినవారవుతారు.– చిట్నేని శ్రీనివాసరావు, స్థానికుడు

అసంపూర్తి పనులపై తెలుసుకుంటానేను ఇటీవలే ఏఈగా బాధ్యతలు చేపట్టాను. రెండు పడక గదుల ఇళ్ల పనులు ఎందుకు పూర్తి చేయలేదనే విషయాన్ని సదరు గుత్తేదారును అడిగి తెలుసుకొంటాను.

– నిఖిల్ సాయి, ఆర్అండ్‌బీ ఏఈ

చురకలు



# సూర్య ఘర్‌తో వెలుగులు

గణపవరం : కూటమి ప్రభుత్వం సూర్య ఘర్ పథకంతో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో వెలుగులు నింపనుంది. గత ప్రభుత్వాలు వీరికి విద్యుత్తు బిల్లుల్లో 200 యూనిట్ల వరకు రాయితీలు మాత్రమే ఇచ్చేవి. ప్రస్తుత ప్రభుత్వం పాత విధానాలకు స్వస్తి పలికి వారిపై పైసా భారం పడకుండా సౌర ఫలకాలు ఏర్పాటుచేయనుంది. ఒక్కో ఇంటికి సౌర ఫలకాలు ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.1.15 లక్షలు ఖర్చవుతుండగా కేంద్ర ప్రభుత్వం రాయితీ కింద రూ.60 వేలు చెల్లిస్తోంది. మిగతా రూ.55 వేలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించి.. ఒక్కో ఇంటిపై 2 కిలోవాట్ల సౌర ఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్తు బిల్లుల భారం పడకుండా ఉండేందుకు కసరత్తు చేస్తోంది.

దశల వారీగా.. రెండు కిలోవాట్ల సౌర ఫలకాల ఏర్పాటుతో ప్రతి నెలా సుమారు 240 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. లబ్ధిదారు వినియోగించుకోగా మిగిలింది విద్యుత్తు గ్రిడ్‌కు వెళ్తుంది. దశల వారీగా



సౌర ఫలకాల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. శ్లాబులు లేని ఇళ్లకు వీటిని ఎలా అమర్చాలనే విషయమై సర్వే చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించడంతో వారు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. పూరి గుడిసెలు, రేకుల షెడ్లపై ఏవిధంగా అమర్చాలో సమాలోచనలు చేస్తున్నారు. ఆదేశాలు రాగానే అమలు.. ఎస్సీ, ఎస్టీలకు సూర్యఘర్ అమలు కోసం సర్వే ప్రారంభించాం. శ్లాబు ఇళ్లు, పూరి గుడెసెలు, రేకుల షెడ్లలో ఉన్నవారి వివరాలను సేకరిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపడతాం.సాల్మన్‌రాజు, ఎస్‌ఈ, ఏపీఈపీడీసీఎల్, ఏలూరు

# బడుల్లో బోగస్ విద్యార్థులెందరు !

ఒంగోలు : ఎయిడెడ్ పాఠశాలల్లో యూడైస్ లెక్కల ప్రకారం ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేస్తారు. అక్కడ పనిచేసే వారికి ప్రభుత్వమే వేతనాలు చెల్లిస్తుంది. ఈ క్రమంలో కొన్ని యాజమాన్యాలు క్షేత్రస్థాయి అధికారులను సానుకూలపరచుకొని తప్పుడు లెక్కలు చూపుతున్నాయనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థుల సంఖ్య పరిశీలనకు త్రీమెన్ కమిటీని అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో ఒక ఉప విద్యాశాఖాధికారి, ఎంఈవో, ఉన్న పాఠశాల సీనియర్ ప్రధానోపా




ధ్యాయుడు ఉంటారు. వీరు జిల్లాలోని 98 ఎయిడెడ్ పాఠశాలలను పరిశీలిస్తారు. దీంతో ఎయిడెడ్ యాజమాన్యాల లెక్కల్లో నిజాలు బట్టబయలు కానున్నాయి.

తల్లిదండ్రుల ఫిర్యాదుతో చర్యలు: ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు లేకుండా ఉపాధ్యాయులకు ప్రభుత్వం వృథాగా వేతనాలు చెల్లిస్తోందంటూ కొమరోలుకు చెందిన కొందరు తల్లిదండ్రులు ఇటీవల ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ త్రీమెన్ కమిటీలను నియమించారు. పాఠశాలకు వెళ్లి వాస్తవంగా ఎంతమంది పిల్లలు ఉన్నారనే వివరాలు పంపాలని డీఈవోలను ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక అదనంగా ఉన్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరణలో భాగంగా అవసరమైన ఇతర పాఠశాలల్లో నియమించనున్నట్లు సమాచారం.

నలభై లోపుంటే తుది నోటీసులు నలభై మందిలోపు విద్యార్థులున్న ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యాలకు తుది నోటీసులు జారీ చేయాలని విద్యాశాఖ కమిషనర్ డీఈవోలకు ఆదేశాలిచ్చారు. ఇటువంటివి జిల్లాలో 28 ఉన్నట్లు గుర్తించారు. గత మూడేళ్లుగా ఆ సంఖ్య పెరగకపోగా తగ్గుతుండటంతో మూసివేతకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికి రెండుసార్లు నోటీసులు జారీ చేసింది. తుదిగా ఇప్పుడు ఇవ్వనున్నారు. ఏప్రిల్ 23లోపు వాటిని మూసివేసి విద్యార్థులను సమీప పాఠశాలల్లో చేర్చాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

# వంతెనలు వణికిస్తున్నాయి..



టెక్కలి : టెక్కలి– పాతపట్నం మార్గంలో తిర్లంగి, లక్ష్మీపురం ప్రాంతాల్లో ఉన్న ఆర్‌అండ్‌బీ వంతెనలు శిథిలస్థితికి చేరి ప్రయాణికుల్ని భయపెడుతున్నాయి. టెక్కలి నుంచి సారవకోట, పాతపట్నం మండలాలకు చెందిన ప్రజల రాకపోకలతో నిత్యం ఈ మార్గం రద్దీగా ఉంటుంది. గ్రానైట్ క్వారీలు సైతం ఉండటంతో భారీ బ్లాక్‌లను రవాణా చేస్తుంటారు. ఈ రెండుచోట్ల వంతెనలు పూర్తిగా శిథిలమయ్యాయి. తిర్లంగి వద్ద రక్షణగోడ సైతం విరిగి ప్రమాదకరంగా మారింది. లక్ష్మీపురం గ్రామ కూడలిలో ఉన్న వంతెన కింది భాగంలో ఇనుప ఊచలు బయటపడి భయంగొల్పుతున్నాయి. సమస్యపై ఆర్‌అండ్‌బీ ఏఈ జగదీశ్ మాట్లాడుతూ తిర్లంగి వద్ద రూ.1.20 లక్షలు, లక్ష్మీపురం కూడలి వద్ద వంతెనకు రూ.1.60 లక్షలతో మరమ్మతు పనులకు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపించామన్నారు.

# సహకారం సెప'రేటు'..!



అనకాపల్లి : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) నుంచి సంబంధిత అధికారులు అందినంత దోచుకుంటున్నారు. పీఏసీఎస్‌ల్లో రోజువారీ లావాదేవీలకు రేటు కట్టి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. కాసులివ్వకుంటే కొర్రీలుపెట్టి అడ్డుకుంటున్నారు. ప్రభుత్వ శాఖల్లో సహకారం 'సెప'రేటు' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సీఈవోల నుంచి జిల్లా అధికారుల వరకు సహకార సంఘాలను తమ జేబు సంస్థగా మార్చుకున్నారు. ఇప్పటికే చెట్టుపల్లి, జానకీరామపురం సంఘాల్లో సీఈవోలు భారీగా నిధులు దుర్వినియోగం చేశారు. తాజాగా జిల్లా సహకార కార్యాలయంలో ఫర్నిచర్ కోసం పీఏసీఎస్‌ల నుంచి అనధికార వసూళ్ల విషయంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి గోవిందరావు సస్పెన్షన్‌కు గురయ్యారు. వీరే కాదు పర్సన్ ఇన్‌ఛార్జుల పేరుతో కొందరు.. ఆడిటర్ల పేరుతో మరికొందరు సహకార సంఘాలను పీడించేస్తున్నారు. ఈ తతంగమంతా తెలిసినా జిల్లా అధికారులు ఏమీ పట్టనట్టే వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

జిల్లాల పునర్విభజన తర్వాత అనకాపల్లి జిల్లా సహకార అధికారి (డీసీవో) కార్యాలయాన్ని కశింకోటలో ఏర్పాటు చేశారు. అందులో ఫర్నిచర్ కోసమంటూ జిల్లాలోని 74 పీఏసీఎస్‌ల నుంచి విరాళాలు దండుకున్నారు. ఒక్కో సంఘం నుంచి కనిష్ఠంగా రూ.5 వేల గరిష్ఠంగా రూ.10 వేలు చొప్పున వసూళ్లు చేశారు. సహకారశాఖ ఆడిటర్లు, మరికొంత మంది సిబ్బంది ఈ ఘనకార్యం చేశారు. రెండేళ్లు ఈ వ్యవహారం గుట్టుగానే ఉంచారు. తర్వాత వారిలో వారికే పొసగక ఫిర్యాదులు చేసుకోవడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో డీసీఏ గోవిందరావే పీఏసీఎస్‌ల నుంచి తమను వసూళ్లు చేయమని చెప్పారని, అందుకు సాక్ష్యాలు కూడా ఉన్నాయని కొంతమంది సహకార శాఖ కమిషనరేట్‌కు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణలో నిజమేనని తేలడంతో గోవిందరావును సస్పెండ్ చేశారు. అయితే అధికారిక ఉత్తర్వులు లేకుండా నోటి మాటగా చెబితే వసూళ్లకు పాల్పడడం కిందిస్థాయి సిబ్బందిది కూడా తప్పే అవుతుంది కదా వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ సంబంధిత శాఖలోనే చర్చించుకుంటున్నారు.

**పైసలిస్తేనే దస్త్రాలు కదిలేది..**

ప్రాథమిక సహకార సంఘాలకు పాలకవర్గాలు లేవు. సహకార శాఖ అధికారులే పర్సన్ ఇన్‌ఛార్జులుగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 98 సంఘాలున్నాయి. నాలుగైదు సంఘాలకు కలిపి ఒక పర్సన్ ఇన్‌ఛార్జిని నియమించారు. వీరిలో కొంతమంది పీఏసీఎస్‌లో ఏ దస్త్రంపై సంతకం చేయాలన్నా చేయి తడపాల్సిన పరిస్థితి. రైతులు రుణాలను రెన్యువల్ చేసే క్రమంలో ఎక్కువ డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. స్టేషనరీ కొనుగోలు, జీతాలు బిల్లులు మార్చినప్పుడు పర్సంటేజీ ప్రకారం ఇస్తేనే సంతకాలు చేస్తున్నారు. సహకార సంఘాల్లో వ్యవహారాలన్నీ చేతిరాతతోనే జరుగుతున్నాయి. డబ్బులిస్తే సర్దుబాటు లేకుంటే అడ్డుకుంటూ వేధిస్తున్నారని ఓ పీఏసీఎస్ సీఈవో 'ఈనాడు' వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగైదు సంఘాల పర్యవేక్షణ పేరుతో రవాణా భత్యం భారీగానే నొక్కేశారు. సీఈవోలు విశాఖ నుంచి రాకపోకలు సాగించడం, బినామీ పేర్లతో వారు కూడా రుణాలు పొందడంతో పర్సన్ ఇన్‌ఛార్జులు, ఆడిటర్లు ఎంత అడిగితే అంత సమర్పించుకుంటున్నారు.

# భూతాల చెట్టాపట్టాలు

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో 'రెవెన్యూ'లో భారీ అక్రమాలు జరిగాయి. కొందరు రెవెన్యూ అధికారులు, వైకాపా నాయకులు కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారు. అందులో ఫ్రీహోల్డ్ వ్యవహారం ఒకటి. 20 ఏళ్లు దాటిన.. 2003కు ముందు పేదలకు పంపిణీ చేసిన భూములకు యాజమాన్య హక్కులు (ఫ్రీహోల్డ్) కల్పిస్తూ గత ప్రభుత్వం జీవో జారీ చేసింది. దాని మాటున నిబంధనలకు విరుద్ధంగా వేల ఎకరాలకు అయినవారికి కట్టబెట్టారు. దీనిపై కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**అనర్హులకు యాజమాన్య హక్కులు**

ఉమ్మడి జిల్లాలో 2004, 05లో ఎసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు పంపిణీ చేశారు. కొన్నింటికి అసైన్‌మెంట్ కమిటీ లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా పట్టాలిచ్చారు. 2003 తర్వాత పట్టాలిచ్చిన, అసలు పట్టాలే లేకుండా ఆన్‌లైన్‌లో ఉన్న భూములకూ హక్కులు కల్పించారు. నిబంధనల ప్రకారం 2003కు ముందు పట్టాలున్నవారే ఫ్రీహోల్డ్‌కు అర్హులు. ఆ ముసుగులో వందలాది ఎకరాలకు పైగా యాజమాన్య హక్కులు కల్పించారు. దీనిపై అప్పట్లోనే పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. **వేగవంతం చేయాలి మరి**

గతేడాది అక్టోబరు నుంచి ఫ్రీహోల్డ్ భూములను రెవెన్యూ యంత్రాంగం పునఃపరిశీలిస్తూనే ఉంది. ఫ్రీహోల్డ్ అయిన భూములకు సంబంధించిన క్రయవిక్రయాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లను ఆపేశారు. నెలలు గడుస్తున్నా నిబంధనలకు విరుద్ధంగా ఎన్ని ఎకరాలు చేశారన్న లెక్క తేల్చడంలో జిల్లా యంత్రాంగాలు జాప్యం చేస్తున్నాయి. కలెక్టరేట్‌లలో గత ఐదు నెలలుగా ఫ్రీహోల్డ్ భూముల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.

**75,930 ఎకరాల పరిశీలన**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,00,394.44 ఎకరాలకు ఫ్రీహోల్డ్ (యాజమాన్య హక్కులు) కల్పించారు. అందులో 75,930.81 ఎకరాల పరిశీలన పూర్తైంది. ఇందులో 30,764.44 ఎకరాలను మాత్రమే జిల్లా పాలనాధికారులు ఆమోదించారు. ఇక 18,070.35 ఎకరాలకు సంబంధించి వ్యత్యాసాలున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో 33,447.22 ఎకరాలకు సంబంధించి నిబంధల ప్రకారం జరిగాయని, సుమారు 2,142 ఎకరాలు చట్ట విరుద్ధంగా చేశారని ప్రాథమికంగా నిర్ధారించారు. మరో 11,874.08 ఎకరాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది.

**505.43 ఎకరాలు గల్లంతు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,2,84.93 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేశారు. చట్టబద్ధంగా 1,779.5 ఎకరాలు ఉండగా. 505.43 ఎకరాల భూములు వ్యత్యాసాలున్నాయని తేల్చారు. ఉమ్మడి జిల్లాలో 2,292.88 ఎకరాలకు సంబంధించిన వివరాలను కంప్యూటరీకరణ చేశారు. కర్నూలు జిల్లాలో మొత్తం 556.67 ఎకరాలకు గాను 497.13 ఎకరాలను నిబంధనల ప్రకారం రిజిస్టర్ చేశారు. మరో 59.54 ఎకరాలకు సంబంధించి వ్యత్యాసాలున్నాయి. ఇప్పటివరకు 538.71 ఎకరాలను పరిశీలించగా.. మరో 17.96 ఎకరాలను పరిశీలించాల్సి ఉంది.

# ఆర్‌యూ.. ఇదేం వరూసా



కర్నూలు : రాయలసీమ విశ్వవిద్యాలయం (ఆర్‌యూ)లో ప్రగతి పనులు నత్తను తలపిస్తున్నాయి. విశ్వవిద్యాలయాల అభివృద్ధిలో భాగంగా రాయలసీమ వర్సిటీకి కేంద్రం రూ.20 కోట్లు కేటాయించింది. 2020 నుంచి నేటికీ నిధులు ఖర్చు చేయలేదు. గుత్తేదారులకు పనులు అప్పగిస్తే అన్నీ వారే చూసుకునే అవకాశమున్నా పూర్తిస్థాయిలో వీసీలుగా పనిచేసినవారు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ప్రస్తుత ఇన్‌ఛార్జి వీసీ రూ.10 కోట్ల విలువైన పనులను యుద్ధప్రాతిపదికన చేస్తుండటం గమనార్హం.

**'దారి'తప్పిన నిర్మాణం**

జగన్నాథగట్టు ప్రధాన రహదారి నుంచి ఇంజినీరింగ్ కళాశాల భవనం వరకు ఉన్న దూరంలో కొంతమేర రూ.40 లక్షలు వెచ్చించి గ్రావెల్ రోడ్డు వేశారు. ఆయా పనులు నాసిరకంగా జరిగాయన్న ఆరోపణలు రావడంతో దానిపై అప్పటి కలెక్టర్ ఆదేశాలమేరకు ఆర్ అండ్ బి అధికారులు విచారణ జరిపారు. నిధులు వెచ్చించిన తీరుపై సమగ్ర విచారణ చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**అర్ధంతరంగా ఆగిపోయాయి**జగన్నాథగట్టుపై ఉన్న 180 ఎకరాల్లో ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాల నిర్మించాలని కొన్నేళ్ల కిందట నిర్ణయించారు. రూసా కింద కేటాయించిన రూ.20 కోట్ల నిధుల్లో రూ.10 కోట్లతో భవనాలు నిర్మించాలని భావించారు. గత వైకాపా ప్రభుత్వం ఎ.పి.ఇ.డబ్ల్యు.ఐ.డి.సి.కి పనులు అప్పగించింది. గుత్తేదారు సుమారు రూ.కోటి విలువైన పనులు చేశారు. బిల్లులు ఎంతకీ విడుదల చేయకపోవడంతో పనులు మధ్యలో ఆపేశారు.

**మరమ్మతులకు భారీగా ఖర్చు**

రాయలసీమ విశ్వవిద్యాలయంలో వసతిగృహాలు, అకడమిక్, పరిపాలన, గ్రంథాలయం తదితర భవనాల మరమ్మతులకు ఏకంగా రూ.4 కోట్లు వెచ్చిస్తున్నారు. మొత్తం పది పనులకుగానూ ఇప్పటికే ఎనిమిది పనులు మొదలయ్యాయి. మరమ్మతులకు అంతమొత్తం వినియోగిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రూ.కోట్లలో అంచనా..**కంప్యూటర్ సైన్స్ ల్యాబ్, ఏఐ ల్యాబ్‌లకు అవసరమైన కంప్యూటర్లతో పాటు వాటి ఏర్పాటుకు సంబంధించి ఫర్నిచర్ కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈసీఈ ల్యాబ్‌కు అవసరమైన పరికరాలకు రూ.కోటి వ్యయమవుతుందని అంచనా వేశారు. అన్ని పీజీ కోర్సులకు సంబంధించి ల్యాబ్ ఉపకరణాలకు రూ.3 కోట్లవుతుందని అంచనా వేస్తున్నారు. కొనుగోళ్ల పేరుతో భారీగా వ్యయం చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

# చెరువుకు చేవ : మొదటి దశలో రూ.15 కోట్లు

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వం చెరువుల అభివృద్ధిని పట్టించుకోలేదు. కనీసం పూడికతీత పనులు చేపట్టలేదు. దీంతో చాలా ప్రాంతాల్లో తటాకాలు రూపు కోల్పోయాయి. కూటమి ప్రభుత్వం చెరువులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆర్.ఆర్.ఆర్. (మరమ్మతులు, పునర్నిర్మాణం, పునరుద్ధరణ) పథకం కింద నిధులివ్వాలని కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో ట్రిబులార్–3లో భాగంగా ఉమ్మడి జిల్లాలో చెరువులను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర వాటా 40 శాతం, కేంద్రం 60 శాతం నిధులతో బాగు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన చెరువుల అభివృద్ధికి రూ.48 కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆర్.ఆర్.ఆర్. పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొదటి దశలో రూ.15 కోట్ల విలువతో పనులు చేపట్టేందుకు 7 చెరువుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఆలూరు మండలం వెంగళాయదొడ్డి చెరువు బాగుకు రూ.4.10 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. దీని కింద 1,350 ఎకరాల ఆయకట్టు ఉంది. కాల్వలు పూడిపోవడంతో ఆయకట్టు తగ్గుతోంది. .. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదనలు పంపామని జలవనరుల శాఖ ఆస్పరి ఏఈఈ రంగడు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. నిధుల విడుదలైన వెంటనే పనులు చేపడతామన్నారు.

# అనంతార్థ.. మాయలెన్నో!

కావలి : అనంతార్థ అసోసియేట్స్ మనీస్కామ్‌లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బాధితుల సంఖ్య పెరుగుతోంది. పొరుగు జిల్లాల్లోని వారు కూడా భారీగా పెట్టుబడి పెట్టారు. ప్రకాశం జిల్లాలోని ఓ మండల తహసీల్దార్ ఏకంగా రూ.కోటి వరకు డిపాజిట్ చేసినట్లు సమాచారం. సదరు తహసీల్దార్ కొండాపురం మండలంలో ఉన్న తన మిత్రుడి ద్వారా ఇందులో చేరారు. ఆయన మిత్రుడు రూ.11 లక్షలు చెల్లించి డివిడెండ్లు పొందడంతో అతను రూ.కోటి పెట్టినట్లు తెలుస్తోంది. కావలిలోని స్వర్ణ వ్యాపారులు తమ సొమ్ము పోగొట్టుకున్నట్లు చెపుతున్నారు.

**బ్యాంకు ఖాతాల స్తంభన**



స్కాంపై విచారణ చేస్తున్న పోలీసులు నిందితుల ఖాతాలను స్తంభింపజేస్తున్నారు. ఇప్పటివరకు 20 మందికిపైగా కీలక నిందితుల బ్యాంకు ఖాతాల్లో లావాదేవీలు నిలిపేశారు. మరో 100 మందివి కూడా సీజ్ చేస్తారని సమాచారం. ఇతర ప్రాంతాల వారు ఎందరో ఫిర్యాదులు చేస్తున్నారు. కావలి గ్రామీణ పోలీసుస్టేషన్‌లో నెలకొన్న వర్గపోరుతో ఈ వ్యవహారం బయటపడినట్లు సమాచారం.

**ఆటో డెబిట్ పద్ధతిలో చెల్లింపు**

డిపాజిట్‌దార్లకు తొలుత డివిడెండ్‌ను ఆటో డెబిట్ విధానంలో సకాలంలో చేరేలా ఏర్పాట్లు చేశారు. నగదు జమ కాగానే ఆ సంస్థ ప్రమోటర్లు నేరుగా డిపాజిటర్లకు ఫోన్లు చేస్తారు. మీ ఖాతాల్లో ఈ వాయిదా డివిడెండ్ జమ అయిందని చూసుకోవాలని పలకరిస్తారు. ఇలా నమ్మకం పెంచుకొని తరువాత అక్రమాలకు పాల్పడ్డారు.

**ఇంకా ఎన్నో..**ఆ సంస్థలో చేసిన అనుభవంతో పలువురు ఏజెంట్లు సొంతంగా ఈ స్కీమ్‌లు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పాతూరు, వైకుంఠపురంలో ఇలాంటి వసూళ్లు చేస్తున్నట్లు వెలుగులోకి వస్తోంది. తామే ప్రతి నెలా ఆరేడు శాతానికి పైగా డివిడెండ్లు ఇస్తామని వసూళ్లకు పాల్పడ్డారు. స్టాక్‌మార్కెట్ లావాదేవీలకు ఖాతాలను ప్రారంభించి అమలుచేస్తున్నారు.

# సాగు.. సాంకేతిక సొబగు

నెల్లూరు : వ్యవసాయ రంగంలో వినూత్న పోకడలు.. ఉత్తమ యాజమాన్య పద్ధతులు.. యంత్ర పరికరాల వినియోగం.. ఆక్వాలో మేలైన విధానాలను రైతుల దరి చేర్చడమే లక్ష్యంగా మూడేళ్ల తర్వాత నెల్లూరులోని వ్యవసాయ పరిశోధనా స్థానం(ఏఆర్‌ఎస్)లో నేడు కిసాన్ మేళా జరగనుంది. 'ఆధునిక సాంకేతికత– లాభసాటి వ్యవసాయం' అన్న నినాదంతో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం– వ్యవసాయశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం రైతులకు మేలు చేకూర్చనుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**నూతన వంగడాల క్షేత్ర ప్రదర్శన**

నూతన వరి వంగడాల ఆవిష్కరణలో నెల్లూరులోని ఏఆర్‌ఎస్‌ది దేశంలోనే ప్రత్యేకస్థానం. నెల్లూరు మసూరి(ఎన్‌ఎల్‌ఆర్ 34449) రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా సుమారు 8 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతుండగా– ఎన్‌ఎల్‌ఆర్– 40024, ఎన్‌ఎల్‌ఆర్– 3354, ఎన్‌ఎల్‌ఆర్– 40054, ఎన్‌ఎల్‌ఆర్– 3238 తదితర 30 వరి రకాలు ఇక్కడ పురుడు పోసుకున్నవే కావడం గమనార్హం.

**60 స్టాళ్ల ఏర్పాటు**

కిసాన్ మేళాలలో భాగంగా వివిధ అంశాలపై ఏఆర్‌ఎస్ ప్రాంగణంలో 60 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. వాటిలో వరితో పాటు అపరాలు, వేరుసెనగ, నూనె గింజలు, పత్తి, చిరుధాన్యాలు పంటల్లో ఆధునిక యాజమాన్య పద్ధతులు, మెట్ట వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ తదితర అంశాలతో పాటు నిమ్మ, మామిడి, కొబ్బరి సాగులో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్తలు వివరించనున్నారు. ఆక్వా కల్చర్‌లో నూతన అభివృద్ధి కార్యక్రమాలు, శాస్త్రవేత్తలు, రైతుల చర్చా కార్యక్రమం, వ్యవసాయ క్విజ్‌లు కిసాన్ మేళాలలో భాగంగా జరగనున్నాయి.

**సద్వినియోగం చేసుకోవాలి**

మూడేళ్ల తర్వాత కిసాన్‌మేళా నెల్లూరు ఏఆర్‌ఎస్‌లో జరుగుతోంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం, రైతుల సందేహాలను నివృత్తి చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలి. యు.వినీత, ప్రధాన శాస్త్రవేత్త, ఏఆర్‌ఎస్ హెడ్

# ఉపశమనం..!

టెక్కలి :జిల్లాలో ఖరీఫ్ ధాన్యం అమ్ముకునేందుకు అన్నదాత పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. ప్రస్తుత తరుణంలో లక్ష టన్నుల మేర ధాన్యపు నిల్వలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిల్వలు వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, నరసన్నపేట నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతి లేకపోవడంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా జిల్లాకు 60 వేల టన్నులు అదనపు లక్ష్యం ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. గత ఖరీఫ్‌లో 3.6 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, దాదాపు 9.51 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులొచ్చాయి. ఇదంతా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని లేదు. రైతుల వద్ద స్తంభించిన ముతక రకం తీసుకోవాలని వస్తున్న డిమాండ్‌తో జిల్లాలో 4.9 లక్షల టన్నులు తీసుకునేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు 4.57 లక్షల టన్నులు కొన్నారు. నిర్దేశిత లక్ష్యం పూర్తి కాకుండానే జిల్లా వ్యాప్తంగా ప్రక్రియ దాదాపు నిలిచిపోయింది. దీంతో పెద్ద ఎత్తున రైతుల వద్ద ధాన్యం నిల్వలున్నాయి. రహదారులు, కల్లాల్లో బస్తాలు పేరుకుపోయాయి.

అరకొరగా ఇస్తే మళ్లీ ఇబ్బందులే.. రైతుల నుంచి వస్తున్న ఒత్తిడితో ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి కనీసం 90 వేల టన్నుల లక్ష్యమివ్వాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. కానీ అదనంగా జిల్లాకు 60 వేల టన్నుల ధాన్యం లక్ష్యం ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. అధికారుల లెక్కల ప్రకారం 76,950 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాల్లో, 13,550 మెట్రిక్ టన్నులు కుప్పల రూపంలో ఉన్నాయి. అరకొర లక్ష్యం ఇస్తే తీవ్ర ఇబ్బందులు పడతామని రైతులు పేర్కొంటున్నారు. 'ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచాలని ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తక్షణమే కొనుగోలు చేస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు.' అని పౌర సరఫరాల సంస్థ డీఎం టి.వేణుగోపాల్ పేర్కొన్నారు. దాచుకునే దారిలేక పొలాల్లోనే ఉంచాం – యాళ్ల పాపారావు, మాకివలస, నరసన్నపేట మండలం రెండెకరాల్లో వరి పంటను కుప్పల రూపేనా పొలాల్లోనే ఉంచాం. ఎలుకలు, పక్షులు తాకిడితో ధాన్యం నష్టపోతున్నాను. లక్ష్యం లేకపోవడంతో వరి కుప్పలు విడదీసి నూర్చలేక పోతున్నాం. ధాన్యం కొనుగోలుకు వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి.

## బియ్యం లేవు.. డబ్బులిస్తామంటున్నారు..!



చిత్తూరు : బియ్యం లేవు.. తక్కువగా వచ్చాయి.. బియ్యానికి బదులు డబ్బులిస్తాం.. లేకపోతే వచ్చే నెలలో అందజేస్తాం. గట్టిగా ప్రశ్నిస్తే రావద్దు అంటున్నారని కార్డుదారులు లబోదిదోమంటున్నారు. ఈ ఘటన చిత్తూరు నగర పరిధి 28వ డివిజన్ వినాయకపురం చౌక దుకాణం 41లో చోటుచేసుకుంది. సదరు చౌక దుకాణ డీలరు బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదని ముప్పతిప్పలకు గురిచేస్తున్నారంటూ కార్డుదారుల ఆవేదన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించారు. వినాయకపురం చౌక దుకాణం పరిధిలో 396 బియ్యం కార్డులున్నాయి. ఫిబ్రవరి నెలకు సం బంధించి ఇప్పటివరకు 159 కార్డులకే సరకులు అందజేసినట్లు పౌరసరఫరాల శాఖ లెక్కలు చెబుతున్నాయి. 'సరకులు ఎప్పుడిస్తారో తెలియదు. బియ్యంలో కోత, కందిపప్పు ఒక నెల ఇస్తే మరో నెల ఇవ్వరు. ఎండీయూ వాహనం ఎక్కడుందో తెలియదు. ప్రతి నెలా దుకాణం వద్దే బియ్యం తీసుకుంటు న్నాం. ఈ నెలలో బియ్యం తక్కువ గా వచ్చా యి.. బియ్యానికి బదులు డబ్బులిస్తామని కొందరికి.. 35 కిలోలు ఇవ్వాల్సిన కార్డుదారులకు 20 కిలోలు అందజేశారు. మిగిలిన 15 కిలోలు వచ్చే నెలలో ఇస్తామన్నారు. లేని పక్షంలో నగదు ఇస్తామంటున్నారు' అని కార్డుదారులు ఆరోపిస్తున్నారు. తిండి గింజలు లేకపోతే మేం ఎలా బతకాలని కార్డుదారు వనజ వాపోయారు.

**డీలరుపై చర్యలు..**

విచారించి డీలరుపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. కార్డుదారులకు విధిగా నిత్యావసర సరకులు అందజేయాలి. బియ్యానికి బదులు నగదు ఇచ్చినట్లు రుజువైతే కేసు నమోదు చేస్తాం. శంకరన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

## పెరిగిన వ్యయం.. ఆగదు యజ్ఞం

అనకాపల్లి: వైకాపా హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన జల్‌జీవన్ మిషన్ పనులను పూర్తిచేయడానికి కూటమి సర్కారు అడుగులు వేస్తోంది. నీటి వనరుల లభ్యతపై అంచనా లేకుండా గత ప్రభుత్వం చేసిన పనులతో నిధులు వృథా అయ్యాయే తప్ప తాగునీరు మాత్రం అందుబాటులోకి రాలేదు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో తలసరి 55 లీటర్ల నీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో జలాశయాల నుంచి నీటిని వాడుకునేందుకు కొత్తగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2058 నాటికి జనాభా ఎంత పెరుగుతుందో అంచనా వేసి అప్పటి



అవసరాలకు సరిపడా నీటిని అందించేలా ఏర్పాట్లు చేయడానికి సవిర నివేదికలు (డీపీఆర్) తయారు చేశారు.

**జలాశయాల నుంచి ఇంటికి చేరేది ఎలా అంటే..:** రిజర్వాయర్ నుంచి నీటిని కాలువలు, ఇతర మార్గాల ద్వారా సేకరించి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు చేరవేస్తారు. అక్కడ శుద్ధి చేసిన నీటిని సమీపంలో సంపులకు పంపిస్తారు. అక్కడి నుంచి పంప్ హౌస్, గ్రామాల్లో వాటర్ ట్యాంకులకు గ్రావిటీ విధానంలో పైపుల ద్వారా చేరుతుంది. నీళ్ల ట్యాంకుల నుంచి ఇంటింటా కుళాయిలకు సరఫరా చేస్తారు. దీనికోసం అనకాపల్లి జిల్లా మొత్తంగా నీటిని అందించేందుకు సుమారు రూ.2,639 కోట్లు అవసరం అవుతుందని అంచనా వేశారు. ప్రభుత్వానికి ఈ ప్రతిపాదనలు పంపించామని త్వరలో అనుమతులు రానున్నాయని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ రామస్వామి తెలిపారు.

## రెండు కొండలు.. నాలుగు జాతీయ రహదారులు

నంద్యాల: నంద్యాల జిల్లాలో నాలుగు జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాల్సి ఉందని 'కూటమి' ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. జాతీయ రహదారి-44, జాతీయ రహదారి-40 అనుసంధానం చేసేలా ప్యాపిలి నుంచి పాణ్యం వరకు నాలుగు రహదారుల నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇవన్నీ పూర్తయితే నల్లమల- ఎర్రమల కొండలను కలిపేలా ప్రయాణం సాగనుంది. రవాణా రంగానికి మరింత మేలు చేయనుంది. ప్యాపిలి నుంచి పాణ్యం వరకు నిర్మించే జాతీయ రహదారి బనగానపల్లి మీదుగా వెళ్తుంది. అదేవిధంగా బనగానపల్లి- కోవెలకుంట్ల, బేతంచెర్ల- బనగానపల్లి మీదుగా కొత్తవి నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. కోవెలకుంట్ల-ఆళ్లగడ్డ మధ్య 10 మీటర్ల పొడవునా ఆధునికీకరిస్తారు. ఇందుకు అవసరమయ్యే భూమిని సేకరించనున్నారు. గతంలో నిలిచిపోయిన అమరావతి-అనంతపురం రహదారికి ఇటీవలే కేంద్రం పచ్చజెండా ఊపింది. బేతంచెర్ల- డోన్ మధ్య ఎన్‌హెచ్ 340బీ రహదారి పనులు రూ.600 కోట్లతో జరుగుతున్నాయి.

# వడివడిగా జలజీవన్ సాగేలా..



చిత్తూరు : పల్లెలోని ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీటిని అందించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్‌కు శ్రీకారం చుట్టింది. వైకాపా హయాంలో 2019 ఆగస్టులో పనులు మొదలుకాగా 2024 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇచ్చిన నిధులను జగన్ సర్కార్ మళ్లించడంతో ఐదేళ్లయినా ఇవి ఓ కొలిక్కి రాలేదు. అస్తవ్యస్తంగా మారిన ఈ పథకాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. 2028 వరకు మిషన్‌ను పొడిగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో పనులు వేగంగా పట్టాలెక్కించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామీణ ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించింది. పంచాయతీలను బలోపేతం చేసేందుకు ఎప్పటికప్పుడు కేంద్ర ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులను విడుదల చేసింది. ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ఇదే తరహాలో జలజీవన్ మిషన్‌నూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. బోర్లు వేసి ఉపరితల ట్యాంకులకు నీరు అందిస్తే అవి సురక్షితం కావనే భావనతో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు గండికోట, కండలేరు జలాశయాల నుంచి జలాలు తీసుకురావాలని నిర్ణయించారు. ఇప్పటికే దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

**వైకాపా కార్యకర్తలకు పందేరం**

వైకాపా హయాంలో రూ.5 లక్షలలోపు పనులను నామినేషన్ ప్రాతిపదికపై అప్పగించారు. ఫ్యాను పార్టీ కార్యకర్తలకు అప్పగించాలనే ఉద్దేశంతోనే పనుల విలువను విభజించి ఆ పార్టీ శ్రేణులకు కట్టబెట్టారు. పనులు ముందుకు వెళ్లకపోవడానికి ఇది కూడా ఓ కారణం. దీనికితోడు కేంద్రం ఇచ్చిన వాటాకు అనుగుణంగా రాష్ట్రం నిధులు విడుదల చేయలేదు.

**25 శాతంలోపు రద్దు చేసి..**

ఇదేక్రమంలో 25 శాతం లోపు జరిగిన పనులన్నీ రద్దు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఈ నిధులను పైప్‌లైన్ పనులకు వెచ్చించాలని అనుకుంటున్నారు. ః అదేవిధంగా మంజూరైనా ప్రారంభమవ్వని పనులనూ రద్దుల పద్దులో చేర్చింది. అంతకుమించితే త్వరగా చేయాలని

జలజీవన్ పనుల్లో 25 శాతం దాటిన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సర్కార్ ఆదేశించింది. వీటి పురోగతిపై తరచూ సమీక్షించాలని అధికారులకు సూచనలు ఇచ్చింది.

జిల్లాలో ఇలా..

మొత్తం పనులు 5,041

ప్రారంభం కానివి 1,921

పురోగతిలో ఉన్నవి 286

పూర్తయినవి 2,432

రద్దు చేసినవి 402

కేటాయింపులు (రూ.కోట్లలో) 431.45

చేసిన వ్యయం 101.20

తిరుపతి జిల్లాలో మరో 728 పనులు గుత్తేదారులకు అప్పగించినా మొదలు కాలేదు.

# మభ్యపెట్టి.. మాయచేసి..!



విశాఖపట్నం : 'అంత చేస్తాం... ఇంత చేస్తాం..' అంటూ మభ్యపెట్టిన వైకాపా నాయకుల మాయ మాటలు నమ్మిన ప్రజలు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. ఆస్తులు పోయి.. చేతికందిన పరిహార పత్రాలు చెల్లుబాటు అవుతాయో..? లేదోనని..? కలవరపడుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సింహాచలం గోశాల నుంచి అడివివరం వరకు ఉన్న బీఆర్టీఎస్ విస్తరణ పనులు చేపట్టి, ఆస్తులు కోల్పోయిన బాధితులకు టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) పత్రాలు అందజేశారు. మొత్తం 210 మందికి పత్రాలు జారీ చేయగా, మరో 80 మందికి నేటికీ పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఆయా పత్రాల చెల్లుబాటుపై అప్పట్లో వైకాపా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సింహాచలం దేవస్థానం భూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన నేపథ్యంలో.. స్థలాల క్రమబద్ధీకరణపైనా త్వరలో నిర్ణయం వెలువడనుంది. అప్పుడే వైకాపా జారీ చేసిన టీడీఆర్ బాండ్ల భవితవ్యం తేలనుంది.

**హక్కులు లేకపోవడంతో:** పాతగోశాల కూడలి నుంచి అడివివరం వరకు ఉన్న సింహాచలం దేవస్థానం భూముల్ని ఆక్రమించి ఏళ్ల కిందట నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి యాజమాన్య హక్కులు లేవు. దీంతో ఆ ప్రాంతంలో బీఆర్టీఎస్ రహదారి నిర్మాణ పనులు జరగలేదు. అయితే నిత్యం వాహన రాకపోకలకు, అప్పన్నస్వామి నిజరూప దర్శన సమయంలో, గిరి ప్రదక్షిణ రోజున ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా రహదారి విస్తరణ చేపట్టాలని వైకాపా హయాంలో నిర్ణయించారు.

**హడావుడి పనులు:** గత సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా హడావుడిగా విస్తరణ పనులు చేపట్టిన వైకాపా ప్రభుత్వం.. బాధితులకు ఇచ్చే నష్టపరిహారం, టీడీఆర్ పత్రాల జారీలో స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించలేదు. దేవస్థానాలకు చెందిన స్థలాలకు టీడీఆర్‌లు ఇవ్వాలంటే నిబంధనలు మార్పు చేసి కొత్త జీఓ జారీ చేయాల్సి ఉంటుంది. కాని అప్పట్లో ఆస్తులు కోల్పోయిన బాధితుల్ని నమ్మించడానికి అయిదుగురు స్థానిక అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, వారి నిర్ణయం మేరకు టీడీఆర్ పత్రాలు ఇచ్చేశారు. రూ.200 కోట్ల విలువైన టీడీఆర్‌లు జారీ చేసినప్పుడు కనీసం కౌన్సిల్ తీర్మానం చేయలేదు. ఈ మొత్తం ప్రక్రియలో అప్పటి నాయకులు, అధికారులపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో టీడీఆర్‌ల చెల్లుబాటుపై బాధితులంతా ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే కోటి ఆశలతో ఉన్నారు.

**అధికారులు చర్చించారు...!:** నాటి టీడీఆర్‌లపై అప్పటి ఎమ్మెల్యే, కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. ప్రభుత్వ అనుమతితోనే పత్రాలు జారీ అయ్యాయి. అయితే కౌన్సిల్‌లో తీర్మానంపై ఎలాంటి ప్రతిపాదన రాకపోవడంతో... ఆ ప్రక్రియ చేపట్టలేదు. హరివెంకటకుమారి, జీవీఎంసీ మేయర్

# గాజువాకలో ఇసుక దుమారం



విశాఖపట్నం : గాజువాక కేంద్రంగా ఇసుక వ్యవహారం దుమారం రేపుతోంది. అధిక లోడ్లతో వస్తున్న లారీలను తహసీల్దార్ పట్టుకొని మిందిలోని ఇసుక యార్డుకు తరలించడంపై విమర్శలు వస్తున్నాయి. కొందరి ఒత్తిళ్లతో కావాలనే లారీలను పట్టుకుంటున్నారని ఇసుక రవాణాదారులు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజులుగా ఈ పరిణామాలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి. మరో వైపు అందుబాటు ధరలో ఇసుక దొరక్క కొనుగోలు దారులు ఇబ్బంది పడుతున్నారు.

తక్కువ పరిమాణంలో ఇసుక అవసరమైన వారి కోసం జిల్లాలో గాజువాక, భీమిలి, ముడసర్లోవ వద్ద ప్రభుత్వం నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేసింది. టెండర్ల ద్వారా గుత్తేదారులను ఎంపిక చేసి వారితో వీటిని నిర్వహిస్తున్నారు. అయితే ఇక్కడ కొనుగోలు చేయాలంటే వినియోగదారులు కాస్త ఎక్కువ వెచ్చించాల్సి వస్తోంది.

మింధి(గాజువాక)లోని నిల్వ కేంద్రంలో రవాణా ఖర్చుతో కలిపి టన్నుకు రూ.1300 ఖర్చవుతుంది. ఇది భారమని భావించి కొందరు తక్కువకు లభించే చోట కొనుగోలు చేసుకుంటున్నారు. కొందరు రవాణాదారులు టన్ను రూ.వెయ్యిలోపే అమ్ముతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడంతో ఎక్కడి నుంచైనా ఇసుక తెచ్చుకునే వీలుంది. దీంతో కొందరు అలా తెప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిల్వ కేంద్రాల్లోని ఇసుక కొనుగోలుకు చాలా మంది ఆసక్తి చూపడం లేదు. దీంతో అక్కడి నిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో గుత్తేదారుకు నష్టం వస్తుందని ఆ కేంద్రానికి చెందిన వ్యక్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి లారీలను పట్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిరసన బాట: మరో వైపు ప్రజల అవసరాలకు ఇసుక రవాణా చేస్తుంటే గుత్తేదారుకు చెందిన కొందరు మనుషులు లారీలను అడ్డుకొని రెవెన్యూ సిబ్బందిని పిలిపించి టైర్లలో గాలి తీయిస్తున్నారని ఇసుక రవాణాదారులు వాపోతున్నారు. అంతేకాకుండా ఆ ఇసుకను గుత్తేదారు యార్డులో డంపు చేయిస్తున్నారన్నారు. గత కొద్ది రోజులుగా గుత్తేదారుకు, రవాణాదారుల మధ్య వివాదం తీవ్ర స్థాయిలో సాగుతుంది. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సమస్య తీవ్రమవుతుండడంతో వారంతా నిరసనబాట పడతామంటున్నారు.

**ఏడు లారీలు స్వాధీనం:** అధిక లోడుతో వెళ్తున్న ఏడు ఇసుక లారీలను తహసీల్దార్ శ్రీవల్లి స్వాధీనం చేసుకున్నారు. కొన్నింటిలో పరిమితికి మించి ఉండడాన్ని గుర్తించి వాటిని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి అపరాధ రుసుం వేశారు. కొందరు రుసుం చెల్లించినా వాటిల్లోని ఇసుకను మింది నిల్వ కేంద్రంలో డంపింగ్ చేయించారు. ఆ ఇసుకను ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించాలని ఆమె ఉన్నతాధికారులకు లేఖ రాశారు. అపరాధ రుసుం చెల్లిస్తామని, ఇసుకతో కలిపి లారీలు అప్పగించాలని రవాణాదారులు తహసీల్దార్ మీద ఒత్తిడి తెస్తుండగా దీనికి సదరు అధికారి ససేమిరా అన్నారు.

## సాగవోయి.. దీక్షధారి

ఆత్మకూరు : దట్టమైన అడవి.. ఎత్తయిన కొండలు..పక్షుల కిలకిలరావాలు.. పచ్చని గొడుగు కింద పయనం.. అణువణువునా ఆధ్యాత్మిక చింతన.. దట్టమైన నల్లమలలో 40 కి.మీ నడకదారిలో పది రోజుల పాటు శివనామస్మరణ మార్మోగనుంది. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాదిమంది శివమాలధారులు, మొక్కులున్న భక్తులు ఈ మార్గంలో మల్లన్న సన్నిధికి పాదయాత్రగా వెళ్లనున్నారు. ఈ నెల 17 నుంచి 23 వరకు అటవీ శాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. **మంచినీరు:** పాదయాత్రగా వచ్చే భక్తులు తమ వెంట 2, 5 లీటర్ల నీటి సీసాలే తీసుకెళ్లడానికి అనుమతిస్తారు. స్టీలు, రాగి, గుడ్డసంచుల్లో నీరు తెచ్చుకుంటే మంచిది. మూడు ప్రాంతాల్లో నీటి ట్యాంకులు అందుబాటులో ఉంచనున్నారు.

**నిరంతరం పర్యవేక్షణ:** 25 మంది అటవీ సిబ్బంది, 40 మంది ప్రొటెక్షన్ వాచర్లు, 70 మంది వాలంటీర్లు సేవలు అందించనున్నారు. ఒక్కో బేస్ క్యాంప్‌లో 5- 10 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు.

చెత్తకుండీలు: చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులు ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా దారి వెంట కి.మీలకు రెండు చొప్పున సుమారు వంద చెత్తకుండీలు ఉంచుతారు. విడిది కేంద్రాలు: పల్లెకట్ట, పాతపెంట,



నాగలూటి, పంగిడి, దామర్లకుంట, పెచ్చెర్వు, వీరభద్రుని తాపలు, మఠంబావి, భీమునికొలను, కైలాసద్వారం, అటకేశ్వరం ప్రాంతాల్లో తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

అన్నదానాలు: నాగలూటి, దామర్లకుంట, పెచ్చెర్వు, భీమునికొలను ప్రాంతాల్లో అన్నదాన కేంద్రాలు ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతి ఇచ్చింది. వైద్య శిబిరాలు: నడకదారిలో పది చోట్ల, వెంకటాపురం, కృష్ణాపురం, ఆత్మకూరు, ఎస్సార్బీసీ కాలనీ, మార్గ మధ్యలోని ఇతర గ్రామాలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

ఇవి నిషేధం: పాదయాత్ర భక్తులు బీడీ, సిగరెట్, అగ్గిపెట్టె వంటి వాటిని తీసుకెళ్లకూడదు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీ చేసిన అనంతరమే పంపిస్తారు. వీరు రాకపోవడమే మంచిది: గుండె, ఆస్తమా వంటి జబ్బులున్న వారు, 70 ఏళ్లు పైబడిన వారు పాదయాత్ర చేయటం శ్రేయస్కరం కాదు. దారిలో వైద్యశిబిరాలున్నా అత్యవసర సేవలు అందుబాటులో ఉండవు.

## బేరాలు.. దొంగాటలు

ఒంగోలు : క్రీడలకు నకిలీ మకిలి అంటింది. సంఘాల నిర్వాహకులు కొందరు కాసుల కక్కుర్తితో అర్హులకు తీరని అన్యాయం చేస్తున్నారు. దొంగ పత్రాలు సృష్టించి జేబులు నింపుకొంటున్నారు. అదే సమయంలో ఎన్నో త్యాగాలు చేస్తున్న వారిని ఎదతాళి చేస్తున్నారు. తమ బేరాలు, చీకటి వ్యవహారాలతో అసలు సంఘాలు, క్రీడాకారులను అవమానించేలా వ్యవహరిస్తున్నారు.

**మూసేసిన కళాశాల పేరిట మస్కా**

గ్రామ సచివాలయంలో పశు సంవర్ధక సహాయకుడిగా పనిచేస్తున్న ఓ యువకుడు ఇటీవల హైకోర్టులో ఉద్యోగానికి ఎంపికయ్యారు. అతను నకిలీ క్రీడా పత్రాలతో కొలువు సాధించారంటూ అదే పోస్టుకు పోటీ పడిన మరో యువకుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సింగరాయకొండ విక్టరీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పనిచేసిన బక్కా ఈశ్వరయ్య అనే వ్యక్తి కూడా స్పందించారు. 2022లోనే తమ కళాశాల మూసివేసినప్పటికీ తన సంతకాన్ని ఫోర్జరీ చేసి 2024లో నకిలీ పత్రాలు సృష్టించారని గత సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు అందించారు. బాధ్యులైన కొన్ని క్రీడా సంఘాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో నకిలీ ధ్రువీకరణ పత్రాల బాగోతం మరోసారి తెర పైకి వచ్చింది.



**అర్హులకు ఎనలేని అన్యాయం**

క్రీడలనే భవిష్యత్తుగా ఎంచుకున్న క్రీడాకారులు వ్యక్తిగత జీవితాలను పణంగా పెడుతుంటారు. మైదానమే లోకంగా నిత్యం సాధనలోనే మునిగి తేలుతుంటారు. వారి కుటుంబాలు కూడా విందులూ వినోదాలు, శుభకార్యాలకు దూరంగా ఉంటూ తమ పిల్లల భవిష్యత్తు కోసం వారిని ప్రోత్సహిస్తుంటారు. అటువంటి వారి కృషి, పట్టుదల, త్యాగాలను అపహాస్యం చేసేలా కొందరు క్రీడాసంఘాల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. కనీసం ఎప్పుడూ మైదానం ముఖం చూడని వారికీ, క్రీడలతో కనీసం పరిచయమే లేనివారికి పత్రాలను తెగనమ్ముకుంటున్నారు. ప్రతిభావంతులకు ఎనలేని అన్యాయం చేస్తున్నారు.

**అడ్డదారుల్లో భలే వ్యాపారం**

క్రీడాసంఘాల నిర్వహణను కొందరు లాభసాటి వ్యాపారంగా మార్చుకున్నారు. విద్య, ఉద్యోగ అవకాశాల్లో క్రీడా కోటా ఉండటంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఆటల దిశగా ప్రోత్సహిస్తున్నారు. అదే సమయంలో మరికొందరు అడ్డదారులు వెతుకుతున్నారు. ఇటువంటి వారి ఆశలను కొన్ని క్రీడా సంఘాల నిర్వాహకులు ఆదాయ వనరుగా భావించి దొంగాట ఆడుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పత్రాలకు ధరలు నిర్ణయించి విక్రయిస్తున్నారు. జిల్లాలోని పలు క్రీడా సంఘాలకు ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా అధ్యక్ష, కార్యదర్శుల మంటూ కొందరు పదవులను పట్టుకుని వేలాడుతున్నారు. ఒలింపిక్ సంఘం గుర్తింపు లేని క్రీడాంశాలను నిర్వహిస్తూ ఇటు క్రీడాకారులు, అటు వారి తల్లిదండ్రులను భ్రమల్లో ఉంచి సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తీసుకెళ్లే పేరిట భారీగా ముడుపులు గుంజుతున్నారు. ఈ తరహా క్రీడా సంఘాల ప్రతినిధులపై ఉన్నతాధికారులు స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సి ఉంది.

# ఇంటి లెక్క పక్కా..

ముదిగుబ్బ : ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు మరింత చేరువ చేసి అర్హులకు లబ్ధి అందేలా కూటమి ప్రభుత్వం చేపట్టిన హౌస్‌హెూల్డ్ జియో ట్యాగింగ్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. స్థానికంగా ఉన్నవారెవరు? వలస వెళ్లిన వారెందరు? అన్న లెక్కలు తేలుస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 6,24,016 గృహాలకు జియోట్యాగింగ్ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 6,20,963 గృహాలు పూర్తయ్యాయి. ఇంకా 3,053 జియోట్యాగింగ్ చేయాల్సి ఉంది. మరో వారం రోజుల గడువుండగా 99.51 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

కదిరి గ్రామీణ పరిధిలో 12,544 ఇళ్లకుగాను 12,541 పూర్తిచేయగా కేవలం 3 ఇళ్లు మాత్రమే మ్యాపింగ్ చేయాల్సి ఉంది. అలాగే ఎన్పీకుంట రూరల్‌లో 4 నివాసాలు, మడకశిర అర్బన్‌లో 5, తాడిమర్రిలో 6, బత్తలపల్లి రూరల్‌లో 7, అమరాపురం రూర్‌లో 10 నివాసాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే కనగానపల్లిలో 308 నివాసాలు, లేపాక్షి రూరల్‌లో 246, తలుపుల రూరల్‌లో 204,



సీకేపల్లి రూరల్ 194 కుటుంబాలకు ఇంకా మ్యాపింగ్ చేయకపోవడంతో 97 శాతం మాత్రమే పూర్తయింది.

**వలస వెళ్లినవారి వివరాలు..**

కదిరి, పుట్టపర్తి, నియోజకవర్గంతోపాటు ముదిగుబ్బ, తదితర ప్రాంతాల నుంచి ఉపాధికోసం బెంగళూరుకు అధికంగా వలస వెళ్లారు. వారికి ఈ ప్రాంతంలో రేషన్, ఆధార్, ఓటరు కార్డు వంటి ఆధారాలున్నా, వారి వివరాలు స్థానికంగా ఉండనందున సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. వారి నివాసాల వద్దకు వెళ్లిన సచివాలయ సిబ్బంది తాత్కాలికంగా లేదా శాశ్వతంగా వలస వెళ్లారా అనేది నిర్ధారిస్తున్నారు. జియోట్యాగింగ్ పూర్తయితే ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు చేరుందుకు అవకాశముంది.

**వందశాతం పూర్తి చేస్తాం : సుధాకర్‌రెడ్డి, జీఎస్‌డబ్ల్యూ (గ్రామ సచివాలయ వార్డు నోడల్ అధికారి), పుట్టపర్తి**

ఇంటింటికీ జియోట్యాగింగ్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఇప్పటికే 99.51 శాతం పూర్తికాగా, మరో వారం రోజుల గడువు ఉండటంతో వందశాతం పూర్తి చేస్తాం. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందేలా మ్యాపింగ్ వేగవంతంగా చేస్తున్నాం.

# మార్చురీని మార్చేదెన్నడో?

ఎలమంచిలి : ఎలమంచిలి పట్టణ ప్రజలకు జనావాసాల మధ్య ఉన్న మార్చురీ ప్రధాన సమస్యగా మారింది. ఇళ్ల మధ్య ఉన్న దీన్ని మార్చాలని గత పాతికేళ్లగా ప్రజలు వినతులు అందిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోలేదు. మృతదేహాలు ఇక్కడికి వస్తే పరిసర ప్రాంతాల ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. రూ. 2 కోట్లతో కొత్తగా ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించినా మార్చురీని మాత్రం ఇక్కడి నుంచి తరలించలేదు. ఎలమంచిలి పాతజాతీయ రహదారిలో శవాగారం ఉంది. 40 ఏళ్ల కిందట దీన్ని రోడ్లు భవనాల శాఖ నిర్మించింది. అప్పట్లో ఇది జనావాసాలకు దూరంగా ఉండేది. ప్రస్తుతం పట్టణం బాగా విస్తరించింది. పురపాలక హెూదా సంతరించుకుని జనాభా భారీగా పెరిగింది. నివాస గృహాలు నాలుగింతలు పెరిగాయి. దీంతో మార్చురీ ఇప్పుడు పట్టణం మధ్యకు చేరింది. నియోజకవర్గంలోని ఎక్కడ రోడ్డు ప్రమాదాలు జరిగినా మృతదేహాలను శవపరీక్ష కోసం ఇక్కడికే తరలిస్తారు. గుర్తుతెలియని మృతదేహాలను మూడు రోజుల పాటు ఎవరైనా గుర్తించడం కోసం ఇక్కడే ఉంచుతారు. రైలు ప్రమాదాల్లో ముక్కలైన మృతదేహాలను ఇక్కడికే తరలిస్తారు. ఇవన్నీ పాడై పోయి భరించరాని దుర్గంధం వెదజల్లుతున్నాయి. రైలు కింద పడి చనిపోయిన వారిని తీసుకెళ్లడానికి ఎవరూ ముందుకు రారు. వీటిని గుర్తించడం చాలా ఆలస్యం అవుతుంది. ఆత్మహత్యలు, హత్యలకు గురైన వారిని ఇక్కడికే తీసుకొస్తారు. ఇక్కడ ఫ్రీజర్ లేదు. బల్లపై మృతదేహాలను వదిలేస్తారు. ఎన్ని రోజులైనా అలా బల్లపై ఉండాల్సిందే. ఇక్కడ నివాసాలు ఉంటున్న వారు రోజుల తరబడి దుర్గంధం భరించాల్సి వస్తుంది. వాసన తట్టుకోలేక భోజనాలు కూడా చేయలేకపోతున్నారు. పాతజాతీయ రహదారిపై వాహనాల్లో రాకపోకలు సాగించే వారినీ ఈ దుర్గంధం వెంటాడుతోంది. ఇక్కడ గది చుట్టు తుప్పలు పెరిగిపోయాయి. లోపలికి వాహనాలు వెళ్లడానికి



సరైన మార్గంలేదు. ఆసుపత్రి సముదాయానికి భవనం నిర్మించినప్పుడు పట్టణ నడిబొడ్డున ఉన్న మార్చురీని తరలించాలనే ప్రతిపాదన వచ్చింది. అయినా ఇంత వరకూ అమలు కాలేదు. కొత్త భవనం నిర్మాణానికి నిధులు రాలేదని రోడ్లు భవనాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని పురప్రజలు కోరుతున్నారు.

**స్థలాన్ని మున్సిపాలిటీ సమకూర్చాలి- రాధాకృష్ణ, డీఈ, రోడ్లు**

మార్చురీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మున్సిపాలిటీ సమకూర్చాలి. నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతాం. ప్రజలకు ఇబ్బందిలేని ప్రాంతంతో పాటు ఆసుపత్రికి దగ్గరలో ఉంటే మంచిది. దీనిపై నివేదిక తయారు చేస్తాం.

**భవనాలశాఖ, ఎలమంచిలి- ఆర్.రాము, అయోధ్యపురి కాలనీ, ఎలమంచిలి**

చాలా ఇబ్బంది పడుతున్నాం: ఎలమంచిలి ఊరి మధ్యలో మార్చురీ వల్ల ఇబ్బందులు పడుతున్నాం. మృతదేహాలను రోజుల తరబడి ఇక్కడ వదిలేస్తున్నారు. వాసన భరించలేకపోతున్నాం. నెలలో రెండు, మూడు సార్లు ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీన్ని తరలించాలని చాలా కాలంగా వినతులు ఇస్తున్నా పట్టించుకోలేదు. నివాస గృహాల మధ్య ఉన్న దీన్ని దూరంగా తరలించాలి.

**అంటురోగాలు వస్తున్నాయి- కె.వరలక్ష్మి, చంద్రనగర్, ఎలమంచిలి**

మార్చురీ నివాస గృహాల మధ్యలో ఉండటం వల్ల అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. రోడ్డుపై వెళ్లే వారికి ఇబ్బందిగా ఉంది. ప్రజలు పడుతున్న ఇబ్బందులు గుర్తించరా? సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి. ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

# ఊసేలేని విశ్వకర్మ యోజన




పుట్టపర్తి : చేతివృత్తిదారులకు వరప్రదాయినిగా భావించే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన (పీఎంవీకే) నిర్వహణ తీరు ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. కేవలం దరఖాస్తుల స్వీకరణకే పరిమితమైందన్న విమర్శలున్నాయి. 2023 సెప్టెంబరు 17న ఈ పథకాన్ని ప్రారంభించినా ఇప్పటికీ అతీగతీ లేదు. గత ప్రభుత్వ హయాంలో అతి తక్కువ మందికి తూతూమంత్రంగా శిక్షణ ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. వేలాదిమంది అవగాహన శిక్షణ కోసం ఇప్పటికీ నిరీక్షిస్తున్నారు. స్వల్పకాలిక రుణాల కోసం చేతివృత్తిదారులు ఎంతో కాలంగా నిరీక్షిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు.

**మొత్తం 88,213 దరఖాస్తులు**

జిల్లాలో 88,213 మంది చేతివృత్తిదారులు 'విశ్వకర్మ' యోజన కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 79,157 మందికి అర్హత ఉందని సిఫార్సు చేశారు. 3,806 మందికి అర్హత లేదని దరఖాస్తులను తిరస్కరించారు. తక్కిన 5,250 దరఖాస్తుల పరిశీలన పెండింగ్‌లో ఉంది. అత్యంత దయనీయం ఏమంటే పామిడి పట్టణ పంచాయతీ పరిధిలో 1,378 దరఖాస్తులు అందినా పరిశీలన అటకెక్కింది. గుంతకల్లు పట్టణంలోనూ 1,128 దరఖాస్తులను అసలు పట్టించుకోలేదు. గుత్తి పట్టణంలో 888 అందినా 190 పరిశీలించి.. 643 పక్కన పెట్టారు. అనంత నగరంలో 9,283 దరఖాస్తుల్లో 6,490 అర్హత లభించింది. 2,724 తిరస్కరణకు గురయ్యాయి.

**11 వేల మంది నిరీక్షణ** 18 రకాల చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్నవారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ విశ్వకర్మ పథకాన్ని ప్రవేశ పెట్టారు. తొలి విడతగా రూ.లక్ష రుణం ఇస్తారు. 18 నెలల్లో కంతులవారీగా చెల్లిస్తే రెండో విడత రూ.2 లక్షలు ఇస్తారు. 30 మాసాల్లో చెల్లించాల్సి ఉంటుంది. దర్జీ, నాయీ బ్రహ్మణులు, రజకులు, బొమ్మల తయారీ, కమ్మరి, బుట్టలు అల్లికలు, స్వర్ణకారులు, వడ్రంగులు, తాపీ పనివారు, శిల్పకారులు, వలలు, బోట్ల తయారీ, పాదరక్షల తయారీ చేసే చర్మకారులు.. వంటి చేతివృత్తిపై ఆధారపడే వారిని అర్హులుగా నిర్ణయించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కేవలం 350 మందికి మాత్రమే అవగాహన శిక్షణ ఇచ్చినట్లు తెలుస్తోంది. తాజాగా 11 వేల మంది దాకా నిరీక్షిస్తున్నారు. అనంత, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో నాలుగు ప్రైవేటు సంస్థలకు శిక్షణ ఇచ్చేందుకు అనుమతి ఇచ్చారు. కానీ, శిక్షణ లేదు.. రుణాల మంజూరు ఊసేలేదు. **సాంకేతిక లోపమే కారణం: జీఎం శ్రీధర్, డీఐసీ**

పీఎం విశ్వకర్మ యోజన కింద శిక్షణ, రుణాల పంపిణీకి సాంకేతిక సమస్య తలెత్తింది. జిల్లా పేరులో అక్షర దోషాలు తలెత్తిన మూలంగా ఈ పథకం అమలుకు ఇబ్బంది ఏర్పడింది. దీనిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుంది. మళ్లీ శిక్షణ, రుణాల పంపిణీపై దృష్టి సారిస్తాం.

# డ్రోన్ వినియోగం.. ఉపాధికి మార్గం



ఉరవకొండ : మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు పంటల సాగులో సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. అధిక దిగుబడి లక్ష్యంగా మరో అడుగు ముందుకేసి డ్రోన్లను వినియోగించుకుంటున్నారు. పంటలకు మందులు పిచికారీ చేస్తూ సమయం, డబ్బు ఆదా చేసుకుంటున్నారు. మరోవైపు యువకులు డ్రోన్‌లతో ఉపాధి పొందుతుండటం విశేషం.

ఉరవకొండ నియోజకవర్గంలో రైతులు మిరప, కంది, సెనగ, వరి, వేరుసెనగ పంటలను లక్ష హెక్టార్ల వరకు సాగు చేస్తున్నారు. పంటలకు మందు పిచికారీకి ఇన్నాళ్లూ పవర్ స్ప్రేయర్లను వినియోగించారు. అందుకు కూలీల అవసరం అధికం. మిరప బాగా పెరిగిన తరువాత, సెనగ పులుసు మీద ఉన్నప్పుడు, వరి మడిలో తిరుగుతూ మందు పిచికారీ చేయడం కష్టం. సాధారణ పద్ధతుల్లో ఎకరాకు 5-6 ట్యాంకుల (120 లీటర్లు) ద్రావణాన్ని పిచికారీ చేయాలి. అయితే పంటల సాగులో డ్రోన్ల వినియోగం పెరుగుతోంది. డ్రోన్‌తో ఎకరాకు 10 లీటర్ల ద్రావణం సరిపోతుంది. దాని ద్వారా సగటున 6 నిమిషాల్లోనే ఎకరాలో మందును పిచికారీ చేయవచ్చు. ఒక ట్యాంకుకు రూ.400 అద్దె తీసుకుంటున్నారు. సమయం ఆదా కావడంతోపాటు ఎక్కువ మంది మనుషులతో పని లేకుండా సులభ పద్ధతిలో పంటలపై మందు పిచికారీ చేస్తున్నారు.

**ఇతర ప్రాంతాల నుంచి వచ్చి..**

డ్రోన్లతో యువత ఉపాధి పొందుతున్నారు. వారు ఇతర పనులు చేసుకుంటూనే, డ్రోన్లను కొనుగోలు చేసి అద్దెకు ఇస్తున్నారు. సీజన్‌లో రోజుకు ఒక్కో డ్రోన్‌తో 30 ఎకరాల వరకు మందు పిచికారీ చేస్తున్నారు. ఒక్కో ట్యాంకుకు రూ.400 అద్దె తీసుకుంటున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో పంటల సాగు అధికంగా ఉండటంతో ఇతర ప్రాంతాలకు చెందిన యువకులు ఇక్కడికి వచ్చి డ్రోన్లను అద్దెకు ఇచ్చి నడుపుకొంటున్నారు. డి.హీరేహాళ్ మండలం గొడిసెలపల్లికి చెందిన జనార్దన్‌రెడ్డి డిగ్రీ, టీటీసీ చదువుకున్నారు. మీ-సేవా కేంద్రం నిర్వహించేవారు. గత ప్రభుత్వం ఆ కేంద్రాలను నిర్వీర్యం చేయడంతో రెండేళ్ల కిందట రూ.6 లక్షలు పెట్టి, సొంతంగా డ్రోన్ కొనుగోలు చేశారు. పంటల సీజన్‌ను బట్టి ఆయా ప్రాంతాలకు వెళ్తూ డ్రోన్‌తో రోజుకు 30 ట్యాంకుల వరకు మందు పిచికారీ చేస్తూ, ఉపాధి పొందుతున్నారు. నంద్యాలకు చెందిన చౌడేశ్ బీటెక్, కడపకు చెందిన సన్నీ ఐటీఐ, ప్రొద్దుటూరుకు చెందిన సత్య, తెలంగాణలోని మంచిర్యాలకు చెందిన శ్రవణ్ డిగ్రీ చదివారు. వీరు డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ పొందారు. చెన్నైకి చెందిన వాయు డ్రోన్స్‌లో పని చేస్తూ, నెలకు రూ.20 వేల చొప్పున వేతనం పొందుతున్నారు. గత రెండు నెలలుగా ఉరవకొండలో ఉంటూ ఈ ప్రాంతంలో డ్రోన్ ద్వారా పంటలకు మందులు పిచికారీ చేస్తున్నారు.

# కాగితాల్లోనే నిరాశ్రయుల సంక్షేమం




గుంతకల్లు : నిరాశ్రయుల వసతి గృహాలకు ఆలనా పాలన కరవవుతోంది. వీటిని పురపాలిక అధికారులు గాలికి వదిలేయడంతో నిరాశ్రయులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ పట్టణ జీవనోపాదుల విభాగం, పట్టణాభివృద్ధి సంస్థలు సంయుక్తంగా ప్రారంభించిన వసతి గృహాలకు ప్రభుత్వం నిధులను కేటాయించకపోతుండటంతో నాలుగేళ్ల నుంచి నిర్వహణ లేకుండా ఉంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలోని పరిస్థితిపై పరిశీలన కథనం. ప్రభుత్వం ఎనిమిదేళ్ల కిందట గుంతకల్లుతో పాటు గుత్తి, తాడిపత్రిల్లో నిరాశ్రయుల వసతి గృహాలను ప్రారంభించారు. ఇతర ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చి ఆశ్రయం లేనివారికి, దిక్కులేని వారికి వసతి సౌకర్యంతో పాటు భోజన సౌకర్యాలను కల్పించి వారిని ఆదుకోవడానికి ఏర్పాటు చేశారు.

**గతంలో స్వచ్ఛంద సంస్థలకు బాధ్యత**

నిరాశ్రయుల వసతి గృహాల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం గతంలో స్వచ్ఛంద సేవా సంస్థలకు అప్పగించింది. ప్రభుత్వం నిధులను ఇచ్చినంతకాలం స్వచ్ఛంద సంస్థలకు నిధులిచ్చి ఆలనాపాలనా చూశారు. గడచిన నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం నిధులు ఇవ్వక పోవడంతో గుత్తి, తాడిపత్రిల్లో నిరాశ్రయ వసతి గృహాలను మూసేశారు. గుంతకల్లు తిలకనగర్‌లోని పాఠశాలకు చెందిన గదుల్లో వసతిగృహాన్ని ఏర్పాటు చేశారు. ఆ గదులు సైతం పెచ్చులూడుతోంది. భయంగానే నివాసం ఉంటున్నారు.

గృహంలో మొత్తం 17 పరుపులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 12 మంది మాత్రం ఉంటున్నారు. వీరికి వైద్యులు రమణ భోజనం అందిస్తుండగా మురళి అనే వ్యక్తి అప్పుడప్పుడు దాతలను కలిసి అల్పాహారాన్ని అందిస్తున్నారు. అయితే రోజూ భోజనం అందడం కష్టంగా ఉంటోంది. పురపాలిక అధికారులను ఎలాంటి సహకారం ఉండటం లేదు.

**అవకాశం ఉన్నా.. పట్టని తీరు** పురపాలక సాధారణ నిధుల నుంచి భోజన సౌకర్యాన్ని కల్పించే అవకాశం ఉన్నా ఆదిశగా కౌన్సిల్ ఆలోచించడం లేదన్న విమర్శలున్నా యి. మరోవైపు తమను ఆదుకోవాలని నిరాశ్రయులు దీనంగా వేడుకుంటున్నారు.

**అవసరమైన నిర్ణయాలు తీసుకుంటాం**

నిరాశ్రయుల వసతి గదుల నిర్వహణకు ప్రస్తుతం ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు. కొందరు దాతలు సాయపడుతున్నారు. సాధారణ నిధులతో భోజన వసతి కల్పించడానికి అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి నిరాశ్రయులను ఆదుకోవడానికి కృషి చేస్తాం. భవానీ, మున్సిపల్ అధ్యక్షురాలు

# అడుగుకో గండం!

విశాఖ : ప్రమాదాల నియంత్రణలో భాగంగా వాహనాల అతి వేగానికి కళ్లెం వేసేందుకు రహదారులపై వేగ నియంత్రికలు (స్పీడ్ బ్రేకర్లు) తప్పనిసరి. కానీ, జిల్లాలో కొన్ని రహదారులపై నిర్మించిన నియంత్రికలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేయడంతో చోదకులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల ఆనందపురం మండలానికి చెందిన ఇంటర్ విద్యార్థిని (17) ఓ వేగ నియంత్రిక కారణంగా ప్రాణాలు కోల్పోయింది. కళాశాల బస్సులో వెళ్తుండగా డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. ఫుట్‌పాత్‌పై ఉన్న విద్యార్థిని అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు గాయమైంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

**కానరాని సూచికలు..**

ఇండియన్ రోడ్ కాంగ్రెస్ నిబంధనల ప్రకారం ఒక్కో స్పీడ్ బ్రేకర్ 10 సెం.మీ. ఎత్తు, నియంత్రిక రెండు చివరలకు మధ్యలో వెడల్పు 3.7 మీటర్లుండాలి. నలుపు, తెలుపు, పసుపు రంగులతో కూడిన ప్రకాశవంతమైన పెయింట్, 40 మీటర్లకు ముందు సూచికబోర్డు



ఏర్పాటుచేయాలి. చాలా చోట్ల నిబంధనలు పాటించకపోగా నిర్వహణ గాలికొదిలేశారు. ప్రధాన రహదారులతోపాటు చిన్న వీధుల్లోనూ సిమెంట్, కంకరతో ఎత్తయిన స్పీడ్ బ్రేకర్లు నిర్మిస్తున్నారు. ఇటీవల సెవెన్‌హిల్స్ ఆసుపత్రి సమీపంలో ప్రధాన రహదారిపై సగం వరకే నిర్మించారు. ఎన్ఏడీ-104 ప్రాంతం, జోడుగుళ్లపాలెం-రుషికొండ, ఇతర మార్గాల్లో ప్లాస్టిక్ స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాలకు దారితీస్తున్నాయి.

**ఆరోగ్య సమస్యలూ ఎక్కువే:** వేగ నియంత్రికల వద్ద వాహనాలను నియంత్రించలేక పలువురు యుక్త వయసులోనే వెన్నెముక, మెడ, డిస్క్ సమస్యల బారిన పడుతున్నారు. ద్వి చక్రవాహనాలపై వెనుక కూర్చున్న వ్యక్తులు ఎగిరి కింద పడిపోతున్నారు. ఆ సమయంలో పక్కనుంచి పెద్ద వాహనమొస్తే ప్రాణాలకు గండమే.

**9 కి.మీ.. 22 వేగ నియంత్రికలు:** బోని-ఆనందపురం మార్గంలో ఆటోలు, ద్విచక్ర వాహనాలు కలిపి నిత్యం రాకపోకలు సాగించేవి 500 కంటే ఎక్కువుండవు. కార్లు, ఇతర వాహనాలు ఆ మార్గంలో అతి తక్కువ వెళ్తాయి. కానీ ఆ మార్గంలో ఆనందపురం పూల మార్కెట్ నుంచి బోని వాటర్ వర్క్స్ వరకు 9 కి.మీ. దూరానికి 22 వేగ నియంత్రికలు ఏర్పాటుచేశారు. వాటిని సుమారు అడుగు ఎత్తులో నిర్మించారు. ఎక్కడా సూచికలు, మార్కింగ్స్, హెచ్చరిక బోర్డులు లేవు. అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యంతో ఆ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు నెలల కాలంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినా అధికారులు పట్టించుకోలేదు.

# 'విల్లాలు'... మల్లగుల్లాలు!

విశాఖలో గత వైకాపా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో ప్రజాధనం అధిక మొత్తంలో ఖర్చయిపోయింది. నగరంలో అవసరం లేకున్నా విలాసవంతమైన విల్లాలు నిర్మించడంతో, ఇప్పుడు వాటిని ఏం చేయాలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖను రాజధాని చేస్తామనే ప్రకటనలు వెలువెడ్డాయి. దాంతో ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు వసతి వేటలో పడ్డారు. అలా ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల కోసం జడ్పీ కూడలి సమీపంలోని ఏఎంసీ వైద్యుల వసతి గృహ ప్రాంగణంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని ఎంపిక చేసి, విల్లాలు నిర్మించాలని ప్రతిపాదించారు.

**మార్చి నెలాఖరుకు సిద్ధం:** రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో రహస్యంగా ఏపీఎంఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ) ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నిర్మాణాలు ప్రారంభించారు. ఆయా నిర్మాణాలకు ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నారు. నెలాఖరుకు సిద్ధం చేయనున్నారు.


**నివాస యోగ్యంగా:** ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు నివాస యోగ్యంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో 28,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో 'జీ ప్లస్ 1' తరహాలో నిర్మించిన ఏడు విల్లాల్లో అన్ని సదుపాయాలు కల్పించారు. తొలుత రూ.4 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. నిర్మాణ వ్యయం పెరిగిపోవడంతో రూ.8.70 కోట్లు వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం ఎలక్ట్రికల్, నీటి సరఫరా, శానిటేషన్ పనులు జరుగుతున్నాయి.

**వీటిని ఏం చేయాలి?:** రుషికొండ ప్యాలెస్ తరహాలో ముందస్తు ప్రణాళికలు లేకుండానే ప్రజాధనంతో నిర్మించిన భవనాలను ఎలా ఉపయోగించాలన్న అంశంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వైద్యుల క్వార్టర్స్‌కు కేటాయించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినా... అవి పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూర్చేలా లేవు. కేజీహెచ్‌తో సహా వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యుల్లో అధిక శాతం మంది నగరానికి చెందిన వారే. వారిలో చాలా మందికి సొంత నివాసాలు ఉన్నాయి. దీంతో భవనాల వినియోగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనుంది.

# ఎర్రగుర్తు ఏడిపిస్తోంది

కోవెలకుంట్ల : వరద ప్రభావం నుంచి 'కుందూ' రైతులను గట్టెక్కిస్తామని గత వైకాపా పాలకులు నమ్మించారు. వృథా నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కోవెలకుంట్లలోని జొలదరాశి ప్రాంతంలో జలాశయం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అందుకు కావాల్సిన భూములు రెడ్‌మార్కులో పెట్టారు.. పైసా పరిహారం ఇవ్వలేదు.. ప్రాజెక్టుకు పునాది రాయి వేయలేదు. ప్రారంభించని పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది.. ఆయా భూములు ఇంకా రెడ్‌మార్కు జాబితాలోనే ఉండటంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ తీరుతో కోవెలకుంట్ల ప్రాంతానికి చెందిన రైతులకు రుణాలు దక్కడం లేదు.. విక్రయించుకోవడానికి వీలులేని పరిస్థితి ఎదురైంది. **2019లో శంకుస్థాపన** కుందూనదిపై జొలదరాశి జలాశయం నిర్మాణానికి 2019 డిసెంబరు 23న శిలాఫలం ఆవిష్కరించారు. 0.8 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో పది వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా నిర్మిస్తామని ప్రకటించారు. జలాశయం నిర్మాణానికి 2,438 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా మొదటి విడత 615 ఎకరాలు సేకరించారు. ఎకరాకు రూ.14.75 లక్షలన్నారు వెలగటూరు, చింతకుంట్ల, జొలదరాశి, కలుగొట్ల గ్రామాలకు చెందిన 366 ఎకరాల భూములకు అవార్డు పాస్ చేసి రెడ్‌మార్క్‌లో పెట్టారు. ఎకరాకు రూ.14.75 లక్షలు పరిహారం చెల్లిస్తామని భూదస్త్రాలు, బ్యాంకు ఖాతాలు తీసుకున్నారు.

# ప్రణాళికతో చదివితే భవిష్యత్తు 'పది'లం



అనంతపురం : భవిష్యత్తు పదిలం చేసుకోవడంలో పదో తరగతి ఎంతో కీలకం. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ఆరంభం కానున్నాయి. ఇంకా 2 నెలలు మాత్రమే గడువుంది. జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెరగాలనే ఉద్దేశంతో విద్యాశాఖ 100 రోజుల కార్యాచరణ అమలు చేస్తోంది. ప్రణాళికబద్ధంగా, క్రమశిక్షణతో కూడిన శ్రమ ఏదైనా విజయాన్నిస్తుంది. పరీక్ష అంటే సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఒక సాధనం. భయం అపజయానికి ప్రధాన కారణం. పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత కావడమే కాదు.. అత్యధిక మార్కులు సాధించడానికి కృషి చేయాలి. విద్యార్థుల కోసం వివిధ సబ్జెక్టుల పాధ్యాయులు, నిపుణులు ఇచ్చిన సూచనలు సలహాలు ఇలా.

**తెలుగు సులువు - వై. ఆదిశేషయ్య, పాఠశాల సహాయకుడు, జడ్పీహైస్కూల్, నెరిమెట్ల, ఉరవకొండ**

అవగాహన ప్రతిస్పందనకు 32 మార్కులుంటాయి. మొదటి ప్రశ్న కింద పద్యపాఠ్యాంశాల నుంచి ఆటవెలది, తేటగీతి, కందం పద్యం ఇచ్చి కింద నాలు ప్రశ్నలు ఇస్తారు. ఒక్కొక్క ప్రశ్నకు రెండు చొప్పున 8 మార్కులు ఉంటాయి. రెండో ప్రశ్న పరిచిత గద్యం. గద్య పాఠ్యభాగం నుంచి మాత్రమే ఇస్తారు. మూడో ప్రశ్న ఉపవాచకం నుంచి నాలుగు వాక్యాలు ఇచ్చి అవి ఏకాండలకు సంబంధించినవో పేరు మాత్రమే రాయాలి. నాలుగో ప్రశ్న అపరిచిత గద్యం. కరపత్రం, లేఖ, సంభాషణలో ఏదో ఒక అంశం ఇచ్చిన కింద నాలుగు ప్రశ్నలు ఇస్తారు. వ్యక్తీకరణ సృజనాత్మకతకు 36 మార్కులు. 5, 6, 7 ప్రశ్నలకు నాలుగు చొప్పున 12 మార్కులు కేటాయించారు. అన్నీ రాయాలి. 5వ ప్రశ్న కవి పరిచయం కేవలం పద్య పాఠాల నుంచి మాత్రమే ఇస్తారు. ప్రత్యక్ష దైవాలు, శతక మాధుర్యం, జలియన్‌వాలాబాగ్, రాజధర్మం, ప్రకృతి సందేశం ఈ నాలుగు పాఠాల కవి పరిచయాలు చదివితే చాలు. 6వ ప్రశ్న పరిచయం కథానిక, వ్యాసం, నాటకం లేదా నేపథ్యం ఉంటుంది. 8, 9, 10 ప్రశ్నలు వ్యాసరూప ప్రశ్నలు.

భాషాంశాలు 32 మార్కులు. 11 నుంచి 19వ ప్రశ్న వరకూ రెండుమార్కుల ప్రశ్నలు. ఇందులో అలంకారాలు, ఛందస్సు (ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభం) అర్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి-వికృతులు, నానార్థాలు, వ్యుత్పత్తి అర్థాలు, జాతీయాలు. 20, 21, 22 ప్రశ్నలు సంధులకు సంబంధించినవి. సమాసాలకు, వాక్యాలపై అంశాలపై సాధన చేయాలి.

**ఆంగ్లంపై ఆందోళన వద్దు - శ్రీనివాసరెడ్డి, స్కూల్‌అసిస్టెంట్, జడ్పీహెచ్‌ఎస్, ఆకులేడు, శింగనమల**

ఆంగ్లభాషా పుస్తకంలోని గ్రామర్, ఒకాబులరీలను సాధన చేయాలి. ఇంగ్లిష్ ప్రశ్న పత్రం 3 విభాగాలుగా ఉంటుంది. సెక్షన్-ఎలో రీడింగ్ కాంప్రహెన్షన్ ఉంటుంది. సెక్షన్-బిలో ఒకాబులరీ, గ్రామర్, సెక్షన్-సి క్రియేటివ్ రైటింగ్ ఉంటాయి. సెక్షన్-ఎలో 30 మార్కులకు 24 మార్కులు బహుళైచ్ఛిక ప్రశ్నలుంటాయి. 6 మార్కులు సాధారణ ప్రశ్నలుంటాయి. రీడింగ్ పేరాలు బాగా చదివితే 24 మార్కులు కచ్చితంగా సాధించవచ్చు. పాఠ్యాంశాల్లోని గ్రామర్ బాగా చదివితే 40 మార్కులకు 25 మార్కులు సులువుగాసాధించవచ్చు. క్రియేటివ్ రైటింగ్ కోసం లెటర్‌రైటింగ్, కన్వర్షన్, బయోగ్రఫీ, ఆటోబయోగ్రఫీ ప్రశ్నలకు సాధన చేయాలి.

**సాధనతో హిందీలో అధిక మార్కులు - విజయకృష్ణ, స్కూల్‌అసిస్టెంట్, జడ్పీహెచ్‌ఎస్, డి.హిరేహాళ్, బొమ్మనహాల్**

సీబీఎస్‌ఈ సిలబస్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన హిందీసబ్జెక్టులో విద్యార్థులు సులువుగా గట్టెక్కవచ్చు. భాగ్-1 వ్యాకరణాంశాలకు సంబంధించినది. జవాబు ప్రశ్న పత్రంలో కివపరీతం ఉంటుంది. అయితే జవాబులు గుర్తించాలి. భాగ్-2లో పద్యభాగానికి సంబంధించి రెండు పేరాలు, గద్య భాగానికి సంబంధించి 2 పేరాగ్రాఫ్‌లు ఉంటాయి. వాటికింద ప్రశ్నలు అడుగుతారు. అవగాహన చేసుకొంటే సులువుగా జవాబులు రాయవచ్చు. భాగ్-3లో కవిపరిచయం రాయాల్సి ఉంటుంది. కబీర్, మైథిలీశరణ్‌గుప్త్, సుమిత్రానందన్‌పంత్‌లో ఏదో ఒకటి వచ్చే అవకాశముంది. భాగ్-4లో కబీర్‌కు సంబంధించిన 3 దోహాలు చదివితే 4 మార్కులు వచ్చే అవకాశముంటుంది. భాగ్-5లో పద్యభాగానికి సంబంధించిన ఒక వ్యాసరూప సమాధానం రాయాల్సి ఉంటుంది. పద్, మనుష్యత, పర్యత్‌ప్రదేశ్ పావస్‌లో ఒకటి వచ్చే అవకాశముంది. భాగ్-6లో లేఖ రాయాల్సి ఉంటుంది. విహారయాత్ర, హిందీసీఖ్‌నేకీ ఆవశ్యకత, పుస్తక్ ఖరీద్‌నాదవితే సరిపోతుంది.

**గణిత సూత్రాలపై పట్టు అవసరం- ఈశ్వరయ్య, స్కూల్ అసిస్టెంట్, జడ్పీహెచ్‌ఎస్, ముద్దినాయనపల్లి, కళ్యాణదుర్గం**

గణితంలో మార్కులు సాధించాలంటే పాటించాల్సిన సూత్రాలు నిర్వచనాలు సూత్రాలు, నిర్మాణాలపై సాధన చేయాలి. తప్పుల్లేకుండా సరిచూసుకోవాలి.

ఉదాహరణ లెక్కలపై అభ్యాసం చేయాలి.

వాస్తవ సంఖ్యలు, నిరూపక రేఖా గణితం, రేఖీయ సమీకరణాలపై పూర్తి అవగాహన అవసరం.

శ్రేఢులు, సాంఖ్యక శాస్త్రం, సంభావ్యతపై ప్రాక్టీస్ చేయాలి.

త్రికోణమితిలోని ప్రతి లెక్కను బొమ్మలతో వివరిస్తే మార్కులు వచ్చే అవకాశం ఎక్కువ.

ప్రతి లెక్కకు తప్పకుండా సూత్రాన్ని జోడించి రాయాలి.

1, 2 మార్కుల ప్రశ్నలు, సూత్రాలు ప్రతి రోజూ అభ్యాసం చేయాలి.

గ్రాఫు లెక్కలు బాగా సాధన చేయాలి.

జవాబుపత్రంలో కొట్టివేతలు లేకుండా శుభ్రంగా చేయాలి. ప్రతి ప్రశ్నకు దానికి సంబంధించిన జవాబు మాత్రమే రాస్తూ నిర్మాణాత్మకమైన సాధన చేయాలి.

**సాంఘికశాస్త్రం గ్రహించడం సులువే - శ్రీదేవి, స్కూల్‌అసిస్టెంట్, విడపనకల్**

సాంఘిక శాస్త్రంలో 100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో జాగ్రఫీ 23, చరిత్ర 23, పాలిటీ 23, ఆర్థికశాస్త్రం 23, మ్యాప్‌పాయింటింగ్‌కు 8 మార్కులు మొత్తం 100 మార్కులు. విద్యార్థులు 4, 8 మార్కుల ప్రశ్నలకు సమాధానాలు రాసేటప్పుడు సైడ్ హెడ్డింగ్స్ రాయాలి. పాయింట్ వైజ్‌గా సమాధానాలు రాయాలి. మధ్యలో ప్రధాన అంశాలుంటే అండర్‌లైన్ చేయాలి. చేతిరాత ఆకర్షణీయంగా ఉండాలి. 8 మార్కుల ప్రశ్నలకు సమాధానాలు పెద్దగా ఉన్నాయని భయపడాల్సిన అవసరం లేదు. సమాచార నైపుణ్యాలకి 15 మార్కులు కేటాయించారు. ఇది వెనుకబడిన విద్యార్థులకు కూడా మార్కులు సాధించడానికి ఉపయోగాపడే. సమాచార నైపుణ్యాల ప్రశ్నలు పట్టిక రూపంలో లేదా గ్రాఫ్‌రూపంలో పొందుపరచి ప్రశ్నలు ఇస్తారు. సులువుగా సమాధానాలు ఇవ్వవచ్చు. మ్యాపు గుర్తించడం కూడా సులువుగా చేయవచ్చు.

**భౌతికశాస్త్రం తికమక పడొద్దు- శైలజ, స్కూల్ అసిస్టెంట్, హంపాపురం, రాప్తాడు**

భౌతికశాస్త్రంలో 50 మార్కులకు 17 ప్రశ్నలుంటాయి. సమయం 2 గంటలు. ఒకమార్కు ప్రశ్నలు 8, రెండు మార్కుల ప్రశ్నలు 3, నాలుగు మార్కుల ప్రశ్నలు 3 ఉంటాయి. వీటికి ఛాయిస్ ఉండదు. 12వ ప్రశ్న దయాగ్రాం సంబంధించి ఛాయిస్ ఉంటుంది. 8మార్కుల ప్రశ్నలకు అంతర్గత ఛాయిస్ ఉంటుంది. ఖాళీభవనం, మరుగుటకు బేధాలు, హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టి లోపాల సవరణ, ఎండమావులు, ఇంద్రధనస్సు ఏర్పడే విధానం, విద్యుత్తు మోటరు. ఏసీ, డీసీ జనరేటర్ పనిచేయు విధానం. క్వాంటం సంఖ్యలు., నూతన ఆవర్తన పట్టిక నిర్మాణం.

ఆమ్లాలు-క్షారాలు, పరమాను నిర్మాణం, లోహసంగ్రహణ శాస్త్రంపై పట్టు సాధించాలి. ఘన పదార్థపు విశిష్టోష్ణం కనుగొనుట, సాఖ్యాంతరం, గాజులదిమ్మె, వక్రీభవన గుణకాలు, ఆమ్లాల రసాయన చర్యలు చదవాలి. భవిష్యత్తులో ఇంజినీరింగ్, మెడిసిన్ ఏ విభాగాల్లో ప్రవేశించాలన్నా భౌతికశాస్త్రం చాలా కీలకం. ఇప్పటి నుంచే శ్రద్ధగా చదవాలి.

**సైన్స్‌లో జీవశాస్త్రం- మేడా ప్రసాద్, ఎస్‌ఏ, జడ్పీహెచ్‌ఎస్, హానకనహాళ్, కణేకల్**

సైన్స్ సబ్జెక్టులో జీవశాస్త్రం పేపర్-2 పరీక్ష ఉంటుంది. ఇది 50 మార్కులకు మాత్రమే. మిలిగిన సబ్జెక్టులకు భిన్నంగా సైన్స్ పరీక్షలు నిర్వహిస్తారు. సమయం కూడా తక్కువగా ఉంటుంది. ఒకమార్కు ప్రశ్నలు 6, రెండు మార్కుల ప్రశ్నలు 4, నాలుగు మార్కుల ప్రశ్నలు 5, ఎనిమిది మార్కుల ప్రశ్నలు 2 ఉంటాయి. 1, 2 సెక్షన్లలో ఐచ్ఛిక ప్రశ్నలు ఉండవు. 3వ సెక్షన్‌లో 12వ ప్రశ్నలకు ఐచ్ఛికం ఉంటుంది. 4వ విభాగంలో 16, 17 ప్రశ్నలకు అంతర్గత ఐచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి.

జీవక్రియలు, ప్రత్యుత్పత్తి అనే రెండు అధ్యాయాల నుంచి 24 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ఆ రెండు సబ్జెక్టులపై దృష్టిపెట్టాలి. బొమ్మలు, బొమ్మ ఆధారిత ప్రశ్నలు, ఫ్లోచార్టులు, ప్రయోగాలు, ప్రయోగ ఆధారిత ప్రశ్నలు, పట్టికలు, పట్టిక ఆధారిత ప్రశ్నల మీద ప్రత్యేక దృష్టిపెట్టాలి.

# అంటకాగి.. అక్రమాలకు తెరతీసి..!

చిత్తూరు: చిత్తూరు కార్పొరేషన్ చరిత్రలో గతంలో ఎన్నడూ లేనంతగా వైకాపా పాలనలో కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన జె.అరుణ హయాంలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. నగరపాలక సంస్థ తన సొంత సామ్రాజ్యమన్నట్లు ఆమె చెలరేగిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆనాడు జరిగిన అవినీతిపై విచారణ కు ఉపక్రమించింది. మూడు రోజుల పరిశీలనలో ప్రాథమికంగా నిబంధనలకు విరుద్ధంగా భారీగా నిధులు దోచేశారని తేటతెల్లమైంది. చిత్తూరు నగరపాలక సంస్థలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని తెలుగుదేశం నేత సప్తగిరి ప్రసాద్.. పురపాలక శాఖ ఉన్నతాధికారులకు వైకాపా హయాంలోనే ఫిర్యాదు చేశారు. అప్పట్లో కమిషనర్‌గా అరుణే ఉన్నందున ఇది ముందుకు సాగలేదు. అడిగిన వివరాలు కూడా అందించలేదు. ఎన్డీయే సర్కార్‌కు పాలనా పగ్గాలు వచ్చాక విచారణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈనెల 8 నుంచి అనంతపురం ఆర్డీ



విశ్వనాథ్ ఆధ్వర్యంలో మెప్మా, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, తదితర విభాగాలకు సంబంధించిన దస్త్రాలను పరిశీలిస్తున్నారు.

**చుడా, డీటీసీపీ పరిధిలోకి వచ్చినా..** పట్టణ ప్రణాళిక విభాగంలోనూ కమిషనర్ నిబంధనలకు తూట్లు పొడిచారు. వెయ్యి చదరపు మీటర్ల ప్లాట్ ఏరియా, 15 మీటర్ల ఎత్తైన భవనాలకు అనుమతిచ్చే అధికారం కార్పొరేషన్‌కు ఉంది. అంతకుమించితే చుడా (చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ), 4వేల చదరపు మీటర్ల విస్తీర్ణం దాటితే డీటీసీపీ (డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్)కు వెళ్లాలి. ఇందుకు విరుద్ధంగా కొన్నింటికి కార్పొరేషన్‌లోనే అనుమతులిచ్చారు.

అమూల్ డెయిరీకి రోడ్డు వేయించి.. శుభ్రం చేయించి.. నగరంలోని విజయా డెయిరీ ఆస్తులను 99 ఏళ్లపాటు ముఖ్యమంత్రి హోదాలో జగన్ అమూల్ డెయిరీకి ధారాదత్తం చేశారు. 2023 జులై 4న ఆయన జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంలో సీఎం వెళ్లేందుకు అనువుగా లోపలి వరకు తారు రోడ్డు వేయించారు. అమూల్ సంస్థ ఈ పనులు చేయాల్సి ఉండగా.. నగరపాలక సంస్థ నిధులతో రోడ్డు నిర్మించారు. నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. అంతటితో ఆగకుండా పదుల సార్లు కార్మికులను వినియోగించుకున్నారు.

**నామినేషన్‌పై పనులు అప్పగించి**

వైకాపా శ్రేణులకు మేలు చేసేందుకు ఇంజినీరింగ్ పనుల్లో సింహభాగం నామినేషన్‌పై అప్పగించినట్లు విచారణ బృందాలు గుర్తించాయని సమాచారం. రూ.లక్షకుపైగా వ్యయమయ్యే పనులకు టెండర్లు పిలవాల్సి ఉండగా రూ. 98వేలు, రూ.99వేలు.. ఇలా విభజించి కావాల్సిన వ్యక్తులకు కట్టబెట్టినట్లు తెలుస్తోంది.

# సచివాలయాల ప్రక్షాళనకు కసరత్తు

చిత్తూరు : గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రభుత్వ సేవల్ని ప్రజల చెంతకు మరింత చేరువ చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణపై తాజాగా దృష్టి సారించారు. ఉద్యోగుల్ని మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీస్, యాస్పిరేషనల్ సెక్రటరీలుగా విభజించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే క్షేత్ర స్థాయి సిబ్బంది సమాచారాన్ని సేకరించారు. త్వరలో మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టాలని ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

**జనాభా వివరాలపై పరిశీలన..**

నివసిస్తున్న జనాభా ఆధారంగా లేదా 5 కి.మీ పరిధిలో ఒక సచివాలయం ఉండేలా చూడాలని ప్రాథమికంగా ప్రభుత్వం సూచన చేసింది. ప్రతి సచివాలయంలో 10 మంది సిబ్బంది ఉండేలా గత ప్రభుత్వం డిజైన్ చేసింది. కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నా.. మరికొన్ని చోట్ల తక్కువగానే ఉన్నారు. ఉన్న సిబ్బందిలో కొందరికి అధికంగా పని ఉంది. మరికొందరికి తక్కువగా పని ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు జిల్లాలో సచివాలయాల వారీగా జనాభా వివరాల్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

**ఇలా వినియోగం**

సచివాలయ ఉద్యోగుల్లో ఇంజినీరింగ్, డిప్లొమా, పీహెచ్‌డీలు చేసిన వారు ఉన్నారు. వీరి సేవలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా వినియోగించేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉద్యోగుల వివరాల్ని సేకరించారు. నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, ఆహార శుద్ధి, మార్కెటింగ్, ఉపాధిపై ఎంపిక చేసిన వారికి సాంకేతిక శిక్షణ ఇవ్వనున్నారు. వారి ద్వారా ఔత్సాహిక యువతను గుర్తించి ప్రోత్సహించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. దీంతో సచివాలయ వ్యవస్థ కొన్ని మార్పులతో త్వరలో విస్తృత సేవల్ని అందించనున్నాయి.

# కుడి ఎడమల కబ్జా!

కార్వేటినగరం : జిల్లాలో మాధ్యమిక ప్రాజెక్టయిన కృష్ణాపురం జలాశ యం కుడి, ఎడమ కాలువలు కబ్జాకు గురయ్యాయి.. కొందరు ఆక్రమణదారులు కాలువలను పూడ్చేసి పంటలు సాగు చేసుకుంటున్నారు.. దీంతో ఆయకట్టు రైతులకు సాగునీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. వీటిని అడ్డుకోవాల్సిన యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తోంది.

కృష్ణాపురం ప్రాజెక్టును 1975లో నిర్మించారు. ప్రాజెక్టు పరిధిలో 6,125ఎ కరాల ఆయకట్టు ఉంది. ఈశాన్య రుతుపవనాల వల్ల, తుపాను ప్రభావం వల్ల కురిసే వర్షాలు ప్రాజెక్టులోకి వరదనీరు వస్తే ఈ నీటిని కుడి ఎడమ కాలువల ద్వారా ఆయకట్టు పరిధిలో ఉన్న 16 చెరువులకు సరఫరా చేసి నింపుతున్నారు. కొందరు ఆక్రమణదారులు కాలువలు పూడ్చి కబ్జాకు పాల్పడటంతో చెరువులకు నీరు సరఫరా కావడం లేదు.


కృష్ణాపురం క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు పక్కన ఎడమ కాలువను ఓ వ్యక్తి పూడ్చేసి తన పొలంలో కలుపుకొని కంచె వేశారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు సుమారు 14కిలోమీటర్ల దూరం ఉండగా, నాలుగు కిలో మీటర్ల వరకు మాత్రమే కాలువలు సక్రమంగా ఉన్నాయి. మిగిలిన ప్రాంతంలో అక్కడక్కడా ఆక్రమణలకు గురికావడంతో సగం చెరువులకు కూడా నీరు చేరడం లేదు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. **వెంటనే తొలగిస్తాం.- నాగరాజు, తహసీల్దారు, కార్వేటినగరం** కృష్ణాపురం ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు అక్కడక్కడా కబ్జాకు గురైనట్లు నా దృష్టికి వచ్చింది. సర్వే చేయించి ఆక్రమణలు తొలగింపజేస్తాం.

# రాణాల్లో భర్తీ అవ్వని ఖాళీలు

గుత్తి : గుంతకల్లు పోలీసు సబ్‌డివిజన్‌లోని పోలీసు స్టేషన్లలో కానిస్టేబుళ్ల కొరత తీవ్రంగా ఉంది. 30 ఏళ్ల కిందట స్టేషన్లకు కేటాయించిన సిబ్బంది మేరకు ప్రస్తుతం పోలీసులు లేరు. అప్పటితో పోలిస్తే జనాభా రెట్టింపు అయింది. దీనికి అనుగుణంగా పోలీసుల నియామకాలు లేవు. ఉన్న వారిలోనూ అమరావతి, విశాఖపట్టణం, తిరుపతి, అనంతపురం తదితర ప్రాంతాలకు బందోబస్తు విధులకు వెళ్తున్నారు. మిగిలిన వారిలో కొందరు పికెట్, కోర్టు డ్యూటీలకు వెళుతుంటే ఉండే సిబ్బంది రాత్రి సమయాల్లో గస్తీ తిరగడానికి, ట్రాఫిక్ విధులు నిర్వహించడానికి పనిభారంతో ఇబ్బంది పడుతున్నారు.

**క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా..**

గుంతకల్లు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో గుంతకల్లు ఒకటో, రెండో పట్టణ పోలీసు స్టేషన్లతో పాటు గ్రామీణం, కసాపురం, ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, పాల్తూరు, కూడేరు, బెలుగుప్ప, పామిడి, గుత్తి పోలీసు స్టేషన్లు న్నాయి. ఈ స్టేషన్లలో ప్రభుత్వం గతంలో కేటాయించిన విధంగా 276 మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం 196 మంది మాత్రమే ఉన్నారు. 80 వరకు ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా పోలీసుల సంఖ్యను 400కు పెంచాల్సి ఉంది. గుంతకల్లు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో 40 మందికి గాను 30 మంది ఉన్నారు. కసాపురం స్టేషన్‌లో 21 మందికి గాను 16 మంది, విడపనకల్లులో 20 మందికి గాను 8 మంది, ఉరవకొండలో 28 మంది పోలీసులకు గాను 19 మంది, గుత్తిలో



42 మందికి గాను 29 మంది పోలీసులు మాత్రమే ఉన్నారు. బెలుగుప్పలో 16 మందికి గాను 7 మంది, పాల్తూరులో 16 మందికి గాను ఆరుగురు మాత్రమే ఉన్నారు. ఖాళీలు ఎక్కువగా ఉండటంతో శాంతి భద్రతల నిర్వహణ కష్టంగా ఉంటోంది. ప్రధానంగా గుంతకల్లులో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. ట్రాఫిక్ నియంత్రించడానికి 14మంది సిబ్బంది అవసరం కాగా ఇపుడు ముగ్గురు మాత్రమే ఉండటం గమనార్హం.

**శాంతి భద్రతల సమస్య రానివ్వం : శ్రీనివాస్, గుంతకల్లు డీఎస్పీ**

గుంతకల్లులో ట్రాఫిక్ సమస్య చాలా ఎక్కువగా ఉంది. ట్రాఫిక్ నియంత్రిం చడం పెద్ద సమస్యగా మారింది. ఉన్న పోలీసులు వివిధ డ్యూటీలకు వెళు తుండటంతో ట్రాఫిక్ నియంత్రణ సవాలుగా మారింది. ప్రస్తుతం ఉన్న సిబ్బందితో సమస్యలను అధిగమించడానికి కృషి చేస్తున్నాం. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూస్తున్నాం. కానిస్టేబుళ్ల సంఖ్య పెరగాల్సి ఉంది. ఆ దిశలో ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారు.

# కల్తీ.. కల్తీ..!

తిరుపతి : తిరునగరిలో ఆహార కల్తీ శ్రుతి మించింది. గత ఐదేళ్లు అడిగేవారు లేకపోవడంతో ఉల్లంఘనలు యథేచ్ఛగా కొనసాగాయి. నిత్యం లక్షమంది వరకు భక్తులు, ఇతర అవసరాల కోసం మరో 50 వేల మంది ప్రజలు వస్తుండటంతో వీధివీధినా ఫలహార శాలలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు వెలిశాయి. వీటితోపాటు 250 పైగా పెద్ద హోటళ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. వ్యాపారంలో పోటీకి తోడు లాభాల కోసం అడ్డదారులు తొక్కుతూ కల్తీ ఆహారం పెడుతున్నారు.

**రెండు రోజుల్లో 37 హోటళ్లకు తనిఖీ**

కల్తీ ఆహారాన్ని నియంత్రించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లపై దాడులు చేపట్టింది. జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలోని పది బృందాలు ఇటీవల నగరంలో ని 37 ప్రముఖ హోటళ్లను తనిఖీ చేయగా.. ప్రతి హోటల్‌లో ఉల్లంఘనలు వెలుగు చూశాయి. 37 హోటళ్ల నుంచి నమూనాలు



సేకరించి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపారు. కల్తీ అధికంగా ఉన్న 12 హోటళ్లకు తాఖీదులు జారీ చేశారు.

**దారుణాలు ఇలా..**

కుళ్లిన కూరగాయలు, రుచి కోసం రసాయనాలు, నిషేధిత రంగులు, పురుగులు పట్టిన నువ్వులు, పప్పుదినుసులు, కందిపప్పు, కల్తీ నూనె సర్వసాధారణమైంది. రిఫ్రిజిరేటర్లలో నిల్వ ఉంచిన మాంసం, చేపలు, రొయ్యలు, మసాలా కలిపి నిల్వఉంచే మాంసాహారం, కుళ్లి దుర్వాసన వస్తూ ఉండే అల్లం, వెల్లుల్లి పేస్ట్ వంటివి వినియోగిస్తున్నారు. ఎంగిలి బిర్యానీలు, వాటిలోని మాంసపు ముక్కలు సైతం వినియోగిస్తున్నట్లు వెల్లడవుతోంది. రాత్రిళ్లు మిగిలిన వాటిని మరోసారి వేడిచేసి ఉదయం తయారు చేసిన ఆహారంలో కలుపుతున్నారు. పచ్చళ్లు కాలం చెల్లి, పాడుల్లో పురుగులు ఉన్నా.. వాటినే అప్పటికప్పుడు తొలగించి వడ్డిస్తున్నారు. 90 శాతం హోటళ్లు చౌకగా లభించే వంట సరుకులు, కూరగాయలు వినియోగిస్తున్నాయి. మాంసాహార హోటళ్లలో కల్తీ తీవ్రత ఎక్కువగా ఉండగా.. శాకాహార హోటళ్లలోనూ కల్తీ నూనెలు, వేపుళ్లలో ఎక్కువగా రంగులు వాడుతున్నట్లు గుర్తించారు.


**తనిఖీలు నిరంతరం కొనసాగిస్తాం- పూర్ణచంద్రరావు, జేఎఫ్‌సీ**

తిరుపతిలో భక్తుల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయి. కలుషితాహారం తిని వాంతులు, విరేచనాలు కలుగుతున్నాయని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో దాడులకు ఇక్కడే శ్రీకారం చుట్టాం. ఇవి నిరంతరం కొనసాగించాలని నిర్ణయించాం. నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లపై చర్యలు తీసుకుంటాం. స్థానికులు కల్తీ ఆహారంపై ఫిర్యాదులు చేయొచ్చు.

# రాయితీలు అందుకోండిలా..!

అనకాపల్లి : వ్యవసాయ ఉప ఉత్పత్తులు తయారు చేసే కుటీర పరిశ్రమలకు రాయితీపై రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాకు 240 యూనిట్లు మంజూరు చేయగా 250 మంది రైతులు ముందుకు వచ్చారు. వీరిలో 32 యూనిట్లు మంజూరు చేశారు. మరో 51 దరఖాస్తులు బ్యాంకుల పరిశీలనలో ఉన్నాయి. పరిశ్రమ ఏర్పాటుకు వయస్సు, ఆదాయంతో సంబంధం లేదు. ఎవరైనా ఏర్పాటు చేయొచ్చు. ప్రతి మండలానికి 10 యూనిట్లు మంజూరు చేయనున్నారు. ఈమేరకు ఒక్కో మండలానికి ఒక అధికారిని నియమించారు. యూనిట్ ఖరీదులో 10 శాతం లబ్ధిదారులు చెల్లించాలి. మిగిలిన 90 శాతం బ్యాంకు రుణంగా ఇస్తుంది. ఇందులో 35 శాతం రాయితీగా ఇస్తారు. యూనిట్ ఏర్పాటు చేసిన తర్వాత రాయితీ డబ్బును బ్యాంకుకు చెల్లిస్తారు.

వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి జీడిపిక్కల నుంచి పప్పు, చిక్కీలు, బెల్లం అచ్చులు, చెరకు నుంచి బెల్లం పొడరు తయారు చేసే పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. తేనె, చిరుధాన్యాల నుంచి నూక, పిండి పాల నుంచి పన్నీరు, కోవా, నెయ్యి, వెరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వుల నుంచి నూనె, ధాన్యం నుంచి బియ్యం, నూక, పిండి తయారీ చేసే



పరిశ్రమలను స్థాపించనున్నారు. ఆహార శుద్ధి క్రమబద్ధీకరణ పథకం కింద కుటీర పరిశ్రమలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి జి.ప్రభాకర్ తెలిపారు. యూనిట్ల మంజూరులో జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచిందన్నారు.

**కారాగారంలో వ్యసన విముక్తి కేంద్రం**

విశాఖ కేంద్ర కారాగారంలో వ్యసన విముక్తి(డి-అడిక్షన్) కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు ఇటీవల కారాగారం సందర్శించినప్పుడు ఈ విషయం తెలిపారు. అందుకనుగుణంగా చర్యలు వేగవంతమయ్యాయి. గంజాయి, మద్యం తదితర మత్తు పదార్థాలకు బానిసలైన ఖైదీలకు ఈ కేంద్రంలో వైద్యం అందిస్తారు.

చురకలు



# గ్లామర్ షోలో నిన్ను కొట్టేవారే లేరు 'మృణాల్'

మృణాల్ ఠాగూర్.. తన టాలెంట్, అందం, అద్భుతమైన అభినయంతో సినీ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు అందుకున్న నటి. టెలివిజన్ ద్వారా కెరీర్ ప్రారంభించిన ఆమె, హిందీ టీవీ సీరియల్స్‌లో మెరిసి, సినిమాల వైపు అడుగులేశారు. ఆమె నటనతో మెప్పించి, అతి తక్కుక కాలంలోనే బాలీవుడ్‌లో వరుస ఛాన్స్ లు అందుకుంది. 2019లో వచ్చిన 'సూపర్ 30' సినిమాలో హృతిక్ రోషన్ సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక బాలీవుడ్‌లో అనంతరం అమ్మడు పలు వెబ్ సీరీస్ లలో కూడా మంచి క్రేజ్ అందుకుంది. అనంతరం మెల్లగా టాలీవుడ్‌లోనూ అడుగు పెట్టారు. తెలుగులో ఆమె చేసిన తొలి చిత్రం 'సీతారామం' ఏ స్థాయిలో సక్సెస్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. హను రాఘవపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్ సరసన ఆమె 'సీత' పాత్రలో అదరగొట్టారు. ఈ మూవీతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఆ సినిమా తరువాత బాలీవుడ్‌లో కూడా ఆమెకు మంచి ఆఫర్లు వచ్చాయి. 'సీతారామం' తర్వాత మృణాల్ టాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీగా మారింది. నాని హీరోగా



నటించిన 'హాయ్ నాన్న' మూవీలో కూడా ఆమె ప్రధాన పాత్రలో కనిపించారు. ఈ మూవీ మరో హిట్ కావడంతో మృణాల్‌కు టాలీవుడ్‌లో మరింత క్రేజ్ పెరిగింది. ఆమె నటన, ఎమోషనల్ స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తాజాగా మృణాల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలు షేర్ చేశారు. అందులో ఆమె తెల్లటి కలర్‌లో రంగుల డిజైన్ ఉన్న లాంగ్ గౌన్‌లో చాలా అందంగా మెరిసిపోతున్నారు. ఆమె సింపుల్ స్టైల్, క్యూట్ లుక్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. బ్యాక్‌లెస్ డ్రెస్‌లో ఆమె క్యూట్ అండ్ క్లాసీగా కనిపించారు. మేకప్ కూడా సింపుల్‌గా, నేచురల్ గ్లోతో ఉన్నది. ఫ్యాన్స్ ఈ స్టిల్స్‌పై పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం మృణాల్ టాలీవుడ్ బాలీవుడ్‌లో పలు ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్నారు. సన్ ఆఫ్ సర్దార్ సినిమాతో పాటు మరో మూడు హిందీ సినిమాలు ఆమె చేతిలో ఉన్నాయి. ఇక అడివి శేష్ తో డెకయిట్ అనే సినిమా చేస్తోంది. తెలుగులో ఆమె ఒక స్టార్ హీరోతో సినిమా చేస్తున్నారని టాక్. తన టాలెంట్, అందం, హార్డ్‌వర్క్‌తో మృణాల్ తక్కువ కాలంలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. మరి భవిష్యత్తులో అమ్మడి నుంచి రాబోయే సినిమాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయో చూడాలి.

# ఎన్టీఆరే బెస్ట్ ఫెర్ఫార్మర్ అనేసిన హీరోయిన్..!

తెలుగు మూలాలున్నా సరే తమిళ నటిగా గుర్తింపు తెచ్చుకుని అక్కడ ఒక మోస్తారు పాపులారిటీ తెచ్చుకున్న బ్యూటీ ఐశ్వర్య రాజేష్ అమ్మడు తెలుగులో కూడా వరుస సినిమాలు చేయాలనే ఆలోచన ఉన్నా ఐదేళ్ల క్రితమే ఇక్కడ ఒకటి రెండు సినిమాలు చేసినా అవి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు అందుకే కాస్త వెనకపడ్డది. ఐతే ఈ సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాం తో సూపర్ హిట్ అందుకుని మళ్లీ వార్తల్లో నిలిచింది ఐశ్వర్య రాజేష్. హెూమ్లీ లుక్ తో తనదైన పాత్రల్లో మెప్పిస్తూ వస్తున్న ఐశ్వర్య సంక్రాంతికి వస్తున్నాం హిట్ తో టాలీవుడ్ లో కూడా సక్సెస్ సాధించింది. ఐతే ఈ హిట్ తో మరిన్ని అవకాశాలు రాబట్టాలని చూస్తుంది అమ్మడు. సంక్రాంతికి వస్తున్నాం హిట్ తో కెరీర్ లో జోష్ కనబరుస్తుంది. ఇక హిట్ జోష్ లో వరుస ఇంటర్వ్యూస్ చేస్తున్న ఐశ్వర్య రాజేష్ రీసెంట్ ఇంటర్వ్యూలో తెలుగులో బెస్ట్ పెర్ఫార్మర్ ఎవరన్న ప్రశ్నకు ఇంట్రెస్టింగ్ ఆన్సర్ ఇచ్చింది. తన దృష్టిలో బెస్ట్ పెర్ఫార్మర్ ఎన్టీఆర్ అని అన్నది. జూనియర్ ఎన్టీఆర్



అభిమానిని నేను. ఎన్టీఆర్ డైలాగ్ డెలివరీ, డ్యాన్సుల్లో స్పెషాలిటీ ఉంటుందని అన్నది ఐశ్వర్య రాజేష్. అందరి ప్రదర్శన ఇష్టమే కానీ ఎన్టీఆర్ నా ఫేవరెట్ అని చెప్పింది అమ్మడు.

ఎన్టీఆర్ నటన గురించి ఇప్పటికే చాలామంది భామలు చెప్పారు. ఇప్పుడు ఆ లిస్ట్ లో ఐశ్వర్య కూడా చేరింది. ప్రస్తుతం తారక్ పై ఐశ్వర్య రాజేష్ చేసిన కామెంట్స్ ని ఎన్టీఆర్ ఫ్యాన్స్ వైరల్ చేస్తున్నారు. ఇక ఐశ్వర్య కెరీర్ విషయానికి వస్తే సంక్రాంతికి వస్తున్నాం తో తెలుగులో తొలి సక్సెస్ అందుకుంది అమ్మడు. ఇలా హెూంలీ రోల్స్ తో తెలుగులో కూడా తన సత్తా చాటాలని చూస్తుంది ఐశ్వర్య. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో మీనాక్షి చౌదరి కన్నా వెంకటేష్ భార్యగా నటించిన ఐశ్వర్య రాజేష్ కే ఎక్కువ మార్కులు పడ్డాయని చెప్పొచ్చు. ఎన్టీఆర్ తన ఫేవరెట్ అని చెప్పింది కాబట్టి ఈ కామెంట్స్ విన్న ఏ డైరెక్టర్ అయినా తారక్ సినిమాలో ఛాన్స్ ఉంటే మాత్రం ఐశ్వర్య రాజేష్ ని తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పొచ్చు.




# ఇంటర్నేషనల్ లెవెల్ లో పాపులర్ అవుతున్న బాలయ్య పాట



సౌత్ సినిమా స్థాయి ఈ మధ్య బాగా పెరిగిపోయింది. ఒకప్పుడు తెలుగు సినిమా అంటే చిన్న చూపు చూసే వారంతా ఇప్పుడు అదే తెలుగు సినిమా కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అంత గొప్ప స్థాయికి తెలుగు సినిమా ఎదిగింది. పుష్ప సినిమాలోని శ్రీవల్లి స్టెప్ నుంచి తగ్గేదేలే డైలాగ్ వరకు అన్నీ నేషనల్ లెవెల్ లో ఎంత పాపులర్ అయ్యాయో తెలిసిందే.

ఇప్పుడు బాలయ్య నటించిన డాకు మహారాజ్ లోని దబిడి దిబిడి సాంగ్ కూడా అదే విధంగా పాపులరవుతోంది. సినిమా రిలీజ్ టైమ్ లో ఈ సాంగ్ వచ్చినప్పుడు అందరూ ఇదేం పాట, ఇవేం స్టెప్స్ అని విమర్శించారు. విమర్శించిన వారంతా విస్తుబోయేలా ఈ సాంగ్ దేశం దాటి మరీ పాపులారిటీని దక్కించుకుంటుంది. బాలయ్య, ఊర్వశీ కలిసి చేసిన ఈ పాటలోని డ్యాన్స్ మూమెంట్స్ ను రీ క్రియేట్ చేస్తూ వేల మంది రీల్స్ చేస్తున్నారు. ఈ పాటకు రీల్స్ చేస్తే ఎవరికైనా మంచి వ్యూస్ రావడం గ్యారెంటీ. ఈ కారణంతోనే దబిడి దిబిడి సాంగ్ ఇంటర్నేషనల్ లెవెల్ లో వైరల్ అవుతుంది. రీసెంట్ గా ఏ ఫంక్షన్ జరిగినా ఈ పాటకు డ్యాన్సులేస్తున్నారు జనాలు. ఇటీవలే కాలేజ్ అమ్మాయిలు హాస్టల్ లో వేసిన దబిడి దిబిడి స్టెప్పులు వైరల్ అవగా, ఇప్పుడు విదేశీ అమ్మాయిలు ఈ సాంగ్ కు వేసిన స్టెప్పులు నెట్టింట వైరల్ అవుతున్నాయి. పుష్ప పాట తర్వాత ఓ సాంగ్ ఈ రేంజ్ లో వైరల్ అవుతుందంటే అది ఈ పాటే. చూస్తుంటే ముందు ముందు ఈ పాటకు మరింత రీచ్ పెరగడం ఖాయం.

దబిడి దబిడి సాంగ్ కోసం తమన్, మ్యూజికల్ ఫ్యాన్స్ ఏం కోరుకుంటారో అదే ఇచ్చాడు. ఆ పాటకు శేఖర్ చేసిన కొరియోగ్రఫీని కూడా ఫ్యాన్స్ ఎంజాయ్ చేస్తున్నారు. మొదట్లో ఈ సాంగ్ స్టెప్స్ పై నెట్టింట తీవ్ర విమర్శలొచ్చాయి. ఇప్పుడు వారంతా ఈ సాంగ్ ఇంటర్నేషనల్ లెవెల్ లో ట్రెండ్ అవడాన్ని చూసి షాకవుతున్నారు.


# డాకు మహారాజ్ డిజిటల్ హంగామాకి సిద్ధమా..?



నందమూరి బాలకృష్ణ హీరోగా కె ఎస్ బాబీ డైరెక్షన్ లో తెరకెక్కిన సినిమా డాకు మహారాజ్. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చున్ ఫోర్ మూవీస్ కలిసి నిర్మించిన ఈ సినిమాకు థమన్ మ్యూజిక్ అందించారు. ఈ ఇయర్ సంక్రాంతికి రిలీజైన ఈ మూవీ నందమూరి ఫ్యాన్స్ కి మాస్ ఫీస్ట్ అందించింది. బాలయ్య మా సినిమా చేయడం కామనే కానీ స్టైలిష్ యాక్షన్ అది కూడా బాబీ మార్క్ టేకింగ్ తో వస్తే ఎలా ఉంటుందో డాకు మహారాజ్ తో చూపించారు. ఈ సినిమా లో శ్రద్ధ శ్రీనాథ్, ప్రగ్య జైశ్వాల్ హీరోయిన్స్ గా నటించగా ఊర్వశి రౌతెలా స్పెషల్ రోల్ చేశారు. పొంగల్ కి బాలయ్య సినిమా వస్తే పక్కా హిట్ అనే సెంటిమెంట్ ని మరోసారి ఈ సినిమా ప్రూవ్ చేసింది. థియేట్రికల్ రిలీజ్ లో సక్సెస్ సాధించిన డాకు మహారాజ్ ఇప్పుడు డిజిటల్ రిలీజ్ కు రెడీ అయ్యింది. డాకు మహారాజ్ ఓటీటీ రిలీజ్ ఎప్పుడెప్పుడా అని నందమూరి ఫ్యాన్స్ ఎదురుచూశారు. ఐతే వారి ఎదురుచూపులు ఫలిచినట్టుగా సినిమా ఓటీటీ రిలీజ్ డేట్ ప్రకటించారు. డాకు మహారాజ్ డిజిటల్ రైట్స్ ని నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. సినిమాపై ఉన్న అంచనాలు తెలుసు కాబట్టి రిలీజ్ ముందే ఓటీటీ హక్కులు నెట్ ఫ్లిక్స్ భారీ మొత్తానికి కొనేసినట్టు తెలుస్తుంది. ఐతే ఈ సినిమాను ఫిబ్రవరి 21న నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ చేస్తున్నారు. దీనికి సంబంధించిన అఫీషియల్ పోస్టర్ కూడా వచ్చేసింది. స్టార్ సినిమాలు ఓటీటీ రిలీజ్ డేట్ సినిమా రిలీజైన ఎనిమిది వారాల కండీషన్ ఉంది. ఐతే కొన్ని సినిమాలకు ఆ కండీషన్ ని సడలిస్తారు. జనవరి 12న డాకు మహారాజ్ రిలీజ్ కాగా సినిమా రిలీజైన 40 రోజుల్లో ఓటీటీ రిలీజ్ అవుతుంది. థియేట్రికల్ లో హిట్ అందుకున్న ఈ సినిమా ఓటీటీలో ఎలాంటి సందడి చేస్తుందో చూడాలి. ఇప్పటికే డా కు మహారాజ్ సాంగ్స్ వరల్డ్ వైడ్ గా ట్రెండ్ అవుతున్నాయి. ఇక సినిమా ఓటీటీ రిలీజ్ అయ్యాక మరింత హంగామా జరిగేలా ఉంది. డాకు మహారాజ్ తర్వాత బాలయ్య బోయపాటి శ్రీనుతో అఖండ 2 చేస్తున్నాడు. ఈ సినిమా కూడా ఈ ఇయర్ దసరాకి రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు.

# కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రండి: రకుల్


ఒకప్పుడు టాలీవుడ్ లో అగ్ర హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్ స్టార్ హీరోలందరితో కలిసి సినిమాలు చేసింది. కానీ గత కొంత కాలంగా రకుల్ కు ఆశించిన స్థాయిలో సినిమాలు రావడం లేదు. అమ్మడు చివరిగా ఇండియన్2 సినిమాతో ఆడియన్స్ ముందుకు వచ్చింది. కానీ ఆ సినిమాలో పెద్దగా గుర్తింపు లేని పాత్ర చేసిన రకుల్ ఇప్పుడు తన భర్త నిర్మాణంలో బాలీవుడ్ లో ఓ సినిమా చేస్తోంది. ప్రస్తుతం రకుల్ తన ఫోకస్ మొత్తం బాలీవుడ్ పైనే పెట్టింది. అమ్మడు ఇప్పుడు అజయ్ దేవగన్, మాధవన్ తో కలిసి దే దే ప్యార్ దే2 సినిమాలో నటిస్తోంది. దీంతో పాటూ తమిళంలో కమల్ హాసన్ హీరోగా తెరకెక్కనున్న ఇండియన్3 లో కూడా నటించనుంది. రకుల్ కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గానే ఉంటుంది. తన సినిమాలకు సంబంధించిన అప్డేట్స్ తో పాటూ, వ్యక్తిగత అభిప్రాయాలను కూడా



రకుల్ తన సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఉంటుంది. అందులో భాగంగానే రకుల్ తాజాగా తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ చేసింది. అందులో అలవాటైన పనుల నుంచి, ప్రాంతాల నుంచి బయటకు రమ్మని, కంఫర్ట్ గా ఉన్న ప్లేసే మీకెప్పుడూ శత్రువుగా మారుతుందని రాసి ఉన్న కోట్ ను పోస్ట్ చేసింది. ప్రజలు సోమరితనంగా మారడానికి కారణం ఎప్పుడూ ఒకే ప్లేస్ లో ఉండటమని, దాని వల్ల సౌకర్యం ఎక్కువ అవుతుందని, ఎవరూ ఒక వర్క్ నుంచి మరో వర్క్ కు మారడం లేదని, రెగ్యులర్ గా అలవాటైన పనినే చేస్తున్నారని, వీటన్నింటినీ అలవాటు పడి ఏదైనా కావాలనుకున్నప్పుడు కూడా రేపు చూద్దాంలే అనుకుంటున్నారని, ఈ కారణాల చేతే చాలా మంది ఎదగడం లేదని రకుల్ షేర్ చేసిన కోటేషన్ లో ఉంది. ఎవరైనా సరే జీవితంలో పైకి ఎదగాలంటే కఠినమైన విషయాల గురించి ఆలోచించాలని, వాటిని ఆచరణలో పెట్టాలని అప్పుడే సక్సెస్ అందుకుంటామని, అలవాటైన ప్రాంతం అందంగా ఉన్నప్పటికీ అది జీవితంలో పైకి ఎదగనీయదని రాసి ఉన్న కొటేషన్ ను రకుల్ షేర్ చేసింది. ఇక రకుల్ తన గురించి చెప్తూ తాను చాలా స్ట్రాంగ్ అని, తనను తాను ఎక్కువగా ప్రేమించుకుంటానని, ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకుంటాననని రకుల్ తెలిపింది.

# పెళ్లి తర్వాత మళ్లీ చెలరేగుతోందిగా

ఆప్ నాయకుడు రాఘవ్ చద్దాను పెళ్లాడాక పరిణీతి చోప్రా కొంత స్తబ్ధుగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రేమ వివాహం తర్వాత కొంతకాలంగా గ్లామరస్ ఫోటోషూట్లకు బ్రేక్ పడింది. కానీ ఇప్పుడు మళ్లీ యథావిధిగా ఈ బ్యూటీ వరుస ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. పారీ తనదైన గ్లామర్ ని ఎలివేట్ చేస్తూ వరుస ఫోటోషూట్ల లో పాల్గొంటోంది. తాజాగా పారి ఒక భారీ లాంచ్ ఈవెంట్‌లో కనిపించింది. ఆ సమయంలో తన యూనిక్ లుక్ అందరి దృష్టిని ఆకర్షించింది. నిజానికి పరిణీతి ఫ్యాషన్ గేమ్ ఇటీవల పెద్ద చర్చగా మారింది. పరిణీతి ఆల్ క్లాసిక్ బ్లాక్ లుక్ లో అందరి దృష్టిని ఆకర్షించింది. మోనోక్రోమ్ స్టైల్‌తో ఆఫ్ షోల్డర్ మినీ డ్రెస్‌లో పారీ ప్రత్యేకంగా కనిపించింది. ఈ లుక్ కి తగ్గట్టే ఎంపిక చేసుకున్న ఆభరణాలు ఆకట్టు



కున్నాయి. ఇంతకుముందు పరిణీతి బ్రౌన్ బాడీకాన్ డ్రెస్‌లో ఫోటో షూట్ లో పాల్గొంది. ఆఫ్ షోల్డర్ ప్యాటర్న్ ఫిగర్ గ్రేజింగ్ స్టైల్ ఎంతో ఆకట్టుకుంది. ఆసక్తికరంగా పరిణీతి మేకప్ లెస్ రూపంలో కనిపిస్తోంది. వేదికలపై అనవసర హంగామాను సృష్టించేందుకు ఈ భామ అస్సలు ఇష్టపడదు. పరిణీతి నెక్ట్స్ ఏంటి? అంటే... ఈ భామ కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంది. కొత్తగా పెళ్లయింది గనుక పారీ తన భర్త కోసం విలువైన సమయాన్ని వెచ్చిస్తోంది. ఇంతలోనే ఈ బ్యూటీ తిరిగి నటనలోకి రీఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతోంది. ప్రముఖ దర్శకనిర్మాతలతో మంతనాలు సాగిస్తోందని సమాచారం.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536